www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

పశ్చిమాసియా ఉద్రిక్తం!

ఇజ్రాయెల్‌పై దాడికి సిద్ధంగా ఇరాన్

ఉగ్ర సంస్థ హిజ్బొల్లాకు పూర్తి మద్దతు

ఇజ్రాయెల్‌కు అండగా రంగంలోకి అమెరికా

యుద్ధ నౌక, జెట్లను పంపుతున్న అగ్రరాజ్యం

భారత పౌరులను అప్రమత్తం చేసిన ఎంబసీలు

విమాన సర్వీసులను రద్దు చేస్తున్న పలు సంస్థలు

2

ఆదివారం | 4-8-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 110 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: అమావాస్య సా. 4.43 తదుపరి పాడ్యమి; నక్షత్రం: పుష్యమి మ. 1.26 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: తె. 3.15-4.59; దుర్ముహూర్తం: సా. 5.01-5.52; అమృతఘడియలు: ఉ. 6.38-8.20; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 5.59; సూర్యాస్తమయం: 6.43 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రణమా.. రాజకీయమా?



1983లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించినప్పుడు శాసనసభ లోపలా, వెలుపలా అప్పుడప్పుడూ ఉభయ పక్షాల మధ్యా ఉద్రిక్త పరిస్థితులు కనిపించేవి కానీ, ఇప్పటిలా ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు ముఖాముఖి కలుసుకోలేని పరిస్థితులు ఉండేవి కావు.

ఉమ్మడి రాష్ట్రంలో కీలక అంశాలపై ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాలను నిర్వహించి నిర్ణయాలు తీసుకొనేది. రాష్ట్రం విడిపోయాక అఖిలపక్ష సమావేశాలు జరగడాన్ని చూడలేదు. రానురానూ ఈ పరిస్థితి మరింత వికటించి శాసనసభ లోపలా వెలుపలా ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు కళ్లలో కళ్లు పెట్టి చూసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి.

ఆంధ్రప్రదేశ్ శాసనసభలో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పరిస్థితులు మరింత వికటించాయి. 2019 ఎన్నికల్లో ప్రజలు తనకు 23 సీట్లు మాత్రమే ఇచ్చినప్పటికీ చంద్రబాబు నాయుడు కుంగిపోకుండా, సభకు హాజరవడాన్ని నామోషీగా భావించకుండా శాసనసభ సమావేశాలలో పాల్గొన్నారు. అధికారంలో ఉన్న వైసీపీ అడుగడుగునా అవమానించినా భరించారు.

జగన్మోహన్ రెడ్డి సంఖ్యా బలం లేకపోయినా తనకు ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వకపోతే శాసనసభకు హాజరు కాబోనని ప్రకటించారు. నాకు చాక్లెట్ కొనివ్వకపోతే బడికి వెళ్లనని విద్యార్థి మారాం చేసినట్టుగా ఆయన వ్యవహరిస్తున్నారు. ఐదేళ్లపాటు రారాజుగా వ్యవహరించిన తాను ప్రతిపక్షంలో కూర్చోవడం ఏమిటి? నాన్సెన్స్! అని భావిస్తున్నట్టు ఉంది.

తెలంగాణ శాసనసభలో దానం నాగేందర్ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయి. వీధి పోరాటాల సందర్భంగా వాడే భాషను ఆయన వ్యాఖ్యలు తలపించాయి. ఇలాంటి భాషను నిన్నటి వరకు ఆంధ్రప్రదేశ్ శాసనసభలో విన్నాం. ఇప్పుడు ఆ రాష్ట్ర శాసనసభ సమావేశాలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. జగన్మోహన్ రెడ్డి సభకు హాజరు కావడం లేదు కనుక సభలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడం లేదు.

వైసీపీ తరఫున గెలిచిన పదకొండు మందిలో మాటకారితనం ఉన్న వాళ్లు ఉన్నారో లేదో తెలియదు. బూతు భాషకు అలవాటు పడిన వారందరూ తాజా ఎన్నికల్లో ఓడిపోయారు కనుక ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఇప్పుడు బూతులు వినపడకపోవచ్చు.

చంద్రబాబు నాయుడు ఈ పర్యాయం మరింత పరిణతి ప్రదర్శిస్తున్నారు. పర్యటనల సందర్భంగా హంగూ ఆర్భాటాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అధికారం దక్కించుకున్న చంద్రబాబులోనే ఇంత మార్పు వచ్చినప్పుడు, అధికారం కోల్పోయిన జగన్ రెడ్డిలో ఏ మార్పూ కనిపించకపోవడం ఆశ్చర్యంగా ఉంది.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..

జల సంధానం!

గోదావరి-పెన్నా-కావేరీ అనుసంధానం



కడప, చిత్తూరులో కొత్తగా 5 లక్షల ఎకరాల ఆయకట్టు

ప్రకాశం, గుంటూరు, నెల్లూరులోని వెనుకబడిన ప్రాంతాలకు జలకళ

సాగర్ పరిధిలోని మెట్ట ప్రాంతాలను తడపనున్న 80 టీఎంసీలు

బొల్లాపల్లిలో రిజర్వాయర్ నిర్మాణం..

ప్రతిపాదనలతో సిద్ధమైన రాష్ట్ర ప్రభుత్వం

ఒక ఎకరం కూడా సేకరించాల్సిన పనిలేదు

పైప్‌లైన్లు, కాలువల ద్వారానే జలాల తరలింపు

రూ. 25వేల కోట్లతో అనుసంధానం పూర్తి

పెన్నా బేసిన్‌కు గోదావరి జల కళ

రాయలసీమ కరువు తీరే అవకాశం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

నదుల అనుసంధాన ప్రక్రియ మరోసారి తెరపైకి వచ్చింది. కేంద్రంలో మూడోసారి అధికార పగ్గాలు చేపట్టిన ప్రధాని మోదీ గోదావరి - కావేరి నదుల అనుసంధానంపై దృష్టి సారించారు. ఈ సంధానం రాష్ట్రానికి మేలు చేసేలా... మరీ ముఖ్యంగా రాయలసీమతోపాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని వెనుకబడిన ప్రాంతాలకు మేలు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ ప్రణాళికలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రకాశం జిల్లా బొల్లాపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మిస్తుంది. అక్కడి నుంచి అవుకు, సోమశిల ఫోర్‌షోర్ మీదుగా కండలేరుకు గోదావరి జలాలను పంపిస్తారు. అంతిమంగా చెన్నైకు మూడు విడతల్లో 50 టీఎంసీల జలాలు

మిగతా 12వ పేజీలో...

అనుసంధానం ఇలా..

పోలవరం ప్రాజెక్టు ఎగువన ఉన్న చింతలపూడి ఎత్తిపోతల పథకానికి పోలవరం కుడి ప్రధాన కాలువ ద్వారా 320 టీఎంసీల గోదావరి జలాలను తరలిస్తారు. ఈ జలాలను గుంటూరు జిల్లా బొల్లాపల్లి వద్ద నిల్వ చేసేలా ఒక రిజర్వాయరు నిర్మిస్తారు. నాగార్జునసాగర్ ఆయకట్టుకు నీళ్లిస్తూనే .. వెలిగొండ రిజర్వాయరుకు జలాలు చేర్చి అక్కడి నీటి అవసరాలు తీరుస్తారు. ఆపై పెన్నా నదికి నీరు చేరుతుంది. సోమశిల ప్రాజెక్టు ద్వారా తెలుగుగంగకు.. గాలేరు నగరి, హంద్రీనీవా సుజల స్రవంతిలోకి గోదావరి జలాలను తరలిస్తారు. అక్కడినుంచి అంతిమంగా కావేరికి గోదావరి జలాలు చేరతాయి.

100 రోజుల్లో.. వ్యవస్థలు గాడిలో

భూకుంభకోణాలపై ఉక్కుపాదం మోపుతాం

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు

టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో చంద్రబాబు

ప్రతి మండలంలోనూ భూకుంభకోణం

రెవెన్యూ రికార్డులన్నీ అస్తవ్యస్తం

కఠిన చర్యల ద్వారా ప్రక్షాళన చేస్తా: సీఎం



మంగళగిరి టీడీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో సీఎం చంద్రబాబుకు తన బాధను చెప్పుకొంటూ రోదిస్తున్న మహిళ

11

3 గంటలు నిలబడే!

గ్రీవెన్స్‌లో వినతులు స్వీకరించిన చంద్రబాబు

వేల అర్జీదారులతో ఎన్టీఆర్ భవన్ కిటకిట

విశాఖ ఉక్కుకు చంద్రబాబు భరోసా

బాబును చూసి గోనె ప్రకాశరావు కళ్లనీళ్లు

టీడీపీ ఆఫీసుకు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే

రేపు కలెక్టర్ల సమావేశం

ఒక్కరోజే నిర్వహణకు నిర్ణయం

దిశానిర్దేశం చేయనున్న సీఎం



పశ్చిమ బెంగాల్‌లోని నదియలో వరద నీటిలో చిన్నారితో మహిళ

వణుకుతున్న ఉత్తరాది

2

హిమాచల్‌ప్రదేశ్ అతలాకుతలం

4రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలు

కోల్‌కతా ఎయిర్‌పోర్టులోకి వరద

జార్ఖండ్‌లో పలు ప్రాంతాలు జలమయం

శ్రీశైలానికి 4.24 లక్షల క్యూసెక్కులు

కొనసాగుతున్న వరద ఉధృతి.. 10 గేట్ల నుంచి సాగర్‌కు 5.24 లక్షల క్యూసెక్కులు విడుదల

గోదావరి వరద తగ్గుముఖం

3

ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.50 అడుగులు

సముద్రంలోకి 5,81,417 క్యూసెక్కుల వరద.. పోలవరం స్పిల్‌వే నుంచి 6.70 లక్షల క్యూసెక్కులు విడుదల



ప్రముఖ నృత్యకారిణి

యామినీ కృష్ణమూర్తి కన్నుమూత

7 నెలలుగా ఢిల్లీ అపోలో ఆసుపత్రి ఐసీయూలో చికిత్స

మదనపల్లెలో జననం.. అసలు పేరు యామినీ పూర్ణతిలకం

17వ ఏటనే చెన్నైలో నృత్య ప్రదర్శనతో అరంగేట్రం

భరతనాట్యం, కూచిపూడి, ఒడిస్సీ నృత్యాల్లో ప్రావీణ్యం

దేశ, విదేశాల్లో వేలాది ప్రదర్శనలతో ఖండాంతర ఖ్యాతి

పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్‌తో సత్కరించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, అమరావతి(ఆంధ్రజ్యోతి)/మదనపల్లె టౌన్, ఆగస్టు 3: ప్రముఖ భరతనాట్య, కూచిపూడి నృత్య కళాకారిణి యామినీ కృష్ణమూర్తి(84) కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో ఆమె గత కొంతకాలంగా బాధపడుతున్నారు. ఏడు నెలల నుంచి ఢిల్లీలోని అపోలో ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస

మిగతా 11వ పేజీలో...

లేట'రైట్.. రైట్'!

జగన్ ప్రభుత్వంలో తవ్వకాలు.. ఇప్పుడు తరలింపు



అది నాణ్యమైన లేటరైట్.. ప్రాసెస్ చేస్తే బాక్సైట్

లీజు ఒకచోట.. తవ్వకాలు చేసింది మరోచోట

కూటమి సర్కారులోనూ వైసీపీ నేతల బరితెగింపు

ప్రత్తిపాడులోని ఓ యార్డ్‌లో లక్షన్నర టన్నుల నిల్వ

జగ్గయ్యపేటకు కొంత.. 'కాకినాడ'కు మరికొంత

విదేశాలకు ఎగుమతి చేసి కోట్లు కొల్లగొట్టే యోచన

కాకినాడ గనుల అధికారిని సెలవుపై పంపిన వైనం

ఆ వెంటనే ఆరు జేసీబీలతో తరలింపు ప్రక్రియ మొదలు

గాలి జనార్దన్‌రెడ్డి లీజుకు తీసుకున్నది ఓబుళాపురం గనులు! ఖనిజాన్ని తవ్వింది మాత్రం కర్ణాటకలో! అక్కడ తవ్వుకున్న నాణ్యమైన ఖనిజాన్ని తరలించేందుకే 'ఓబుళాపురం' అనే ముసుగు! ఏపీలో అచ్చంగా ఇలాగే జరిగింది. కాకపోతే... అక్కడ ఇనుప ఖనిజం. ఇక్కడ లేటరైట్. జగన్ ప్రభుత్వంలో ఉండగా అక్రమంగా తవ్వుకొని దాచిపెట్టుకున్న లక్షన్నర టన్నుల లేటరైట్‌ను ఇప్పుడు గుట్టుగా తరలిస్తున్నారు. దానికి రాయల్టీ, సీనరేజీ ఇతర ఫీజులేవీ ఉండవు. ఎందుకంటే దానికి ఏ అనుమతీ లేదు కాబట్టి. దాని విలువ రూ.120 కోట్లపైమాటే!.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చీరాగానే అసైన్డ్ భూముల అక్రమాలు, అమరావతి నిర్మాణం తదితర అంశాల్లో బిజీబిజీగా ఉంటోంది. ఇదే సరైన సమయం అనుకున్న వైసీపీ నేతలు లేటరైట్‌ను సైలెంట్‌గా తరలించుకుపోతున్నారు. ముడి ఖనిజాన్ని ప్రాసెస్ చేయగా వచ్చే బాక్సైట్‌ను కాకినాడ పోర్టు ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు. తమ పని సజావుగా సాగేందుకు కాకినాడకే చెందిన గనుల శాఖ కీలక అధికారిని సెలవుమీద పంపించేశారు!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం మారింది! కానీ... పరిస్థితులను మాత్రం వైసీపీ అక్రమార్కులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. గతంలో అడ్డగోలుగా తవ్వుకున్న లేటరైట్ ఖనిజాన్ని ఇప్పుడు దర్జాగా తరలించుకుపోతున్నారు. జగన్ హయాంలో ఓ జిల్లా పేరిట ఏర్పాటైన కంపెనీ ప్రత్తిపాడు మండలం చింతలూరు పరిధిలో లేటరైట్ లీజు పొందింది. నిజానికి... అక్కడ నాణ్యమైన లేటరైట్ లేదు. అది తెలిసీ అక్కడ లీజు తీసుకున్నారు. ఈ లీజును అడ్డుపెట్టుకొని, పక్కనే ఉన్న అటవీ ప్రాంతంలోని లేటరైట్ కొండను తవ్వుకోవాలన్నది వారి అసలు ఆలోచన. ఇందుకు అక్కడి అటవీ, గనుల శాఖ అధికారులు సహకరించేలా అన్ని ఏర్పాట్లూ చేసుకున్నారు. ఎన్నికల ముందు వరకు 10 లక్షల టన్నుల లేటరైట్‌ను అటవీప్రాంతంలో తవ్వితీశారు. ఆ లేటరైట్ తమ లీజు ఏరియాలోనే తవ్వినట్లుగా రికార్డులు మార్చేశారు. అదే పద్ధతిలో సిమెంట్ ఫ్యాక్టరీలకు అమ్ముకున్నారు. అప్పుడు ఈ లీజును ప్రత్యక్షంగా పరోక్షంగా వైసీపీకి చెందిన ఓ కీలకనేత కుమారుడే

మిగతా 11వ పేజీలో...

సీఆర్‌డీఏలో ఫైళ్లు మాయం!

పలు శాఖల్లో కనిపించని కీలక ఫైల్స్

అమరావతి, ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులలో చంద్రబాబు, లోకేశ్‌లను ఇరికించేందుకు గతంలో కుట్ర

వైసీపీ ప్రభుత్వ ఆదేశాలతో ఫైల్స్ స్వాధీనం

కొన్ని తిరిగొచ్చినా మరికొన్ని రాలేదు

ఫైళ్లు కనిపించక పాలనలో గందరగోళం

విజయవాడ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాజధాని ప్రాంత ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) కార్యాలయంలో పలు కీలక ఫైల్స్ కనిపించడం లేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ ప్రభుత్వ తప్పులను పట్టుకుని, కేసులు పెట్టేందుకు సీఆర్‌డీఏ ఫైల్స్‌ను అణువణువూ శోధించింది. విచారణ కోసం పలు ఫైళ్లను స్వాధీనం చేసుకుంది. వీటిలో కొన్ని కీలక ఫైళ్లు ఇప్పటికీ

మిగతా 11వ పేజీలో...

ఆగని వైసీపీ నేతల ఆగడాలు

అనకాపల్లి జిల్లా హరిపురంలో భూ కబ్జాలు

నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్లు


12

భూ యజమానులకు బెదిరింపులు

కబళించింది 86వేల మీటర్ల కొండచరియ

ఇరువంజిపుళ నదిలో 8 కి.మీ ప్రయాణం

» వయనాడ్ విషాదంపై ఇస్రో ఉపగ్రహ చిత్రం వెల్లడి



వయనాడ్/హైదరాబాద్, ఆగస్టు 3: కేరళలోని వయనాడ్ విషాదం వెనుక 86 వేల చదరపు మీటర్ల భారీ కొండచరియ ఉన్నట్లు భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం(ఇస్రో) వెల్లడించింది. హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్‌సీ) తీసిన ఉపగ్రహ చిత్రాల ద్వారా ఈ విషయం వెల్లడైనట్లు వివరించింది. ఆ మేరకు ఉపగ్రహ చిత్రాలను విడుదల చేసింది. ఓ కొండ పైభాగంలో విరిగి పడిగా మిగిలిన ప్రాంతాన్ని చిత్రంలో చూపిస్తూ.. గతంలో విరిగి పడ్డ కొండ చరియ ఆనవాళ్లు కూడా ఉన్నట్లు పేర్కొంది. అంటే.. 86 వేల చదరపు మీటర్ల మేర కొండ భాగం భారీ ముక్కలుగా విడిపోయి.. కిందకు దూసుకుపోయినట్లు తెలిపింది. అంతేకాదు.. సముద్ర మట్టానికి 1,550 మీటర్ల ఎత్తులోంచి కొండచరియలు జారుతూ.. ఇరువంజిపుళ నదిలో 8 కిలోమీటర్ల దూరం ప్రయాణించినట్లు పేర్కొంది. ఈ క్రమంలో అడ్డొచ్చిన చూరల్‌మల, ముండక్కై, అట్టమల గ్రామాల్లోని ఇళ్లు, చెట్లు, నదీ తీరాలను తుడిచిపెట్టేశాయని వివరించింది. ఈ కారణంగా ఆస్తి నష్టం, ప్రాణనష్టం అధికంగా ఉందని అధికారులు చెబుతున్నారు. శనివారం సాయంత్రానికి మరణాల సంఖ్య 344గా ఉన్నట్లు, ఇంకా 200 మంది జాడ తెలియరాలేదని వెల్లడించారు. భారత సైన్యం శిథిలాల కింద గాలింపును కొనసాగిస్తోందని, ఈ క్రమంలో ఓ కుటుంబానికి చెందిన నలుగురిని కాపాడారని పేర్కొన్నారు. మరోవైపు గుర్తించని మృతదేహాలకు సామూహిక ఖననాలను నిర్వహిస్తున్నట్లు అధికారులు వివరించారు. కాగా, కల్పేట అటవీ అధికారులు ప్రాణాలకు తెగించి చేసిన సాహసం.. పనియా తెగకు చెందిన ఓ కుటుంబాన్ని కాపాడింది. కొండచరియలు విరిగి పడ్డ రెండో రోజు కల్పేట అటవీ అధికారి కె.హాషిస్ నేతృత్వంలోని నలుగురు సభ్యుల బృందం దట్టమైన అటవీ ప్రాంతానికి చేరుకుంది. అక్కడ నిటారుగా ఉండే ఓ కొండను తాళ్ల సాయంతో ఎక్కి.. ఓ గుహలో తలదాచుకున్న పనియా తెగకు చెందిన ఓ గిరిజన కుటుంబాన్ని కాపాడింది. ఆ కొండను ఎక్కడానికి నాలుగున్నర గంటల సమయం పట్టిందని, దట్టమైన పొగమంచు ఒకవైపు.. భారీ వర్షం, విరిగిపడుతున్న కొండచరియలు ఇంకోవైపు ప్రతికూలంగా ఉన్నా.. ఆ ప్రాంతానికి చేరుకున్నట్లు హాషిస్ తెలిపారు. వారిని తాళ్ల సాయంతో కాపాడారు. ఫారెస్ట్ అధికారుల సాహసాన్ని ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఎక్స్‌లో కొనియాడారు.

బీఎస్ఎఫ్ తాత్కాలిక డీజీగా దల్జిత్ సింగ్ చౌధరి



న్యూఢిల్లీ, ఆగస్టు 3: బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) తాత్కాలిక డైరెక్టర్ జనరల్‌గా దల్జీత్ సింగ్ చౌధరిని నియమిస్తూ శనివారం కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ)కి డైరెక్టర్ జనరల్‌గా వ్యవహరిస్తున్నారు. శాశ్వత ప్రాతిదికన డైరెక్టర్ జనరల్‌ను నియమించే వరకుగానీ, తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకుగానీ కేంద్ర ఉత్తర్వులు అమల్లో ఉండనున్నాయని హోం శాఖ అండర్ సెక్రటరీ సంజీవ్ కుమార్ తెలిపారు. దల్జీత్ సింగ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించినట్టు పేర్కొన్నారు. ఇంతవరకు బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్‌గా పనిచేసిన నితిన్ అగర్వాల్‌ను శుక్రవారమే అర్ధాంతరంగా తొలగించి సొంత కేడర్ అయిన కేరళకు పంపించింది. జమ్మూ ప్రాంతంలో ఇటీవల కాలంలో ఉగ్రవాదుల దుశ్చర్యలు పెరిగిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకొంది.

దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని.. ఆరుగురు ఉద్యోగుల డిస్మిస్

» ఆర్టికల్ 311(2)(సీ) ప్రయోగించిన జమ్మూకశ్మీర్ ఎల్జీ

శ్రీనగర్, ఆగస్టు 3: దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన ఆరుగురిని జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ఉద్యోగాల నుంచి తొలగించింది. వీరిలో ఐదుగురు పోలీసులు, ఒక ఉపాధ్యాయుడు ఉన్నట్టు అధికారులు శనివారం వెల్లడించారు. వారిని విధుల నుంచి తొలగించడానికి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా రాజ్యాంగంలోని ఆర్టికల్ 311(2)(సీ)ని ప్రయోగించారని చెప్పారు. ఎవరైనా ఉద్యోగులు ప్రభుత్వ విధుల్లో కొనసాగడం వల్ల రాష్ట్ర భద్రతకు ముప్పు అని రాష్ట్రపతి లేదా గవర్నర్ భావించినట్లైతే సాధారణ ప్రక్రియను అనుసరించకుండానే వారిని ఉద్యోగాల నుంచి తొలగించే అధికారాన్ని ఈ ఆర్టికల్ కల్పిస్తుంది. హెడ్ కానిస్టేబుల్ ఫరూక్ అహ్మద్ షేక్, సెలక్షన్ గ్రేడ్ కానిస్టేబుళ్లు ఆసిఫ్ దీన్, ఖాలిద్ హుస్సేన్ షా, ఇర్షాద్ అహ్మద్ చాకూ, కానిస్టేబుల్ రెహ్మత్ షా, ఉపాధ్యాయుడు నజం దీన్ ఉగ్రవాద సంబంధిత, తీవ్రమైన దేశవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్టు ఇంటెలిజెన్స్, దర్యాప్తు సంస్థలు గుర్తించాయని అధికారులు తెలిపారు. వీరంతా మాదక ద్రవ్యాల విక్రయంతోపాటు హిజ్బుల్ ముజాహిదీన్, లష్కరే తాయిబా వంటి ఉగ్రవాద సంస్థలకు క్షేత్రస్థాయి కార్యకర్తలుగా పనిచేస్తున్నారని, ఉగ్రవాదులు జమ్మూకశ్మీర్‌లోకి చొరబడేందుకు సహకరిస్తున్నారని చెప్పారు. ఇలా సంపాదించిన డబ్బును జమ్మూకశ్మీర్‌లో అశాంతిని రేకెత్తించడానికి, ఉగ్రవాద సంస్థలకు నిధులు సమకూర్చేందుకు వినియోగిస్తున్నారని తెలిపారు. ఆయుధాల, మత్తుపదార్థాల స్మగ్లింగ్ ముఠాలకు ఉపయోగపడేలా డ్రగ్ చానళ్లను కూడా ఆసిఫ్ ఏర్పాటు చేశాడన్నారు. ఫరూక్, హుస్సేన్ షా, రెహ్మత్ షా పీవోకే(పాక్ ఆక్రమిత కశ్మీర్)లోని ఉగ్రవాదులతో సంప్రదింపులు జరుపుతున్నారని, పాకిస్థాన్ నుంచి డ్రగ్స్ స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారని, మత్తుపదార్థాల స్మగ్లింగ్‌కు నియంత్రణరేఖ అవతలి నుంచి భారీగా కన్‌సైన్‌మెంట్లు పొందారని చెప్పారు. ఇర్షాద్ పీవోకే నుంచి ఆయుధాలు, పేలుడు పదార్థాలు తెప్పించి ఉగ్రవాదులకు అందజేస్తున్నాడన్నారు. నజం దీన్ పాకిస్థాన్‌లోని కరుడుగట్టిన ఉగ్రవాదులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాడని తెలిపారు.

విదేశాల్లో ఉద్యోగాల పేరిట రూ.200 కోట్ల మోసం

» 9 రాష్ట్రాల్లో 3 వేలకు పైగా బాధితులు.. నలుగురి అరెస్టు

చెన్నై, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పలు రాష్ట్రాలకు చెందిన సుమారు 3,400 మంది వద్ద రూ.200 కోట్ల మేర మోసానికి పాల్పడిన నలుగురిని పుదుచ్చేరి సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తామంటూ సామాజిక మాధ్యమాల్లో వెలువడిన ఓ ప్రకటన చూసిన పుదుచ్చేరి లాస్‌పేటకు చెందిన రమేష్‌కుమార్ మొబైల్‌ఫోన్‌లో అగంతకులను సంప్రదించాడు. సదరు వ్యక్తి కెనడాలోని ఓ ప్రముఖ సంస్థలో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికి.. వీసా, వైద్య పరీక్షలు, ఇన్సూరెన్స్ తదితరాల కోసమంటూ రూ.17.71 లక్షలు తీసుకున్నాడు. ఆన్‌లైన్‌లో డబ్బు చెల్లించాక ఏడాది గడిచినా అటు నుంచి స్పందన లేకపోవడంతో తాను మోసపోయినట్టు గ్రహించిన రమేష్‌కుమార్.. పుదుచ్చేరి సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. రెండు నెలల పాటు జరిగిన విచారణలో కోల్‌కతా కేంద్రంగా మోసం జరిగినట్టు గ్రహించారు. అక్కడకు వెళ్లి దర్యాప్తు చేపట్టారు. మధ్యప్రదేశ్‌కు చెందిన శుభం శర్మ (29), నీరజ్ గుర్జార్ (28), వారి స్నేహితుడు బీహార్‌కు చెందిన దీపక్‌కుమార్ (28), యూపీ చెందిన రాజ్‌గౌండ్ (23) ఈ మోసానికి పాల్పడ్డారని, వారు ప్రస్తుతం బెంగుళూరులో ఉన్నట్టు తెలుసుకుని శుక్రవారం ఆ నలుగురినీ అరెస్టు చేసి పుదుచ్చేరికి తరలించారు. శుభం శర్మ నేతృత్వంలోని ఈ ముఠా.. దేశవ్యాప్తంగా 3,400 మందికి పైగా విదేశీ ఉద్యోగాల పేరిట మోసం చేసినట్టు సమాచారం. వారి నుంచి 21 సెల్‌ఫోన్లు, 2 పాస్‌పోర్టులు, రూ.41 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.

సెప్టెంబర్ 4న ట్రంప్- కమలా హారిస్ డిబేట్

న్యూయార్క్, ఆగస్టు 3: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అధికార డెమోక్రటిక్ పార్టీ తరఫున కమలా హారిస్ అభ్యర్థిత్వం ఖరారైన నేపథ్యంలో ఆమెతో డిబేట్‌కు రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ అంగీకరించారు. ఈ విషయాన్ని ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు. ఫాక్స్ న్యూస్ నిర్వహించే ఈ డిబేట్ పెన్సిల్వేనియాలో జరగనుందని, ఈ కార్యక్రమంలో పూర్తి స్థాయిలో ప్రేక్షకులు కూడా ఉండనున్నారని ఆయన తెలిపారు. గతంలో జో బైడెన్‌తో డిబేట్ మాదిరే ఇందులో నియమ నిబంధనలు ఉండనున్నాయని ట్రంప్ పేర్కొన్నారు. అయితే ఈ డిబేట్‌కు దాని నియమ నిబంధనలకు హారిస్ అంగీకరించారా లేదా అన్నది తెలియాల్సి ఉంది. అయితే ట్రంప్‌తో ముఖాముఖీ చర్చకు తాను సిద్ధమేనని హారిస్ గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే.

హెచ్-1బీ వీసాదారులకు భారీ ఊరట

» వారి జీవిత భాగస్వాములు అమెరికాలో పని చేయవచ్చు

» ఫెడరల్ నిబంధనను సమర్థించిన కొలంబియా జిల్లా కోర్టు

న్యూయార్క్, ఆగస్టు 3: హెచ్-1బీ వీసాదారుల జీవిత భాగస్వాములు అమెరికాలో పనిచేయడానికి అనుమతించే ఫెడరల్ నిబంధనను కొలంబియా జిల్లా కోర్టు సమర్థించింది. వీసా హోల్డర్లను చేర్చుకొనే షరతులను నిర్ణయించడానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ(డీహెచ్ఎస్)కి యూఎస్ ఇమిగ్రేషన్ చట్టం విస్తృత అధికారాలను కల్పిస్తుందని ముగ్గురు న్యాయమూర్తుల ప్యానెల్ పేర్కొంది. స్థానికుల స్థానంలో విదేశీ కార్మికులను నియమించడాన్ని సవాలు చేస్తూ 'సేవ్ జాబ్స్ యూఎస్ఏ' సంస్థ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని కింది కోర్టు కొట్టివేయడాన్ని సమర్థిస్తూ... ఫెడరల్ చట్టం ఆధారంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అప్పీల్స్ కోర్టు స్పష్టం చేసింది. గూగుల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్ సహా పలు ప్రధాన టెక్ కంపెనీలు సైతం ఈ నిబంధనను సమర్థించాయి. హెచ్-1బీ ఉద్యోగులు అమెరికాలో శాశ్వత నివాసం పొందడానికి ప్రోత్సహించడం ద్వారా నిపుణులైన ఉద్యోగులను నిలుపుకోవడానికి ఇది సహాయపడుతుందని వాదించాయి. అమెరికాను టెక్నాలజీ రంగంలో అగ్రగామిగా నిలబెట్టడానికి ఈ తీర్పు దోహదం చేయనుందని సాంకేతిక నిపుణులు పేర్కొంటున్నారు.

వణుకుతున్న ఉత్తరాది

హిమాచల్‌ప్రదేశ్ అతలాకుతలం

» కోల్‌కతా ఎయిర్‌పోర్టులోకి వరద

» ఝార్ఖండ్‌లో పలు ప్రాంతాలు జలమయం



అహ్మదాబాద్‌లో భారీ వర్షాలకు రోడ్డు కుంగి దిగబడిన వాహనం

న్యూఢిల్లీ, బెంగళూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఉత్తరాదితో పాటు పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ముఖ్యంగా హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు అతలాకుతలం అవుతున్నాయి. చాలా ప్రాంతాల్లో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. హిమాచల్‌ప్రదేశ్‌లో అయితే కుండపోత వర్షాలకు పరిస్థితి భయానకంగా తయారైంది. నాలుగురోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో 190కి పైగా రోడ్లపై రాకపోకలను నిషేధించారు. ఆ రాష్ట్ర ప్రభుత్వం 82 బస్సు సర్వీసులను రద్దు చేసింది. విద్యుత్, తాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జూన్ 27వ తేదీ నుంచి ఇప్పటి వరకు భారీ వర్షాలకు ఆ రాష్ట్రంలో 77 మంది మరణించగా, దాదాపు 655 కోట్ల ఆస్తి నష్టం సంభవించినట్టు అధికారులు తెలిపారు. పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాతో పాటు చుట్టుపక్కల జిల్లాలు ఎడతెరిపిలేని వర్షాలకు వణికిపోతున్నాయి. శనివారం కోల్‌కతా అంతర్జాతీయ విమానాశ్రయం జలమయమైంది. రన్‌వే, ట్యాక్సీవేలపై వరద నీరు చేరింది. ఇలాంటి పరిస్థితుల్లోనూ విమానాల రాకపోకలు సజావుగా సాగుతున్నాయని అధికారులు తెలిపారు. విమానాలు పార్క్ చేసిన ప్రాంతంలో వర్షపు నీరు చేరిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పార్కింగ్ స్టాండ్లలోకి వరద చేరడంతో అదనపు మోటార్ పంపులతో నీటిని బయటకు పంపుతున్నారు. కోల్‌కతా నగరంలో చాలా ప్రాంతాలు వరదలో చిక్కుకున్నాయి. అల్పపీడనం ప్రభావంతో పశ్చిమబెంగాల్‌లోని దక్షిణాది జిల్లాలో భారీ వర్షాలు పడుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. పలు చోట్ల రెడ్, ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. పశ్చిమ వర్ధమాన్ జిల్లాలో నీట మునిగిన వంతెనను దాటుతుండగా కారు కొట్టుకుపోవడంతో ఓ వ్యక్తి మరణించారు. ఇక ఝార్ఖండ్‌లో భారీ వర్షాలకు చాలా రోడ్లు కొట్టుకుపోయాయి. పలు ప్రాంతాల్లో చెట్లు నేలకూలగా, ఇళ్లు దెబ్బ తిన్నాయి. వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. రాంచీలో ఎన్డీఆర్ఎఫ్ దళాలను మోహరించి లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.


మంగళూరు-హాసన్ మధ్య కుంగిన భూమి

కర్ణాటక రాష్ట్రం మంగళూరు-హాసన్ మార్గంలోని ఎడకుమరి, కడగరవల్లి మధ్య భూమి కుంచించుకుపోవడంతో రాబోయే రెండు మూడు రోజులకు సంబంధించి ఆ మార్గంలో పలు రైలు సర్వీసులను రద్దు చేశారు. ఈ మేరకు రైల్వేశాఖ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. కాగా, దక్షిణకన్నడ జిల్లా బెళ్లిప్పాడిలో కొండచరియలు విరిగి ఓ ఇంటిపై పడ్డంతో ఆరు పశువులు మృతి చెందాయి. మూడబిదరె వద్ద కొండచరియలు విరిగిపడటంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. హాసన్ జిల్లా సకలేశపుర ప్రాంతంలో జాతీయ రహదారిపై కొండచరియలు విరిగిపడటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. మరోవైపు, వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు వంద ఇళ్లు నిర్మించి ఇస్తామని కేరళ సీఎం పినరయి విజయన్‌కు కర్ణాటక సీఎం సిద్దరామయ్య భరోసా ఇచ్చారు. వయనాడ్‌లో ప్రకృతి విపత్తుల వల్ల ఇబ్బంది పడుతున్న బాధితులను ఆదుకోవడం మనందరి సమష్టి బాధ్యత అని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. అందుకోసం శనివారం ఆయన హైదరాబాద్‌లో విరాళాల సేకరణ చేపట్టారు.

ఊరంతా కొట్టుకుపోయింది

హిమాచల్‌ప్రదేశ్‌లో సంభవించిన ఆకస్మిక వరదల్లో సిమ్లా జిల్లాలో సామెజ్ అనే గ్రామం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. ఆ ఊరిలో ఓ ఇల్లు మాత్రమే మిగిలింది. మరో వృద్ధుడు పొరుగూరులో ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డారు. సామెజ్ గ్రామానికి చెందిన అనితాదేవి ఆ హృదయ విదారక దృశ్యాలను పంచుకున్నారు. 'బుధవారం రాత్రి మేమంతా నిద్రలో ఉండగా పెద్ద శబ్దం వచ్చింది. బయటకొచ్చి చూస్తే ఊరు మొత్తం కొట్టుకుపోయింది. భయంతో మేం భగవతి కాళిమాత ఆలయానికి వెళ్లి ఆ రాత్రి తలదాచుకున్నాం. ఆ విధ్వంసంలో మా ఇల్లు మాత్రమే మిగిలింది. నా కళ్ల ముందే అంతా కొట్టుకుపోయింది' అని అనితాదేవి అన్నారు. అదే గ్రామానికి చెందిన బక్షీరామ్ అనే వృద్ధుడు.. 'వరదలు వచ్చినపుడు నేను రాంపూర్‌లో ఉండటంతో బతికి బయటపడ్డా. అర్ధరాత్రి 2 గంటలకు వరదలు వచ్చినట్టు తెలిసింది. 4 గంటల ప్రాంతంలో ఇక్కడికి వచ్చి చూడగా ఊరంతా ధ్వంసమైంది. నా కుటుంబ సభ్యులు 14-15 మంది వరదలో కొట్టుకుపోయారు' అంటూ ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. ఆ గ్రామంలో మొత్తం 53 మంది గల్లంతు కాగా, 6 మృతదేహాలు లభ్యమయ్యాయి.

లోకం తీరు



కోర్టు వ్యవహారాలతో ప్రజలు విసిగిపోయారు

» విచారణ ప్రక్రియే శిక్షగా మారింది

» సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, ఆగస్టు 3: కోర్టు వ్యవహారాలతో ప్రజలు విసిగిపోయారని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. వారు కేవలం సమస్యలకు ఏదో విధమైన సత్వర పరిష్కారం కావాలని కోరుకుంటున్నారని అభిప్రాయపడ్డారు. విచారణ ప్రక్రియే ఓ శిక్షగా మారిందని, ఇది జడ్జీలకు సయితం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వారం రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక లోక్‌అదాలత్ కార్యక్రమం శనివారం ముగిసిన సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకునే రాజీ మార్గంలో కేసులు పరిష్కరించేందుకు లోక్‌అదాలత్‌ను నిర్వహించామని చెప్పారు. ప్రజల ఇంటి వద్దకు న్యాయాన్ని తీసుకెళ్లడం, వారి జీవితాల్లో భాగంగా ఉన్నామని చెప్పడమే లోక్ అదాలత్‌ల ఉద్దేశమని చెప్పారు. ఇందుకు న్యాయమూర్తులు, న్యాయవాదుల నుంచి సహకారం లభించిందని ప్రశంసించారు. ఇద్దరు న్యాయమూర్తులు, ఇద్దరు న్యాయవాదులతో కలిసి లోక్‌అదాలత్ ప్యానెళ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. తొలుత ఏడు బెంచ్‌లు ఏర్పాటు చేయగా, వాటి సంఖ్యను 13కు పెంచామని, ఇవి కేసుల పరిష్కారానికి విశేషమైన కృషి చేశాయని చెప్పారు. తాను ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన తరువాత సుప్రీంకోర్టు రిజిస్ట్రీలో దేశంలోని అన్ని ప్రాంతాల వారికి ప్రాతినిధ్యం ఉండేలా చూశానని జస్టిస్ చంద్రచూడ్ వివరించారు.

ఎన్డీయే కూటమిలో 'ఎస్సీ కోటా' సెగ

» సుప్రీంకోర్టు తీర్పుపై కూటమిలోని పలు పార్టీ నేతల భగ్గు

» తీర్పుపై అప్పీల్ చేస్తామన్న కేంద్ర మంత్రులు చిరాగ్, అథవాలే

న్యూఢిల్లీ, ఆగస్టు 3: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఎన్డీయే కూటమి పక్షాలైన లోక్ జనశక్తి పార్టీ(రాంవిలాస్), రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌పీఐ-అథవాలే) తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ తీర్పుపై అప్పీల్‌కు వెళ్తామని లోక్ జనశక్తి పార్టీ చీఫ్, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ తెలిపారు. అదేవిధంగా రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధినేత రామ్‌దాస్ అథవాలే కూడా తీర్పును వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు సంబంధించి క్రీమీలేయర్ క్రైటీరియాపై అప్పీలు చేస్తామన్నారు. "15% ఎస్సీ కోటాలో వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై సమీక్షించాలని కోరుతున్నాం. దీనిపై అప్పీల్‌కు వెళ్తాం" అని చిరాగ్ పాశ్వాన్ చెప్పారు. అస్పృశ్యత విషయంలో సుప్రీంకోర్టు తీర్పు విఫలమైందని వ్యాఖ్యానించారు. "ఎస్సీ కోటాలో క్రీమీలేయర్‌ను ఎట్టి పరిస్థితిలోనూ అనుమతించలేం. వర్గీకరణ ద్వారా ఎస్సీలు అనుభవిస్తున్న అస్పృశ్యత పరిష్కారం కాదు" అని అన్నారు. అంతేకాదు, ఎస్సీల్లోని ఉన్నత విద్యావంతులు, ఆర్థికంగా బలంగా ఉన్నవారు కూడా అస్పృశ్యతను ఎదుర్కొంటున్నారని పాశ్వాన్ తెలిపారు. ఈ నేపథ్యంలో వర్గీకరణ మరింత అన్యాయానికి గురిచేసినట్టే అవుతుందన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కోరుతున్న కుల గణనకు పాశ్వాన్ మద్దతు తెలిపారు. అయితే, ఆయా కుల గణన వివరాలను మాత్రం బహిరంగ పరచకూడదని అభిప్రాయపడ్డారు. కాగా, తమ మిత్రపక్షం జేడీయూ సుప్రీంకోర్టు తీర్పును సమర్థించడంపై మాత్రం పాశ్వాన్ మౌనం వహించారు. మరోవైపు, ఆర్‌పీఐ అధినేత, కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలే కూడా సుప్రీంకోర్టు తీర్పును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. కులం ఆధారంగా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు ఏర్పాటు చేశారని, దీనిలో క్రీమీలేయర్ క్రైటీరియా వర్తింపచేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని, దీనిపై అప్పీలుకు వెళ్తామని అన్నారు.

తక్కువ జలం.. ఎక్కువ ఫలం

ఇప్పుడిదే ప్రపంచ సాగు మంత్రం

» తక్కువ నీటితో కాపునిచ్చే బ్లాక్ రైస్, తృణధాన్యాలతోనే ఆహారభద్రత సాకారం

» అంతర్జాతీయ వ్యవసాయ ఆర్థిక వేత్తల సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి



వ్యవసాయ ఆర్థిక వేత్తల సదస్సులో కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌తో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు 3 : తక్కువ జలాలతో అధిక ఫలసాయం అందించే సాగు పద్ధతులే ప్రపంచానికి ఆహారభద్రతను సమకూర్చగలవని ప్రధాని మోదీ అన్నారు. దీనికోసం బ్లాక్ రైస్, తృణధాన్యాల సాగుపై దృష్టి సారించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. వ్యవసాయ ఆర్థికవేత్తల 32వ అంతర్జాతీయ సదస్సును(ఐసీఏఈ) శనివారం ఢిల్లీలో ఆయన ప్రారంభించారు. వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతతో పాటు పోషక విలువలు కలిగిన పంటలను పండించడం ప్రపంచానికి పెద్ద సవాల్‌గా మారిందని మోదీ అన్నారు. ఆహార భద్రత సమస్యకు పరిష్కారం చూపేలా భారత్ అడుగులు వేస్తోందన్నారు. వాతావరణ పరిస్థితులను తట్టుకుని మంచి పంటను అందించే సాగు విధానాలను ప్రపంచానికి పరిచయం చేయడానికి సిద్ధంగా ఉన్నామనీ, ఈ ఏడాది బడ్జెట్‌లో ఈ అంశానికి పెద్దపీట వేశామని మోదీ తెలిపారు. "అన్నిరకాల వాతావరణాలను తట్టుకోగల 1900 రకాల కొత్త వంగడాలను గత పదేళ్లలో రైతులకు అందించాం. ఈ వంగడాలకు సాధారణ వరి పంటలతో పోల్చితే 25% జలాలు సరిపోతాయి. బ్లాక్‌రైస్ అందరికీ ఇష్టమైన ఆహారంగా మారింది. ముఖ్యంగా మణిపూర్, అస్సాం, మేఘాలయలో ఈ రకం వరి ఆహారాన్ని బాగా తింటున్నారు" అని తెలిపారు. ప్రపంచం సూపర్ ఫుడ్‌గా భావించే తృణధాన్యాల అతి పెద్ద ఉత్పత్తిదారుగా భారత్ మారిందని చెప్పారు. కాగా, ఐసీఏఈ సదస్సు 65 ఏళ్ల తర్వాత మళ్లీ భారత్‌లో జరగడం ఇదే మొదటిసారి. ఆ సదస్సు తొలిసారి జరిగినప్పుడు కొత్తగా అప్పుడే భారత్ స్వాతంత్ర్యం పొందిందని మోదీ గుర్తుచేశారు. అప్పట్లో వ్యవసాయ రంగంలో సమస్యలతో తిండి గింజలకు కటకట పడిన దశ నుంచి ఆహార ఉత్పత్తిలో సంపూర్ణ సంవృద్ధిని ఇప్పుడు భారత్ సాధించిందని ప్రధాని గుర్తుచేశారు. పాల ఉత్పత్తిలో, పప్పు ధాన్యాలు, సుగంధ ద్రవ్యాల సాగులో ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉన్నామని వివరించారు. దేశాభివృద్ధి వ్యూహంలో వ్యవసాయం అతి కీలక రంగంగా మారిందని నీతి ఆయోగ్ సభ్యుడు రమేశ్ చంద్ అన్నారు. కాగా, 70 దేశాల నుంచి వెయ్యిమంది ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

పాపులారిటీలో మోదీ నెం. 1

ప్రధాని మోదీ మరోసారి ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడిగా నిలిచారు. అమెరికాకు చెందిన మార్నింగ్ కన్సల్ట్ అనే సంస్థ ఈ మేరకు నిర్వహించిన సర్వే తాజా వివరాలను ప్రకటించింది. ఇందులో 69% మద్దతుతో మోదీ ప్రపంచంలోనే అత్యధిక ప్రజాదరణ కలిగిన నేతగా నిలిచారు. ఆయన తర్వాత మెక్సికో అధ్యక్షుడు ఆండ్రెస్ రెండో స్థానంలో ఉన్నారు. జాబితాలో 3 నుంచి 10 స్థానాల్లో వరుసగా అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మెలీ, స్విట్జర్లాండ్ ఫెడరల్ కౌన్సిలర్ వియోలా, ఐర్లాండ్ మంత్రి సైమన్ హ్యారిస్, యూకే ప్రధాని స్టార్మర్, పోలాండ్ మాజీ ప్రధాని టస్క్, ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ , స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్, ఇటలీ ప్రధాని మెలోనీ ఉన్నారు.

మాన్ పారిస్ పర్యటనకు అనుమతివ్వలేం

భద్రతా కారణాల దృష్ట్యా కేంద్రం నిర్ణయం

చండీగఢ్, ఆగస్టు 3: భారత హాకీ జట్టుకు మద్దతు తెలిపేందుకు పారిస్ ఒలింపిక్స్ వెళ్లాలని నిర్ణయించుకున్న పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌కు కేంద్రం అనుమతి నిరాకరించింది. పారిస్ ఒలింపిక్స్‌లో భారత హాకీ జట్టు ఆగస్టు 4న క్వార్టర్‌ఫైనల్ ఆడనుంది. భారత టీంను ప్రోత్సహించేందుకు ఆగస్టు 4-9 వరకు పారిస్ వెళ్లాలని భగవంత్ మాన్ షెడ్యూల్ ఖరారు చేసుకున్నారు. ఈ మేరకు విదేశీ వ్యవహారాల శాఖకు సమాచారం ఇచ్చారు. దౌత్య పాస్‌పోర్టు ఉన్నప్పటికీ జడ్ ప్లస్ భద్రత ఉన్న మాన్‌కు పొలిటికల్ క్లియరెన్స్ ఇవ్వడం కుదరదని కేంద్రం చెప్పినట్లు సమాచారం. ఇంత తక్కువ సమయంలో ఆయనకు పారిస్‌లో ఆ స్థాయి ఏర్పాట్లు చేయలేమని దీంతో పర్యటనకు అనుమతి నిరాకరిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. "భారత హాకీ జట్టులో ఎక్కువ మంది ఆటగాళ్లు పంజాబీలే. పారిస్ వెళ్లేందుకు మాన్‌కు అనుమతివ్వకపోవడం అంటే 3 కోట్ల పంజాబ్ ప్రజల మనోభావాలను కేంద్రం అవమానించడమే" అని ఆప్ పేర్కొంది. ఆగస్టు 4-7 వరకు అమెరికాలో జరిగే శాసనసభ స్పీకర్ల భేటీలో పాల్గొనేందుకు పంజాబ్ స్పీకర్ కుల్తర్‌కు కూడా కేంద్రం అనుమతి ఇవ్వలేదు.

మరో యుద్ధం అంచున పశ్చిమాసియా!

» ఇజ్రాయెల్‌పై దాడికి ఇరాన్ ఆదేశంతో తీవ్ర ఉద్రిక్తత

» యుద్ధ నౌకలు, ఫైటర్ జెట్లను పంపుతున్న అమెరికా

» భారతీయ పౌరులను అప్రమత్తం చేసిన ఎంబసీలు



పసిఫిక్ జలాల్లో అమెరికా విమాన వాహక నౌక యూఎస్ఎస్ లింకన్

టెల్ అవీవ్, ఆగస్టు 3: అసలే ఉద్రిక్తతలకు నెలవైన పశ్చిమాసియాలో ఓవైపు హమాస్-ఇజ్రాయెల్ యుద్ధం జరుగుతుండగానే, మరో యుద్ధం తప్పదనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. తమ దేశంలో అతిథిగా ఉన్న హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యతో రగిలిపోతున్న ఇరాన్.. ఇజ్రాయెల్‌పై దాడికి సిద్ధమవుతోంది. మిత్ర దేశాలతో కలిసి విరుచుకుపడే ఆలోచన చేస్తోంది. ఒకేసారి అందరూ కలిసి దాడి చేయడమా? లేక విడివిడిగానా? అనేది చర్చల్లో ఉంది. దీంతో ఇరాన్ బద్ధ శత్రువైన అమెరికా రంగంలోకి దిగింది. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఫోన్ చేసి మద్దతు తెలిపారు. అగ్ర రాజ్యం అదనపు యుద్ధ నౌకలు, ఫైటర్ జెట్లను పంపేందుకు సిద్ధమైంది. ఈ మేరకు బాలిస్టిక్ క్షిపణలను నిరోధించగల క్రూయిజర్లు, యుద్ధ విమానాలను తరలించేందుకు అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ ఆదేశించారు. పశ్చిమాసియాలో ఇప్పటికే ఉన్న విమాన వాహక నౌక యూఎస్ఎస్ థియోడర్ రూజ్‌వెల్ట్ స్థానంలో యూఎస్ఎస్ అబ్రహం లింకన్‌ను ప్రవేశపెట్టనున్నట్లు పెంటగాన్ డిప్యూటీ ప్రెస్ సెక్రటరీ సబ్రినా సింగ్ తెలిపారు. కాగా, గత మంగళవారం లెబనాన్ రాజధాని బీరూట్‌లో తమ కమాండర్ ఫాద్ షుకూర్‌ను ఇజ్రాయెల్ హతమార్చడంతో ఉగ్ర సంస్థ హెజ్బొల్లా తీవ్ర ఆగ్రహంతో ఉంది. ఇక హనియా హత్యకు భీకరమైన సైనిక ప్రతీకారం తప్పదని యెమెన్‌కు చెందిన హౌతీ ఉగ్రవాదులూ ఇజ్రాయెల్‌ను హెచ్చరించారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇరాన్‌ను అడ్డుకునేందుకు పశ్చిమాసియాలో సైనిక శక్తిని పెంచుతున్నట్లు అమెరికా రక్షణ శాఖ ప్రధాన కార్యాలయం పెంటగాన్ తెలిపింది. మరోవైపు టెల్ అవీవ్‌కు ఎయిరిండియా సహా పలు విమానయాన సంస్థలు సర్వీసులను రద్దు చేశాయి. భారత పౌరులు అప్రమత్తంగా ఉండాలని ఇజ్రాయెల్‌లోని రాయబార కార్యాలయం కోరింది. ముందు రోజే బీరూట్‌లోని భారత రాయబార కార్యాలయం కూడా ఇదే విధమైన హెచ్చరిక చేసింది. వీలైతే లెబనాన్ నుంచి వెళ్లిపోవాలని కూడా కోరింది. మరోవైపు, లెబనాన్‌లో ఉన్న తమ పౌరులు వెంటనే, ఏ టికెట్ దొరికితే ఆ టికెట్‌తో స్వదేశాలకు వచ్చేయాలని అమెరికా, యూకే సూచించాయి.

2036 కల్లా దేశ జనాభాలో 65% మంది పనిచేయగల వయస్సు వారే

న్యూఢిల్లీ, ఆగస్టు 3: భారతదేశంలో పనిచేయగలిగిన వయస్సు(15-64) కలిగిన జనాభా సంఖ్య 2036వరకు పెరుగుతుందని ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్(ఏడీబీ) నివేదిక పేర్కొంది. 2011 నాటికే భారత్‌లో 60% మంది పనివయసు జనాభా ఉందని, ఇది 2031 నాటికి 65.1 శాతానికి చేరుతుందని పేర్కొంది. అయితే, 2036 నాటికి స్వల్పంగా తగ్గుముఖం పట్టి 64.9 శాతానికి చేరే అవకాశం ఉందని తెలిపింది. ఇదే సమయంలో చైనా, జపాన్‌లలో పనివయసు జనాభా తగ్గుముఖం పడుతోందని తెలిపింది. పనివయసు జనాభా పెరుగుదల కారణంగా శ్రామిక శక్తి వృద్ధి చెందుతుందని, ఆసియా, పసిఫిక్ ప్రాంతాల్లో ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని నివేదిక వివరించింది. ఆసియా, పసిఫిక్ ప్రాంతాల్లో వలసలు, మానవ వనరుల మూలధన పెట్టుబడులు కూడా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని పేర్కొంది. కాగా, ప్రస్తుతం పలు దేశాల్లో పనివయసు జనాభా తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో ఆయా దేశాలు మరిన్ని విధానాలు అవలంభించాల్సి వస్తోందని పేర్కొంది. అయితే, ఆసియా, పసిఫిక్ దేశాలు మాత్రం పని వయసు జనాభాను సమతుల్యం చేయడంతో పాటు వారిని సరైన విధంగా వినియోగించుకునేందుకు నూతన విధానాలను అవలంభించాల్సి ఉంటుందని ఏడీబీ వివరించింది.




తిరుమల ఆలయం ముందు జస్టిస్ కృష్ణమోహన్, జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి కూడా శనివారం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.



శ్రీశైలం ఆలయ ప్రాంగణంలో నారా భువనేశ్వరి

మల్లన్న సేవలో నారా భువనేశ్వరి

శ్రీశైలం, ఆగస్టు 3: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి శనివారం దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ప్రధానాలయ రాజగోపురం వద్దకు చేరుకున్న ఆమెకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆమె స్వామివారికి అభిషేకం నిర్వహించారు. భ్రమరాంబదేవి అమ్మవారికి అర్చనలు చేశారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో భువనేశ్వరికి వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. స్వామి, అమ్మవార్ల దర్శనానికి ముందు ఆమె సాక్షి గణపతి ఆలయాన్ని సందర్శించి స్వామికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు.

అక్టోబరు 4 నుంచి 12 వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- ప్రత్యేక దర్శనాలు, ఆర్జితసేవలు రద్దు
- టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలను అక్టోబరు 4వ తేదీ నుంచి అత్యంత వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శనివారం సాయంత్రం ఆయన బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై తొలి సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో ఇంజనీరింగ్ పనులు, వాహనాల ఫిట్నెస్, లడ్డూ బఫర్ స్టాక్, అన్నప్రసాదం, దర్శనం, వసతి, కళాబృందాల కార్యక్రమాలు, ఉద్యానవన శాఖ, ట్రాన్స్‌పోర్టు, కల్యాణకట్ట, గోశాల, శ్రీవారిసేవకులు, విజిలెన్స్ ఏర్పాట్లపై సమీక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌర్యం లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. బ్రహ్మోత్సవాలకు అక్టోబరు 4న ధ్వజారోహణం జరుగుతుందన్నారు. 8న గరుడసేవ, 9న స్వర్ణరథం, 11న రథోత్సవం, 12న చక్రస్నానం నిర్వహిస్తారు. వాహన సేవలు రోజూ ఉదయం 8 గంటలకు, రాత్రి 7 గంటలకు ప్రారంభిస్తామని తెలిపారు. బ్రహ్మోత్సవాలు జరిగే సమయంలో వయోవృద్ధులు, దివ్యాంగులు, ఎన్ఆర్ఐలు, చిన్నపిల్లల తల్లిదండ్రులతో సహా అన్ని ప్రత్యేక దర్శనాలు, ఆర్జితసేవలను రద్దు చేశామన్నారు.

గోదావరి వరద తగ్గుముఖం

ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.50 అడుగులు

- సముద్రంలోకి 5,81,417 క్యూసెక్కుల వరద ప్రవాహం
- పోలవరం స్పిల్‌వే నుంచి 6.70లక్షల క్యూసెక్కులు విడుదల

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)/పోలవరం, ఆగస్టు 3: గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. శనివారం సాయంత్రం 5 గంటలకు ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.50 అడుగులుగా ఉంది. బ్యారేజీ నుంచి సముద్రంలోకి 5,81,417 క్యూసెక్కులు ప్రవాహం వెళుతోంది. ధవళేశ్వరం వద్ద గోదావరి పాండ్ లెవల్ 13.26 మీటర్లుగా ఉంది. గోదావరి డెల్టా కాలువలకు 8,800 క్యూసెక్కులు పంపిస్తున్నారు. భద్రాచలం వద్ద తెల్లవారుజామున 3 గంటలకు 33 అడుగులకు తగ్గిన వరద తర్వాత క్రమంగా సాయంత్రం 5 గంటలకు 33.90 అడుగులకు చేరింది. ఇది పెద్దగా పరిగణనలోకి తీసుకోవలసిన అవసరం లేదని, ఎగువన వర్షాలు లేవని, పొలాల్లోనూ, వాగుల నుంచి వచ్చే వరద కొద్దిగా పెరిగి, తగ్గిపోతుందని అధికారులు చెబుతున్నారు. గోదావరిలో లంకలు తేలిపోతున్నాయి. భద్రాచలంలో ఇక పెరుగుదల లేకపోతే, ఆదివారం సాయంత్రానికి చాలా నీరు లాగేస్తుంది. రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుతో కలసి శనివారం ఎర్రకాలువ వరదతో ముంపునకు గురైన ప్రాంతాలను పరిశీలించారు. ఎర్రకాలువ ముంపు నుంచి శాశ్వత పరిష్కారం కోసం అంచనాలు తయారుచేయాలని ఎంపీ ఆదేశించారు. కాగా, ఏలూరు జిల్లాలో పోలవరం ప్రాజెక్టు ఎగువన గోదావరి నీటిమట్టం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. శనివారం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 6,70,355 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశారు. స్పిల్‌వే ఎగువన 31.050 మీటర్లు, దిగువన 22.240 మీటర్ల నీటి మట్టం నమోదైందని అధికారులు తెలిపారు.



కృష్ణమ్మ పరవళ్లతో కళకళలాడుతున్న శ్రీశైలం జలాశయం

రాష్ట్రానికి దూరంగా తీవ్ర వాయుగుండం

- కోస్తా, రాయలసీమల్లో చెదురుమదురుగా వర్షాలు

విశాఖపట్నం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వాయుగుండం శనివారం నాటికి తీవ్ర వాయుగుండంగా బలపడి ఉత్తరప్రదేశ్‌లో కేంద్రీకృతమై ఉంది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి ఆదివారం నాటికి వాయుగుండంగా బలహీనపడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. తీవ్ర వాయుగుండం దూరంగా ఉన్నందున దాని ప్రభావం రాష్ట్రంపై ఉండదని పేర్కొంది. అయితే నైరుతి రుతుపవనాల ప్రభావంతో శనివారం కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా వర్షాలు కురిశాయి. కోస్తాలో కొన్నిచోట్ల ఎండ తీవ్రత కొనసాగింది. నెల్లూరులో 37.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో ఉత్తర కోస్తాలో పలుచోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

శ్రీశైలానికి 4.24 లక్షల క్యూసెక్కులు

- జలాశయానికి కొనసాగుతున్న వరద ఉధృతి
- 10 గేట్ల నుంచి సాగర్‌కు 5.24 లక్షల క్యూసెక్కులు విడుదల

శ్రీశైలం, ఆగస్టు 3: ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతోంది. జూరాల నుంచి 2,63,532 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 1,67,556 క్యూసెక్కులు మొత్తం 4,33,088 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. శనివారం సాయంత్రం 6గంటల సమయానికి 4,24,466 క్యూసెక్కుల వరద శ్రీశైలం జలాశయానికి చేరింది. శ్రీశైలం డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు, పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 882.50 అడుగుల నీటిమట్టం వద్ద 202.0439 టీఎంసీల నీరు చేరింది. ఏపీ జల విద్యుత్ కేంద్రం ద్వారా 24,618 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 38,050 క్యూసెక్కులు, 10 డ్యామ్ క్రస్టు గేట్లను 20 అడుగుల మేర ఎత్తి 4,61,560 క్యూసెక్కులు మొత్తం 5,24,228 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

ముఖ్యమంత్రితో ఎస్ఆర్ఎం కులపతి భేటీ

- యూనివర్సిటీ అభివృద్ధి, విస్తరణ ప్రాజెక్టులపై చర్చ
- అన్ని విధాలా సహకరిస్తామని చంద్రబాబు హామీ

అమరావతి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం వ్యవస్థాపక కులపతి, పార్లమెంటు మాజీ సభ్యులు టీఆర్ పారివేందర్, వర్సిటీ ప్రెసిడెంట్ పి.సత్యనారాయణన్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అభివృద్ధి, నూతన విస్తరణ ప్రాజెక్టుల గురించి పారివేందర్ సీఎంకు వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్కిల్లింగ్ అకాడమీల ప్రాముఖ్యతలను ముఖ్యమంత్రికి సత్యనారాయణన్ వివరించారు. ఇందుకోసం యూనివర్సిటీ చేపట్టనున్న నూతన ప్రాజెక్టులకు ప్రభుత్వపరంగా సహకారం అవసరమని కోరారు. యూనివర్సిటీ ఏర్పాటు సమయంలో జరిగిన ఒప్పందం మేరకు మరో 100 ఎకరాలను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు యూనివర్సిటీకి అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.



టీటీడీ అదనపు ఈవోకు విరాళాన్ని అందజేస్తున్న మధుసూదన్

అన్నప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళం

తిరుమల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి అన్నప్రసాదం ట్రస్టుకు శనివారం రూ.కోటి విరాళంగా అందింది. బెంగళూరు, హైదరాబాద్ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సుమధుర గ్రూప్ సీఎండీ మధుసూదన్ ఈ విరాళాన్ని తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు. సంస్థ డైరెక్టర్లు భరత్‌కుమార్, నవీన్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొరుప్రోలుకు రహదారి నిర్మాణానికి సర్వే

- డోలీపై వెళ్లి పింఛన్ అందుకున్న ఉదంతంతో స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం
- కలెక్టర్ ఆదేశంతో ప్రతిపాదనలు రూపొందించిన అధికారులు



రహదారి నిర్మాణానికి సర్వే చేస్తున్న దృశ్యం

రోలుగుంట, ఆగస్టు 3: అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం ఎం.కె.పట్నం పంచాయతీ పరిధిలోని మారుమూల గిరిజన గ్రామమైన కొరుప్రోలుకు రహదారి ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ శాఖ అధికారులు శనివారం ఆ గ్రామాన్ని సందర్శించి రహదారి నిర్మాణానికి సర్వే నిర్వహించారు. కొరుప్రోలు గ్రామానికి చెందిన గిరిజనులు ఈ నెల ఒకటో తేదీన డోలీ ద్వారా పింఛన్ తీసుకోవడానికి వెళ్లిన ఉదంతం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, ఇతర అధికారులు శుక్రవారం ఆ గ్రామాన్ని సందర్శించారు. రహదారి సరిగా లేకపోవడంతో తాము పడుతున్న ఇబ్బందులను తెలియసేందుకే డోలీలపై వెళ్లి పింఛన్ అందుకున్నామని గ్రామస్థులు చెప్పారు. ఈ మేరకు డీఆర్‌డీఏ పీడీ కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. ఈ క్రమంలో కొరుప్రోలు గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపాలంటూ పంచాయతీరాజ్ శాఖ అధికారులకు ఆదేశాలు అందాయి. ఇంజనీరింగ్ అధికారులు శనివారం ఎంకే పట్నం నుంచి కొరుప్రోలు వరకు రోడ్డు నిర్మాణానికి సర్వే చేపట్టారు. మూడు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.1.5 కోట్ల వరకూ అవసరం అవుతాయని అధికారులు తెలిపారు. సర్వే నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందించనున్నట్టు తెలిపారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

రణమా... రాజకీయమా?

తెలుగు రాష్ట్రాల రాజకీయాలు ఆ ఇంటి మీద కాకి ఈ ఇంటి మీద వాలకూడదన్న ధోరణిలో కొనసాగుతున్నాయి. రాష్ట్రం విడిపోక ముందు అధికార విపక్షాలు కలివిడిగా ఉండేవి. 1983లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించినప్పుడు శాసనసభ లోపలా, వెలుపలా అప్పుడప్పుడూ ఉభయ పక్షాల మధ్యా ఉద్రిక్త పరిస్థితులు కనిపించేవి కానీ, ఇప్పటిలా ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు ముఖాముఖి కలుసుకోలేని పరిస్థితులు ఉండేవి కావు. రాష్ట్రం విడిపోయిన తర్వాత తెలంగాణలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అధికార విపక్షాల మధ్య దూరం ఒక్కసారిగా పెరిగిపోయింది. ఉమ్మడి రాష్ట్రంలో కీలక అంశాలపై ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాలను నిర్వహించి నిర్ణయాలు తీసుకొనేది. రాష్ట్రం విడిపోయాక అఖిలపక్ష సమావేశాలు జరగడాన్ని చూడలేదు. రానురానూ ఈ పరిస్థితి మరింత వికటించి శాసనసభ లోపలా వెలుపలా ముఖ్యమంత్రి, ప్రతిపక్ష

> **ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పర్యాయం మరింత పరిణతి ప్రదర్శిస్తున్నారు. పర్యటనల సందర్భంగా హంగూ ఆర్భాటాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తన సభలకు జన సమీకరణలు చేయకూడదని నిర్ణయించుకోవడం నిజంగా ముదావహం. ఆయన మడకశిర నియోజకవర్గంలో జనసమీకరణ లేకుండా సాదాసీదాగా కార్యక్రమాల్లో పాల్గొనడాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత రఘువీరా రెడ్డి అభినందించడం గమనార్హం. అధికారం దక్కించుకున్న చంద్రబాబులోనే ఇంత మార్పు వచ్చినప్పుడు, అధికారం కోల్పోయిన జగన్ రెడ్డిలో ఏ మార్పూ కనిపించకపోవడం ఆశ్చర్యంగా ఉంది. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పరదాల మాటున, పోలీసు రక్షణలో, పాఠశాలలకు సెలవులు ప్రకటింపజేసి, దుకాణాలను సైతం మూయించి, జనాలను బలవంతంగా తరలించి సభలు నిర్వహించినా ఎన్నికల్లో ఫలితం ఇవ్వలేదనే వాస్తవాన్ని జగన్ రెడ్డి గుర్తించడానికి నిరాకరించడం ఆయన మనస్తత్వానికి నిదర్శనం.**

నాయకుడు కళ్లలో కళ్లు పెట్టి చూసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేసీఆర్ ప్రతిపక్షాలకు కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇచ్చేవారు కాదు. 2014–2018 మధ్య విపక్ష కాంగ్రెస్ నాయకుడిగా జానారెడ్డి ఉండేవారు. అప్పట్లో పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన కేసీఆర్ కాంగ్రెస్ పార్టీని బలహీనపరిచారు. గతంలో శాసనసభ సమావేశాల ప్రారంభం రోజు అధికార, విపక్షాల నాయకులు అల్పాహార విందులో పాల్గొనేవారు. సమావేశాల ముగింపు సందర్భంగా కూడా ఉమ్మడిగా విందులో పాల్గొనేవారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక ఈ సంప్రదాయం దాదాపు కనుమరుగైంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగా ప్రతిపక్ష నాయకుడి స్థానంలో జగన్మోహన్ రెడ్డి ఉండేవారు. ఆ రాష్ట్రంలో కూడా అఖిలపక్ష సమావేశాలు జరగనే లేదు. అధికారిక కార్యక్రమాల్లో ప్రతిపక్ష నాయకుడు పాల్గొన్న దాఖలాలు లేవు. రాజధానిగా అమరావతిని ఎంపిక చేసే ముందు కూడా అఖిలపక్ష సమావేశం జరగలేదు. శాసనసభలో అధికార, ప్రతిపక్షాల మధ్య నిత్యం యుద్ధం జరిగేది. అదే సమయంలో తెలంగాణ శాసనసభ సమావేశాలు కొంత సాఫీగా సాగేవి.

విపక్షంపై విరుచుకుపడుతూ...

2018 తర్వాత కేసీఆర్ తెలంగాణ ముఖ్యమంత్రిగా రెండోసారి బాధ్యతలు చేపట్టాక అధికార, ప్రతిపక్షాల మధ్య దూరం మరింత పెరిగింది. ఆపరేషన్ ఆకర్ష్‌ను ఉద్యమంగా చేపట్టిన కేసీఆర్.. కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా చేశారు. రేవంత్ రెడ్డికి శాసనసభలో గతంలో నోరెత్తే అవకాశం లేకుండా చేశారు. ఎప్పటికప్పుడు సభ నుంచి సస్పెండ్ చేసి పారేసేవారు. సభలో రేవంత్ రెడ్డి ముఖం చూడ్డం కూడా ఇష్టం లేదన్నట్టుగా కేసీఆర్ వ్యవహరించేవారు. కాంగ్రెస్ సభ్యులను చీటికి మాటికీ సస్పెండ్ చేసేవారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పరిస్థితులు మరింత వికటించాయి. 2019 ఎన్నికల్లో ప్రజలు తనకు 23 సీట్లు మాత్రమే ఇచ్చినప్పటికీ చంద్రబాబు నాయుడు కుంగిపోకుండా, సభకు హాజరవడాన్ని నామోషీగా భావించకుండా శాసనసభ సమావేశాలలో పాల్గొన్నారు. అధికారంలో ఉన్న వైసీపీ అడుగడుగునా అవమానించినా భరించారు. చివరకు తన సతీమణిని నిండు సభలో అవమానించడంతో తట్టుకోలేక కౌరవసభగా మారిన శాసనసభలోకి తిరిగి ముఖ్యమంత్రిగానే అడుగుపెడతానని శపథం చేసి సభను బహిష్కరించారు. ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు అధికారం తలకెక్కి అహంకారపూరితంగా వ్యవహరించిన కేసీఆర్, జగన్ ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నారు. అయితే... నాడు అధికార దర్పం వెలగబెట్టిన ఈ ఇరువురూ కూడా ప్రతిపక్ష నాయకులుగా శాసనసభ సమావేశాలలో పాల్గొనడానికి ఇష్టపడటం లేదు. తెలంగాణలో ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్‌కు గుర్తింపు ఉంది. అందుకు తగిన సంఖ్యా బలం ప్రజలు ఆయనకు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డికి ప్రతిపక్ష నాయకుడి హోదా పొందడానికి అవసరమైన సంఖ్యా బలాన్ని ప్రజలు ఇవ్వలేదు. తనకు ఏమాత్రం ఇష్టం లేని రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి స్థానంలో ఉండటాన్ని జీర్ణించుకోలేని స్థితిలో ఉన్న కేసీఆర్ శాసనసభ సమావేశాలకు హాజరు కావడంలేదు. అయితే, తాను సభకు హాజరు కాబోవడంలేదని మాత్రం ఆయన ఇంతవరకు ప్రకటించలేదు. జగన్మోహన్ రెడ్డి అలా కాకుండా... సంఖ్యా బలం లేకపోయినా తనకు ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వకపోతే శాసనసభకు హాజరు కాబోనని ప్రకటించారు. నాకు చాక్లెట్ కొనివ్వకపోతే బడికి వెళ్లనని విద్యార్థి మారాం చేసినట్టుగా ఆయన వ్యవహరిస్తున్నారు. 2019లో తెలుగుదేశం పార్టీ తరఫున 23 మంది శాసనసభ్యులు మాత్రమే ఎన్నికైనప్పటికీ వెరవకుండా చంద్రబాబు ప్రతిపక్ష నాయకుడి పాత్ర పోషించిన విషయం తెలిసి కూడా కేసీఆర్, జగన్మోహన్ రెడ్డిలు శాసనసభకు హాజరు కాకపోవడం వింతగా ఉంది. చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండి కూడా ప్రతిపక్ష స్థానంలో కూర్చోవడాన్ని నామోషీగా భావించలేదు. కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్లు మాత్రమే ముఖ్యమంత్రిగా ఉన్నారు. అయినా ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఉండటాన్ని జీర్ణించుకోలేకపోతున్న ఆయన ఏకంగా శాసనసభ మీదే అలిగారని భావించాల్సి ఉంటుంది. ఇక జగన్మోహన్ రెడ్డి విషయానికి వస్తే... ఐదేళ్లపాటు రారాజుగా వ్యవహరించిన తాను ప్రతిపక్షంలో కూర్చోవడం ఏమిటి? నాన్సెన్స్! అని భావిస్తున్నట్టు ఉంది. 1994 ఎన్నికల్లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి కూడా ప్రధాన ప్రతిపక్ష హోదా పొందడానికి అవసరమైన సంఖ్యా బలం లభించలేదు. అయినప్పటికీ ఆనాడు దివంగత పి. జనార్దన్ రెడ్డి శాసనసభలో కాంగ్రెస్ పక్ష నాయకుడిగా ప్రభుత్వంపై పోరాడారు. జగన్మోహన్ రెడ్డిలో ఈ స్ఫూర్తి కొరవడింది.

సభలో సెగలు...

తెలంగాణలో అధికార మార్పిడి జరిగి ఎనిమిది నెలలే అయింది. అయినప్పటికీ తెలంగాణ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. శుక్రవారంతో ముగిసిన శాసనసభ సమావేశాలలో చోటుచేసుకున్న సంఘటనలే ఇందుకు నిదర్శనం. కేసీఆర్ హయాంతో పోల్చితే రేవంత్ రెడ్డి ప్రభుత్వం శాసనసభలో ప్రజాస్వామ్య బద్ధంగానే వ్యవహరిస్తోంది. ప్రధాన ప్రతిపక్షమైన భారత రాష్ట్ర సమితికి తగిన సమయం కేటాయిస్తోంది. కీలకమైన అంశాలపై కోరినంత సమయం ఇస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో మాదిరిగా రాత్రులు పొద్దుపోయే వరకు సమావేశాలను నిర్వహించింది. మైక్ ఇవ్వాలంటూ ప్రతిపక్షాలు కొట్లాడే పరిస్థితిని అధికార కాంగ్రెస్ పార్టీ కల్పించడం లేదు. అయినప్పటికీ సభలో చివరి రెండు రోజుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఓటుకు నోటు కేసులో తాము అరెస్టు చేసి జైల్లో పడేసిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉండటాన్ని కేసీఆర్ మాత్రమే కాదు— బీఆర్ఎస్‌కు చెందిన ఇతర ముఖ్యులు కూడా సహించలేక పోతున్నట్టుగా ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సభలోనే 'రేవంత్ రెడ్డీ' అని కేటీఆర్ ఏకవచనంతో సంబోధించారు. అధికార కాంగ్రెస్ సభ్యులు దీనిపై ఆక్షేపించగా, ఒకప్పుడు తానూ రేవంత్ మంచి మిత్రులమని, గత పదేళ్లుగా తమ మధ్య చెడిందని, అందుకే గత చనువుతో పేరుతో సంబోధించానని కేటీఆర్ వివరణ ఇచ్చారు. అయితే ఈ వివరణ ఆకుకు అందకుండా పోకకు పొందకుండా ఉంది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మంత్రిగా ఉన్న కేటీఆర్ ఆయనను సభలో 'మా బాపు లేదా మా నాన్న' అని ఎప్పుడూ సంబోధించలేదు. 'గౌరవ ముఖ్యమంత్రి' అని మాత్రమే అనేవారు. కేసీఆర్ కూడా తన కుమారుడిని 'గౌరవ మంత్రి' అని మాత్రమే సంబోధించేవారు. అంతేగానీ ఇంట్లో పిలుచుకున్నట్టు అరే తురే అని సంబోధించలేదు. సభా సంప్రదాయాలు అలాగే ఉంటాయి. ఉండాలి కూడా! రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గుర్తించడానికి మనసులో ఎక్కడో అయిష్టం ఉన్నందునే డిఫెన్స్ బదులు అఫెన్స్ పాత్ర పోషించాలని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నట్టు కనిపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరదాగా, యథాలాపంగా చేసిన ఒక వ్యాఖ్యకు విపరీత అర్థాలు తీయడమే ఇందుకు నిదర్శనం. ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతున్నప్పుడు రేవంత్ రెడ్డి కల్పించుకొని, 'మీ వెనుక కూర్చున్న అక్కల మాట వింటే మీ పరిస్థితి జూబిలీ బస్టాండ్ అవుతుంది' అని వ్యాఖ్యానించారు. సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిని ఉద్దేశించి ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు మహిళలను అవమానించడమేనని, ముఖ్యమంత్రికి మహిళలంటే గౌరవం లేదని బీఆర్ఎస్ సభ్యులు ఎదురుదాడి చేసే ప్రయత్నం చేశారు. సభ లోపలా వెలుపలా నిరసన వ్యక్తం చేశారు. తనను అవమానించారని సబితా ఇంద్రారెడ్డి కన్నీరు పెట్టుకోవడం కూడా జరిగింది. నిజానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలలో ఆక్షేపించాల్సింది ఏమీ లేదు. ఫలానా వాళ్ల మాటలు వింటే చెడిపోతావు అని మనం అనడం సహజం. రేవంత్ వ్యాఖ్యలను కూడా ఆ కోవలోనే చూడాలి. అంతేకాదు, రేవంత్ రెడ్డి ట్రాక్ రికార్డ్ పరిశీలిస్తే... ఆయన మహిళల పట్ల అభ్యంతరకరంగా ప్రవర్తించిన లేదా వారిని అవమానించిన సందర్భాలు లేవు. దీంతో బీఆర్ఎస్ ప్రయత్నం ఫలించలేదు. పనిలో పనిగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క 'ఏ ముఖం పెట్టుకొని ఇప్పుడు మాట్లాడుతున్నారు' అని చేసిన వ్యాఖ్యను కూడా అనుకూలంగా మలచుకొనే ప్రయత్నాన్ని కేటీఆర్ అండ్ కో చేసింది. వాస్తవానికి సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు జరిగిన సంఘటనలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి పూసగుచ్చినట్టు వివరించడంతో బీఆర్ఎస్సే ఆత్మరక్షణలో పడింది. మహిళలను అవమానించిన ముఖ్యమంత్రి రేవంత్ క్షమాపణలు చెప్పాలంటూ బీఆర్ఎస్ చేసిన ఆందోళనలను కూడా ప్రజలు పట్టించుకోలేదు. దీంతో బీఆర్ఎస్ అందుకున్న ఆయుధం పనిచేయలేదు. అయితే... సమావేశాల చివరి రోజు బీఆర్ఎస్ తరఫున ఎన్నికై కాంగ్రెస్ పార్టీలో చేరిన దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలు మాత్రం అధికారపక్షాన్ని ఆత్మరక్షణలో పడేశాయి. దానం నాగేందర్ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయి. వీధి పోరాటాల సందర్భంగా వాడే భాషను ఆయన వ్యాఖ్యలు తలపించాయి. మజ్లిస్ నాయకుడు అక్బరుద్దీన్ జోక్యంతో దానం తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారు. ఇలాంటి భాషను నిన్నటి వరకు ఆంధ్రప్రదేశ్ శాసనసభలో విన్నాం. ఇప్పుడు ఆ రాష్ట్ర శాసనసభ సమావేశాలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. జగన్మోహన్ రెడ్డి సభకు హాజరు కావడం లేదు కనుక సభలో ఉద్రిక్త పరిస్థితులు

> **2019లో తెలుగుదేశం పార్టీ తరఫున 23 మంది శాసనసభ్యులు మాత్రమే ఎన్నికైనప్పటికీ వెరవకుండా చంద్రబాబు ప్రతిపక్ష నాయకుడి పాత్ర పోషించిన విషయం తెలిసి కూడా కేసీఆర్, జగన్మోహన్ రెడ్డిలు శాసనసభకు హాజరు కాకపోవడం వింతగా ఉంది.**

తలెత్తడం లేదు. గత ఎన్నికల వరకు తెలంగాణ శాసనసభ సమావేశాలు కూడా ప్రశాంతంగానే సాగాయి. ఇప్పుడు పరిస్థితులు మారాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కేసీఆర్ కుటుంబానికి మధ్య నెలకొన్న వైరం ఇందుకు కారణం కావచ్చు.



కేసీఆర్ సభకు వస్తే...

కేసీఆర్ సభకు హాజరైతే తెలంగాణ శాసనసభ సమావేశాలు కచ్చితంగా మరింత ఆకర్షణీయంగా, ఆసక్తికరంగా ఉండేవి. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించినట్టుగా మజా వచ్చేది. కేసీఆర్‌తో పాటు కేటీఆర్, హరీశ్‌రావ్ మంచి స్పీకర్లు. అధికార కాంగ్రెస్ పార్టీలో ఆ స్థాయి వాక్చాతుర్యం ఉన్నవాళ్లు అతికొద్ది మంది మాత్రమే ఉన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నప్పటికీ ఆ స్థాయిలో వాక్చాతుర్యం ఉన్నవాళ్లుగానీ, సై అంటే సై అనగలిగే వాళ్లు గానీ కాంగ్రెస్‌లో తక్కువే. నిజం చెప్పాలంటే కేసీఆర్ సభకు వచ్చి కేటీఆర్, హరీశ్‌లను కుడి ఎడమల కూర్చోబెట్టుకొని అధికార పక్షంపై మాటల యుద్ధానికి దిగితే ప్రభుత్వం ఎంతో కొంత ఆత్మరక్షణలో పడుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబుకు వాక్చాతుర్యం లేకపోయినా, ఆ శక్తి ఉన్నవాళ్లను ప్రోత్సహిస్తూ ప్రతిపక్ష పాత్రను పోషించేవారు. జగన్మోహన్ రెడ్డి వ్యవహారం మొరటుగా ఉంటుంది. అంచేత ఆయన సభకు హాజరైనప్పటికీ చర్చలు రసవత్తరంగా సాగే అవకాశం లేదు. వైసీపీ తరఫున గెలిచిన పదకొండు మందిలో మాటకారితనం ఉన్న వాళ్లు ఉన్నారో లేదో తెలియదు. బూతు భాషకు అలవాటు పడిన వారందరూ తాజా ఎన్నికల్లో ఓడిపోయారు కనుక ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఇప్పుడు బూతులు వినపడకపోవచ్చు. మహాభారతంలో దుర్యోధనుడు పాండవులపై పగ పెంచుకోవడానికి... మయసభలో అడుగిడిన సందర్భంగా జరిగిన అవమానం ఒక కారణం. అలాంటి అనుభవం ఎదురు కాకపోయినా శాసనసభకు హాజరు కాకూడదని జగన్మోహన్ రెడ్డి నిర్ణయించుకోవడం వింతగా ఉంది. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల కూడా తన సోదరుడి నిర్ణయాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. రాజకీయ పార్టీల మధ్య విభేదాలు ఉండటం సహజం. విద్వేషాలు ఏర్పడటం వాంఛనీయం కాదు. దురదృష్టవశాత్తు తెలుగు రాష్ట్రాలలో ఇదే పరిస్థితి ఉంది. అధికార ప్రతిపక్ష నాయకుల మధ్య వ్యక్తిగత స్థాయిలో వైషమ్యాలు నెలకొన్నాయి.

> **చంద్రబాబుకు వాక్చాతుర్యం లేకపోయినా, ఆ శక్తి ఉన్నవాళ్లను ప్రోత్సహిస్తూ ప్రతిపక్ష పాత్రను పోషించే వారు. జగన్మోహన్ రెడ్డి వ్యవహారం మొరటుగా ఉంటుంది. అంచేత ఆయన సభకు హాజరైనప్పటికీ చర్చలు రసవత్తరంగా సాగే అవకాశం లేదు. వైసీపీ తరపున గెలిచిన పదకొండు మందిలో మాటకారితనం ఉన్న వాళ్లు ఉన్నారో లేదో తెలియదు. బూతు భాషకు అలవాటు పడిన వారందరూ తాజా ఎన్నికల్లో ఓడిపోయారు కనుక ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఇప్పుడు బూతులు వినపడకపోవచ్చు. మహాభారతంలో దుర్యోధనుడు పాండవులపై పగ పెంచుకోవడానికి... మయసభలో అడుగిడిన సందర్భంగా జరిగిన అవమానం ఒక కారణం. అలాంటి అనుభవం ఎదురు కాకపోయినా శాసనసభకు హాజరు కాకూడదని జగన్మోహన్ రెడ్డి నిర్ణయించుకోవడం వింతగా ఉంది. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల కూడా తన సోదరుడి నిర్ణయాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. రాజకీయ పార్టీల మధ్య విభేదాలు ఉండటం సహజం. విద్వేషాలు ఏర్పడటం వాంఛనీయం కాదు.**

మారకపోతే అంతే..

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పర్యాయం మరింత పరిణతి ప్రదర్శిస్తున్నారు. పర్యటనల సందర్భంగా హంగూ ఆర్భాటాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తన సభలకు జన సమీకరణలు చేయకూడదని నిర్ణయించుకోవడం నిజంగా ముదావహం. ఆయన మడకశిర నియోజకవర్గంలో జనసమీకరణ లేకుండా సాదాసీదాగా కార్యక్రమాల్లో పాల్గొనడాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత రఘువీరా రెడ్డి అభినందించడం గమనార్హం. అధికారం దక్కించుకున్న చంద్రబాబులోనే ఇంత మార్పు వచ్చినప్పుడు, అధికారం కోల్పోయిన జగన్ రెడ్డిలో ఏ మార్పూ కనిపించకపోవడం ఆశ్చర్యంగా ఉంది. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పరదాల మాటున, పోలీసు రక్షణలో, పాఠశాలలకు సెలవులు ప్రకటింపజేసి, దుకాణాలను సైతం మూయించి, జనాలను బలవంతంగా తరలించి సభలు నిర్వహించినా ఎన్నికల్లో ఫలితం ఇవ్వలేదనే వాస్తవాన్ని జగన్ రెడ్డి గుర్తించడానికి నిరాకరించడం ఆయన మనస్తత్వానికి నిదర్శనం. ఎన్నికల్లో ఓడిపోయాక కూడా తనను కలవడానికి వచ్చిన కార్యకర్తలను కలుసుకోవడానికి నిరాకరిస్తున్నట్టు వార్తలొస్తున్నాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజలకు మరింత చేరువయ్యే ప్రయత్నం ఎవరైనా చేస్తారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అడపాదడపా అయినా తరలించి తీసుకువచ్చిన వారిని కలుసుకుంటున్నారు. జగన్మోహన్ రెడ్డి కనీసం ఆ పని కూడా చేయడం లేదు. ఈ నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా గతంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ తనను వేధించిన విషయాలను మరచిపోయి మరింత హుందాగా వ్యవహరించడం అవసరం. ప్రభుత్వంలో ఉన్నప్పుడు పనుల ఒత్తిడి ఉంటుంది. ఎల్లవేళలా అందరినీ సంతృప్తి పరచడం సాధ్యం కాదు. శాసనసభ లోపలా వెలుపలా ప్రతిపక్షాల పట్ల మరింత ఉదారంగా వ్యవహరిస్తే ప్రజలు హర్షిస్తారు. ప్రతిపక్షాలను పూచికపుల్లల కంటే హీనంగా చూసిన కేసీఆర్‌తో పోటీ పడాలనుకోకూడదు. ఓటుకు నోటు కేసును అడ్డుపెట్టుకొని కేసీఆర్ కర్కశంగా వ్యవహరించడం వల్లనే ప్రజల్లో రేవంత్ రెడ్డి పట్ల సానుభూతి ఏర్పడింది. అంతిమంగా అది ఆయన ముఖ్యమంత్రి కావడానికి దోహదపడింది. ఈ వాస్తవాన్ని రేవంత్ విస్మరించ కూడదు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను ఢీకొనగల సత్తా రేవంత్ రెడ్డిలో లేకపోలేదు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి తమను అవమానిస్తున్నారన్న భావన బీఆర్ఎస్‌కు చెందిన కొంత మంది ఎమ్మెల్యేలతో పాటు కార్యకర్తల్లో కూడా నెలకొన్నది. ఈ కారణంగానే లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్‌కు చెందిన వాళ్లు కొంతమంది భారతీయ జనతా పార్టీకి మద్దతు ఇచ్చారు. ఫలితంగా కాంగ్రెస్‌తో సమానంగా బీజేపీ కూడా ఎనిమిది సీట్లు గెలుచుకుంది. తనలో రాజకీయంగా కసి రగలడానికి కారణం ఎవరు? ఏమిటి? అనేది గుర్తించి అవతలి వారిలో కూడా తనపై కసి ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకొనే విషయం రేవంత్ రెడ్డి ఆలోచించాలి.


కాంగ్రెస్ గ్రాఫ్ తగ్గుతోందా...

ఎనిమిది నెలల క్రితం ఎన్నికలు జరిగిన సమయంతో పోల్చితే కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ కొంత తగ్గినట్టుగా సమాచారం వస్తోంది. ఇందుకు రేవంత్ రెడ్డి మాత్రమే కారణం కాదు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ప్రధాన బాధ్యత తీసుకోవాలి. ముఖ్యమంత్రికి తగిన స్వేచ్ఛ కూడా ఇవ్వడం లేదు. మంత్రులు, ముఖ్యంగా సీనియర్లు ఎవరికి వారే ముఖ్యమంత్రులుగా వ్యవహరిస్తున్నారు. మంత్రులకు స్వేచ్ఛ అవసరమేగానీ అది అపరిమితం కాకూడదు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి రాష్ట్రంలోని పరిస్థితులపై అవగాహన ఉన్నట్టుగా లేదు. ఆమె హైదరాబాద్‌లోనే అధిక సమయం గడుపుతున్నప్పటికీ పార్టీలో ఏం జరుగుతున్నదో పట్టించుకోవడం లేదు. అధిష్ఠానం అతి జోక్యం కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో నష్టం చేస్తున్నది. ఆ ఛాయలు ఇప్పటికే కనబడుతున్నాయి. జాతీయ స్థాయిలో ఇప్పుడిప్పుడే ప్రజాభిమానం

> **తెలంగాణలో ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్‌కు గుర్తింపు ఉంది. అందుకు తగిన సంఖ్యా బలం ప్రజలు ఆయనకు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డికి ప్రతిపక్ష నాయకుడి హోదా పొందడానికి అవసరమైన సంఖ్యా బలాన్ని ప్రజలు ఇవ్వలేదు. తనకు ఏమాత్రం ఇష్టం లేని రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి స్థానంలో ఉండటాన్ని జీర్ణించుకోలేని స్థితిలో ఉన్న కేసీఆర్ శాసనసభ సమావేశాలకు హాజరు కావడంలేదు. అయితే, తాను సభకు హాజరు కాబోవడంలేదని మాత్రం ఆయన ఇంతవరకు ప్రకటించలేదు. జగన్మోహన్ రెడ్డి అలా కాకుండా... సంఖ్యా బలం లేకపోయినా తనకు ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వకపోతే శాసనసభకు హాజరు కాబోనని ప్రకటించారు. 1994 ఎన్నికల్లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి కూడా ప్రధాన ప్రతిపక్ష హోదా పొందడానికి అవసరమైన సంఖ్యా బలం లభించలేదు. అయినప్పటికీ ఆనాడు దివంగత పి. జనార్దన్ రెడ్డి శాసనసభలో కాంగ్రెస్ పక్ష నాయకుడిగా ప్రభుత్వంపై పోరాడారు. జగన్మోహన్ రెడ్డిలో ఈ స్ఫూర్తి కొరవడింది.**

చూరగొంటున్న రాహుల్ గాంధీ అప్పుడప్పుడయినా తెలంగాణలో పరిస్థితులను స్వయంగా సమీక్షించడం అవసరం. శాసనసభలో పోరు ప్రస్తుతానికి కాంగ్రెస్–బీఆర్ఎస్ మధ్య కేంద్రీకృతం కావడంతో భారతీయ జనతా పార్టీ పరిస్థితి స్తబ్దుగా ఉంది. ఆ పార్టీ ఎప్పుడు ఎటువంటి ఎత్తుగడలు అనుసరిస్తుందో తెలియదు. బీజేపీ తెరుకొనేలోపే ప్రధాన ప్రతిపక్షంగా మరింత బలపడే ప్రయత్నాలను బీఆర్ఎస్ మొదలెట్టింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన యంత్రాంగాన్ని, మంత్రాంగాన్ని మరింత పటిష్ఠం చేసుకోవాలి. రుణమాఫీ వంటి ప్రధాన హామీల విషయంలో మాట నిలబెట్టుకున్నప్పటికీ ప్రభుత్వంపై మొత్తంగా ప్రజల్లో సదభిప్రాయం నెలకొనేలా తగు చర్యలు తీసుకోని పక్షంలో కాంగ్రెస్ పార్టీ బలహీనపడే ప్రమాదం ఉంది. రేవంత్ రెడ్డి పాలనలో బీఆర్ఎస్ ముఖ్యులు ఉక్కపోతకు గురవుతుండవచ్చు గానీ ప్రజాస్వామ్య ప్రియులు స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నారు. అదే సమయంలో ప్రభుత్వ యంత్రాంగంలో జవాబుదారీతనాన్ని చొప్పించాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో ప్రజల్లో ఫీల్ గుడ్ భావన లోపిస్తుంది. రాజకీయ వైషమ్యాలే పాలకులకు, ప్రతిపక్షాలకు ప్రధాన ఎజెండా కాకూడదు. అదే జరిగితే భారతీయ జనతా పార్టీ ఉండనే ఉంది. తస్మాత్ జాగ్రత్త!

బెజవాడ అభివృద్ధికి ఆద్యుడు



ఆనాటి బెజవాడ నగరంలో ఆది వైద్యుడు డా. తెన్నేటి వెంకట శేషాచలపతి రావు. మురికివాడల్లో మెరుగైన వైద్యం, చీకటి గుడిసెల్లో నిండు వెలుగులు, మండు వేసవిలో మంచినీళ్ళు, నగర ప్రజలకు తొలి ఆర్టీసీ బస్సు సౌకర్యం, మురికివాడల సుందరీకరణ, పారిశుధ్య కార్మికుల పిల్లలకు ఉచిత విద్యాబోధన, నిరుపేద మహిళలకు జీవనోపాధి కల్పించి బెజవాడ ప్రజల ఆత్మబంధువుగా కీర్తి శేషుడు అయిన ఉదాత్తుడు డా. టి.వి.ఎస్.చలపతి రావు. ఆయన జీవితం, నాయకత్వం నాటి బెజవాడ, నేటి విజయవాడ నగర చరిత్రలో ఓ సువర్ణాధ్యాయం.

ఆనాటి బెజవాడ నగరంలో ఆది వైద్యుడు డా. తెన్నేటి వెంకట శేషాచలపతి రావు. మురికివాడల్లో మెరుగైన వైద్యం, చీకటి గుడిసెల్లో నిండు వెలుగులు, మండు వేసవిలో మంచినీళ్ళు, నగర ప్రజలకు తొలి ఆర్టీసీ బస్సు సౌకర్యం, మురికివాడల సుందరీకరణ, పారిశుధ్య కార్మికుల పిల్లలకు ఉచిత విద్యాబోధన, నిరుపేద మహిళలకు జీవనోపాధి, ఇంకా అనేకానేక స్వీయ ప్రణాళికా సంస్కరణలతో బెజవాడ ప్రజల ఆత్మబంధువుగా రాజకీయ దురంధరుడుగా, ప్రజాసేవలో తనదైన ముద్ర వేసిన ఉదాత్తుడు డా. టి.వి.ఎస్. చలపతి రావు. పరవళ్ళు తొక్కుతూ బిలబిల పారే కృష్ణమ్మ ఒడ్డున ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ సాక్షిగా ఆయన జీవితం, నాయకత్వం నాటి బెజవాడ, నేటి విజయవాడ నగర చరిత్రలో సుస్థిరంగా లిఖించబడిన ఓ సువర్ణాధ్యాయం. బెజవాడ మునిసిపల్ కౌన్సిలర్‌గా, చైర్మన్‌గా, ఆ పై రెండు పర్యాయాలు ఎం.ఎల్.ఏ.గా ఎన్నో సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి కార్మిక, కర్షక సంఘాలకు, వైద్యుల సంఘాలకు, విద్యుత్తు, పోస్టల్ సంఘాలకు నాయకత్వం వహించిన అజాతశత్రువు, బీదల అప్పుడు డా. టి.వి.ఎస్ చలపతి రావు. కమ్యూనిస్ట్ పార్టీకి కంచుకోటగా ఉన్న బెజవాడలో రెండు పర్యాయాలు అంటే 1962 నుండి 1972 వరకు శాసనసభ్యుడిగా ఎన్నికైన తొలి కాంగ్రెస్ నాయకుడు డా.చలపతి రావు.

కృష్ణా జిల్లా తెన్నేరు గ్రామంలో బ్రాహ్మణ కుటుంబంలో 1911లో ఆయన జన్మించారు. ఆచార వ్యవహారాలతో పాటు నరనరానా దేశభక్తిని అలవర్చుకున్న యువకుడు డా. టి.వి.ఎస్. ఎంతో ఇష్టంగా పట్టుదలతో వైద్యవిద్యను అభ్యసించి అప్పటి మద్రాసు పాలిత ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిసారిగా 1936 లోనే సొంతంగా రోగనిర్ధారణ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసి నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించి గొప్ప పేరు గడించారు. ఓ ప్రక్కన వైద్యవృత్తిని చేస్తూనే అనేకానేక సమస్యలతో ఉన్న బెజవాడ ప్రజలకు సేవలందించేందుకు చలపతిరావు నడుం బిగించారు. 1939 లో బ్రిటీష్ వారి పరిపాలనలో బహు బలీయంగా ఉన్న జస్టిస్ పార్టీకి దీటైన పోటీ ఇచ్చి అనూహ్యంగా మునిసిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. ప్రణాళికాబద్ధమైన పనితీరుతో తన వార్డు అభివృద్ధికి ఎంతో కృషి చేసి సఫలీకృతులయ్యారు. ప్రజాపాలన పట్ల ఆయనకు ఉన్న విశేష పరిజ్ఞానం, రాజకీయ చతురతను గుర్తించి 1947లో అందరి మద్దతుతో బెజవాడ మున్సిపల్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్వతంత్ర భారతావనిలో ఏకగ్రీవంగా ఎన్నికైన తొట్టతొలి మునిసిపల్ చైర్మన్ డా. టి.వి.ఎస్. చలపతిరావు.

పున్నమ్మతోటలో ఆల్ ఇండియా రేడియో కేంద్రం ఏర్పాటు, గన్నవరం విమానాశ్రయానికి శ్రీకారం చుట్టడం ఆయనే ఆధ్వర్యంలోనే జరిగాయి. ఇందిరాగాంధీ మునిసిపల్ మైదానం ఆయన హయాంలోనే ఏర్పాటు చేశారు. మురికివాడల్లో నివసించే నిరుపేదలకు శాశ్వత గృహాలు ఏర్పాటు చేశారు. గాంధీనగర్లో మునిసిపాలిటీ ఉద్యోగులకు ఉచితంగా ఇళ్ల స్థలాన్ని కేటాయించారు. ఫార్మా రంగంలోనే పేరున్న సిరీస్ ఫార్మసూటికెల్స్ సంస్థ విజయవాడలో ఫ్యాక్టరీ పెట్టడానికి ముందుకొచ్చిన జి.ఎస్.రాజుకు అన్ని అనుమతులు ఇచ్చి ప్రోత్సహించారు. 1952–53 మధ్య కాలంలో బెజవాడ మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా నగరంలో భూగర్భ మురికినీటి పారుదల సౌకర్యం కావాలని దానికి సంబంధించిన ప్రణాళికను డా. తెన్నేటి తయారు చేసి అప్పటి అవిభక్త మద్రాస్ రాష్ట్ర ముఖ్యమంత్రి సి.రాజగోపాలాచారికి పంపగా, ఆయన వెంటనే ఆమోదించి కావాల్సిన నిధులను మంజూరు చేశారు. ఇదే కాలంలో ఆయన మున్సిపల్ చైర్మన్‌గా, చాంబర్ సెక్రటరీగా చేపట్టిన అభివృద్ధికి, స్థానిక సంస్థల పరిపాలనా దక్షతకు, నగర నిర్మాణానికి అద్భుతమైన ప్రణాళికలను రూపొందించారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ఛాంబర్ ఆఫ్ మున్సిపల్ చైర్మన్ గౌరవ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికై బాధ్యతలు చేపట్టారు. ఆయన అందించిన సేవలకు, స్థానిక సంస్థల స్వపరిపాలన తీరుని గుర్తించిన అమెరికా ప్రభుత్వం డా.టి.వి.ఎస్‌ను అక్కడ స్థానిక సంస్థల స్వపరిపాలన విధానాన్ని అధ్యయనం చేయవలసిందిగా ప్రత్యేకంగా డెట్రాయిట్‌కి ఆహ్వానించింది.

వైద్యం, రాజకీయం, ఆధ్యాత్మిక, ధార్మిక, సాహిత్యం, క్రీడలు, రచనావ్యాసంగాలపై ఎంతో మక్కువ ఇలా అన్నింటిని సమపాళ్లలో స్వాగతించేవారు. ఆ అభిరుచితోనే డా. చలపతిరావు 'ప్రజాసేవ' అనే రాజకీయ వారపత్రిక, తెలుగులో 'మున్సిపల్ సమాచార్' ఇంగ్లీష్‌లో 'మద్రాస్ మునిసిపాలిటీ' అనే త్రైమాసిక పత్రికను ప్రారంభించి వాటికి సంపాదకత్వం వహించారు. ఎంతో ఇష్టపడి చదువుకున్న వైద్యవిద్యతో వేలాదిమందికి ఆయన ఉదారంగా మెరుగైన వైద్యసేవలు అందించారు. 1937లో మొట్టమొదటి ప్రైవేటు ఆసుపత్రి డా. టి.వి.ఎస్ క్లినిక్‌ని, ఆధునిక డయాగ్నస్టిక్ లేబరేటరీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తూ ఎక్స్‌రే, డీప్ ఎక్స్‌రే, ఈ.సి.జి, ఐ.సి.సి.యు, టి.ఎం.టి వంటి సదుపాయాలు కల్పించడంతో పాటు క్యాన్సర్‌కి చికిత్స కూడా చేసేవారు చలపతిరావు. ఐ.ఎం.ఏ. విజయవాడ శాఖ ప్రెసిడెంట్‌గా, బెజవాడ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా వైద్యరంగానికి ఎన్నో సేవలందించారు.

1964–67 వరకూ శ్రీశైలం ట్రస్ట్ బోర్డు సభ్యులుగా, 1967–70 వరకూ తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులుగా స్వామివారి సేవల్లో కొనసాగి, టీటీడీ తలపెట్టిన హిందూ ధర్మ ప్రచార సంస్థ ఏర్పాటుకు విశేష కృషి చేశారు. కంచి పరమాచార్య శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామి వారి దివ్య హస్తాలతో ఆ సంస్థను ప్రారంభించారు. ఆ సమయంలో ఋషీకేశ్‌లో టీటీడీ వారి వసతి గృహాన్ని ప్రారంభించారు. విజయవాడలో అయ్యప్ప స్వామి దేవాలయం, ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి టీటీడీ నుంచి నిధులు మంజూరు చేయించారు. దాదాపు ఐదు దశాబ్దాల పాటు ప్రజాసేవలో గడిపి లక్షలాది మంది గుండెల్లో గుడికట్టుకుని ఓ దైవంగా ఆరాధించబడిన నిరాడంబర జీవి, బహుముఖ ప్రజ్ఞాశాలి, వైద్యుడు, ప్రజానాయకుడు డా.తెన్నేటి వేంకట శేషాచలపతిరావు.

అనేక మంది అగ్రనాయకులు డా. టి.వి.ఎస్ పట్ల అమిత గౌరవాదరాలు చూపేవారు. ఆయన్ను 'రాజర్షి'గా కొనియాడేవారు. ఆయనకు నివాళులు అర్పించిన వారిలో జ్ఞానీ జైల్ సింగ్, ఆర్. వెంకట్ రామన్, నీలం సంజీవరెడ్డి, పి.వి. నరసింహారావు, మన్మోహన్ సింగ్, కాసు బ్రహ్మానంద రెడ్డి, డా. మర్రి చెన్నారెడ్డి తదితర నాయకమణులు ఉన్నారు. అరవిందో తత్వవేత్త మంగేష్ వి.నాథకర్ణి, బి.కె నెహ్రూ, ఎల్.కె. ఝా, శ్రీ వెంకటేశ్వరన్, డా. సూరి భాగవంతం, డా.ఎస్. రామ్, జనరల్ కె.వి కృష్ణారావు, ఎం.వి. కామత్, జి.వి.జి కృష్ణమూర్తి, సి.సుబ్రమణ్యం తదితర ప్రముఖులు చలపతిరావు స్మారకోపన్యాసాలను వెలువరించారు. ఐ.ఎం.ఏ విజయవాడ శాఖ డా. టి.వి.ఎస్. చలపతిరావు పేరిట ఏర్పాటు చేసిన గోల్డ్ మెడల్‌ను అందుకున్నవారిలో, లోకనాయక్ డా. జయప్రకాష్ నారాయణ్, డా. కళ్యాణ్ రామం, డా. ఎం.కె.మణి మున్నగు ప్రముఖులు ఉన్నారు.

ఈ ఆగస్టు 5న డా. చలపతిరావు 45వ సంస్మరణ దినోత్సవం జరుగుతుంది. ఆ రోజున వారి స్మృతివనంలో హిందు, ముస్లిం, క్రీస్తు మత పెద్దల ప్రార్థనలతో పాటు నగర ప్రముఖులు ఆయనకు నివాళులు అర్పిస్తారని డా.చలపతిరావు కుమారుడు ప్రముఖ వైద్యులు డా.టి.వి.ఎస్.శర్మ తెలియజేశారు.

• **సురేష్ కశ్యప్,** సీనియర్ జర్నలిస్ట్

(రేపు డాక్టర్ టివిఎస్ చలపతిరావు సంస్మరణ దినోత్సవం)



యామినీ కృష్ణ

యామినీ కృష్ణమూర్తి మృతితో కన్నీరు పెట్టుకున్న కూచిపూడి గ్రామం

1960లోనే కూచిపూడిలో శిక్షణ పొందిన కళాకారిణి

అనేకసార్లు కూచిపూడి నాట్యోత్సవాలకు రాక



కూచిపూడి నాట్యాచార్యులు పీవీజీ కృష్ణశర్మను సత్కరిస్తున్న యామినీ కృష్ణమూర్తి (ఫైల్)

ఆమె సిరిసిరిమువ్వలు నెమలికి నాట్యం నేర్పిస్తాయి. గమకాల నాదవినోదానికి తన నాట్య విలాసంతో గమనాన్ని జతచేసి ఆమె వేసే ప్రతి అందె ఆహూతులను ఆనందింపజేస్తుంది. భరతనాట్యకారిణిగా, కూచిపూడి కళాకారిణిగా ఖండాంతరాల్లో తన ఖ్యాతిని ఇనుమడింపజేసుకున్న యామినీ కృష్ణమూర్తికి కృష్ణాజిల్లాపై మక్కువ ఎక్కువ. స్వతహాగా భరతనాట్య కళాకారిణి అయినప్పటికీ కూచిపూడి నాట్యంపై ఇష్టంతో 1960లోనే ఇక్కడికి వచ్చారు. కూచిపూడి నాట్యానికి పుట్టినిల్లైన కూచిపూడిలో నాట్యాచార్యులు చింతా కృష్ణమూర్తి, సంగీత కళానిధి పీవీజీ కృష్ణశర్మ వద్ద శిక్షణ పొందారు. పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం వద్ద కూడా కూచిపూడిలో మెళకువలు నేర్చుకున్నారు. శ్రీసిద్ధేంద్ర కళాపీఠంలో జరిగిన కళారత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్ బృంద భామా కలాపంలో యక్షగానాన్ని చిత్రీకరించారు. అంతర్జాతీయ స్థాయిలో కూచిపూడి అంశాలను ప్రదర్శించి అంతులేని కీర్తిని సముపార్జించారామె. కూచిపూడిలో జరిగిన నాట్యోత్సవాల్లో అనేకసార్లు పాల్గొన్నారు. ఇక్కడి కళాకారులతో ప్రత్యేక అనుబంధాన్ని కొనసాగించారు. యామినీ కృష్ణమూర్తి మృతి వార్తతో కూచిపూడి గ్రామం కన్నీరు పెట్టుకుంది. కళారంగానికి తీరని లోటని నాట్యాచార్యులు డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్, డాక్టర్ చింతా రవిబాలకృష్ణ, డాక్టర్ యేలేశ్వరపు శ్రీనివాస్ తదితరులు పేర్కొన్నారు. - కూచిపూడి

సోమేశ్వరుడి ఆలయంలో అధికారుల తనిఖీలు

- రూ.4 కోట్ల స్వాహాపై విచారణ
- రికార్డుల తనిఖీ అనంతరం నివేదిక



6లో..

హ్యాపీ బర్త్ డే

ఎంపీ కేశినేని చిన్ని జన్మదిన వేడుకలు శనివారం జిల్లావ్యాప్తంగా జరిగాయి. టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డూండీ రాకేశ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డులోని ఓ కన్వెన్షన్ హాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కటింగ్ అనంతరం చిన్నారులకు బ్యాగ్‌లు, దివ్యాంగులు, వృద్ధులకు దుస్తులు, ఇతర సామగ్రి పంపిణీ చేశారు.



కల సాకారం

మహానాడు-నిడమానూరు ఫ్లై ఓవర్‌కు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

బెజవాడకు జంబో ఫ్లై ఓవర్ రానుంది. అలాగే, ఈస్ట్ బైపాస్ సాకారం కానుంది. అతిపెద్ద ఏడు కిలోమీటర్ల నిడమానూరు ఫ్లై ఓవర్‌కు, ఈస్ట్ బైపాస్‌కు కేంద్రం ఆమోదముద్ర వేసింది. విజయవాడ నగరవాసుల ట్రాఫిక్ కష్టాలను తీర్చే ఈ రెండు కీలక ప్రాజెక్టులు త్వరలోనే పట్టాలెక్కనున్నాయి.

- రూ.800 కోట్లతో రెండున్నరేళ్లలో పూర్తి
- విజయవాడ తూర్పు బైపాస్‌కు అంగీకారం
- రూ.2,716 కోట్లతో మూడున్నరేళ్లలో పూర్తి
- వచ్చే ఏడాది మార్చి నుంచి పనులు ప్రారంభం
- ఎంపీ కేశినేని చిన్ని వెల్లడి

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న విజయవాడ తూర్పు బైపాస్‌కు, మహానాడు జంక్షన్ నుంచి నిడమనూరు వరకు ఫ్లై ఓవర్ నిర్మాణానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని శనివారం కేంద్రం ఆమోదించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. విజయవాడలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహానాడు జంక్షన్ నుంచి నిడమానూరు వరకు ఆరు లైన్ల ఫ్లై ఓవర్‌కు అనుమతి లభించిందని, దీనికి సంబంధించిన డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) కూడా దాదాపు సిద్ధమైందన్నారు. రెండు నెలల్లో టెండర్లు పిలవనున్నారని, ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చిలో ప్రారంభిస్తారన్నారు. రెండున్నరేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. ప్రాజెక్టు అంచనా వ్యయం సుమారు రూ.800 కోట్లు అని పేర్కొన్నారు. ఈ నిర్మాణం పూర్తయ్యేలోగా రామవరప్పాడు నుంచి గన్నవరం వరకు రేడియల్ రోడ్లు నిర్మిస్తారన్నారు. దీంతో పాటు విజయవాడ తూర్పు బైపాస్ నిర్మాణం కూడా వచ్చే ఏడాది మార్చిలో ప్రారంభమవుతుందని చిన్ని చెప్పారు. తూర్పు బైపాస్ నిర్మాణానికి రూ.2,716 కోట్ల వరకూ ఖర్చవుతుందని, త్వరలో జాతీయ రహదారి అధికారులు రివైజ్డ్ డీపీఆర్‌ను సిద్ధం చేస్తారని చెప్పారు. మూడున్నరేళ్లలో తూర్పు బైపాస్ నిర్మాణం పూర్తవుతుందన్నారు. అమృత్ పథకం కింద విజయవాడ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నారని, త్వరలోనే నిధులు విడుదలవుతాయన్నారు. అమరావతికి రైల్వేలైన్ రావడం సంతోషదాయక విషయమన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం కృషిచేసేదే కూటమి ప్రభుత్వమని, అందుకే కేవలం 40 రోజుల్లోనే అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లను కేంద్రం అందించిందన్నారు. ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు మార్క్ అని పేర్కొన్నారు.

నగర ట్రాఫిక్‌కు చెక్

మహానాడు ఫ్లై ఓవర్, విజయవాడ ఈస్ట్ బైపాస్‌తో బెజవాడ ట్రాఫిక్ కష్టాలకు చెక్ పడనుంది. విజయవాడ నుంచి నిడమానూరు వెళ్లే మార్గంలో ప్రభుత్వాసుపత్రి జంక్షన్, రామవరప్పాడు జంక్షన్, ఇన్నర్‌రింగ్ జంక్షన్, ప్రసాదంపాడు, ఎనికేపాడు వరకు మొత్తం కలిపి 27 ట్రాఫిక్ జంక్షన్ పాయింట్లు ఉన్నాయి. అలాగే, ప్రస్తుతం ఎన్‌హెచ్-16 నాలుగు వరసలతో ఉంది. హైవేను ఆనుకుని నగర శివారు విస్తరించి ఉంది. అడుగడుగునా హైవేకు అనుసంధానంగా లోపలికి రోడ్లు ఉంటాయి. వాహనాల రాకపోకలతో మాటిమాటికీ ట్రాఫిక్ ఆగిపోతోంది. ఈ ప్రాంతాలను ఆనుకుని సమీపంలో ఆటోనగర్‌కు వెళ్లే ప్రధాన మార్గాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ కష్టాలు చెప్పనలవి కావు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే ప్రధానమార్గం కావటం వల్ల ఇక్కడ ట్రాఫిక్‌ను తగ్గించాల్సిన అవసరం ఉంది. నిడమానూరు ఫ్లై ఓవర్ దీనికి చక్కటి పరిష్కారం.



మహానాడు నుంచి నిడమానూరు జాతీయ రహదారి

నాటి అలైన్‌మెంట్ మేరకే తూర్పు బైపాస్

విజయవాడ తూర్పు బైపాస్ నిర్మాణ ప్రతిపాదన 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఊపిరిపోసుకుంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు కూడా రూపుదిద్దుకున్నాయి. నాలుగు వరసల్లో రూపుదిద్దుకోనున్న ఈ బైపాస్ సుమారు 50 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. కృష్ణాజిల్లా చినఅవుటపల్లి నుంచి గుంటూరు జిల్లా కాజా వరకు ఈ బైపాస్‌ను నిర్మించనున్నారు. నిర్మాణ వ్యయం రూ.2,716 కోట్లుగా అంచనా వేశారు. ఈ రోడ్డు నిర్మాణం జరిగితే భారీ వాహనాలు నగరంలో ప్రవేశించే అవకాశం లేకుండా ఉంటుంది. దీంతో నగరంలో చాలావరకు ట్రాఫిక్ రద్దీ తగ్గిపోతుంది.

సివిల్ సప్లయిస్‌లో ఇంటి దొంగలు


కొండపల్లిలో అక్రమ రేషన్ డంప్ స్వాధీనం

- ఎండీయూ ఆపరేటర్లే రేషన్ మాఫియా
- భారీగా బియ్యం బస్తాల పట్టివేత

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సివిల్ సప్లయిస్‌లో ఇంటి దొంగల బాగోతాలు బయటపడుతున్నాయి. పేదల బియ్యాన్ని నిల్వచేసి, భారీగా డంప్‌చేసి, వ్యాపారులకు అక్రమంగా అమ్మేస్తున్నవారు ఒక్కొక్కరుగా బయటకొస్తున్నారు. ఎండీయూ వాహనాల్లో బియ్యం తరలిస్తున్న కొండపల్లి ముఠా శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులకు చిక్కింది. కొండపల్లి షాదీఖానాలో అక్రమంగా నిల్వ చేసిన రేషన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాహనం సహా 46 బియ్యం బస్తాలు చిక్కాయి. కొండపల్లికి చెందిన ఖాజా అనే వ్యక్తి ఈ రేషన్‌ను తరలిస్తున్నాడన్న పక్కా సమాచారంతో వలపన్ని పట్టుకున్నారు. ఎండీయూ వాహనం కూడా ఖాజా పేరుతోనే ఉండటంతో అతనే ఎండీయూ ఆపరేటర్ అని తెలుస్తోంది. ఖాజా అనే వ్యక్తి గతంలో కూడా పలుమార్లు పట్టుబడ్డాడు. అయినా అతని తీరులో మార్పు లేదు. అయితే, ఇటీవల కొండపల్లిలో బొమ్మల తయారీ కోసమని ఖాజా ఒక స్థలాన్ని బాగు చేయించినట్టు తెలిసింది. ఇబ్రహీంపట్నం పోలీసులు అక్కడి వెళ్లి చూడగా, 105 పీడీఎస్ బియ్యం బస్తాలు లభించాయి.

పోలీసు కమిషనరేట్‌లో జరిగిన 53 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో చిత్రవిచిత్రాలు కనిపిస్తున్నాయి. వైసీపీ పాలనలో ముఖ్య అధికారుల మనుషులుగా ముద్రపడిన ఇన్‌స్పెక్టర్లు కమిషనరేట్‌కు దూరం చేశారు సరే.. ఆరోపణలు ఉన్న కొందరికి మాత్రం ఎస్‌హెచ్‌వోలుగా స్థానాలిచ్చారు. ఇక ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి వచ్చినప్పటి నుంచి శాంతిభద్రతల స్టేషన్లలోనే పాతుకుపోయిన వారికి తిరిగి ఎస్‌హెచ్‌వోలుగా అవకాశమిస్తే, వైసీపీ ప్రభుత్వంలోని అధికారుల పనులతో ఇబ్బందిపడిన వారికి ఇప్పుడూ మొండిచేయే చూపించారు.

బదిలీ సంకెళ్లు



కమిషనరేట్‌లోని ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో చిత్ర విచిత్రాలు

- నాటి వైసీపీ ప్రభుత్వంతో అంటకాగిన వారు రేంజ్‌కే..
- అప్పటి డీజీపీ అనుచరులంతా ఏలూరు రేంజ్‌కు బదిలీ
- నాడు ఇబ్బంది పడిన ఇన్‌స్పెక్టర్లకు దక్కని న్యాయం
- ఆరోపణలున్న వారిలో కొందరికి ప్రాధాన్యం

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : వైసీపీ హయాంలో డీజీపీగా పనిచేసిన రాజేంద్రనాథ్‌రెడ్డికి ముఖ్య అనుచరులుగా ముద్రపడిన డి.కాశీవిశ్వనాథ్, ఆయన సతీమణి సహేరున్నీసా బేగం, డీకేఎస్ మోహన్‌రెడ్డి, డి.దుర్గాశేఖర్‌రెడ్డి, రావి సురేష్‌రెడ్డిని పోలీసు కమిషనరేట్ నుంచి ఏలూరు రేంజ్‌కు సరెండర్ చేశారు. మోహన్‌రెడ్డి కొన్నిరోజుల పాటు రాజేంద్రనాథ్‌రెడ్డి వద్ద పనిచేశారు. తర్వాత ఎన్నికల బదిలీల్లో భాగంగా పటమటకు వచ్చారు. అదే సమయంలో ఆయన సోదరుడు దుర్గాశేఖర్‌రెడ్డి.. ఏలూరు రేంజ్ నుంచి విజయవాడ కమిషనరేట్‌కు వచ్చారు. ఆయనకు అప్పటి అధికారులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పోస్టింగ్ ఇచ్చారు. అన్నదమ్ములకు ప్రాధాన్యం ఉన్న స్టేషన్లు కేటాయించడంపై కమిషనరేట్‌లో పెద్ద దుమారమే రేగింది. రాజేంద్రనాథ్‌రెడ్డి విజిలెన్స్ డీజీగా ఉన్నప్పటి నుంచి సహేరున్నీసా బేగం ఆ విభాగంలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. రఘురామిరెడ్డి విజిలెన్స్‌కు వచ్చాక ఆమెను రేంజ్‌కు పంపారు. అక్కడి నుంచి ఎన్నికల సమయంలో కమిషరేట్‌కు అటాచ్‌మెంట్‌పై వచ్చారు. ఇప్పుడు ఈ భార్యాభర్తలను రేంజ్‌కు బదిలీ చేశారు.

ఆయనకు అన్నీ ఎల్అండ్‌వోలే..

ఇబ్రహీంపట్నంలో పనిచేస్తూ గవర్నరుపేటకు బదిలీ అయిన ఎం.సత్యనారాయణ సర్వీసు మొత్తం లా అండ్ ఆర్డర్ల పోలీస్‌స్టేషన్లలోనే సాగింది. సెంట్రల్ నియోజకవర్గంలో కొత్తగా ఏర్పడిన గుణదల మినహా అన్ని పోలీస్ స్టేషన్లలోనూ ఆయన ఎస్‌హెచ్‌వోగా పనిచేశారు. విజయవాడలో ఉన్నప్పుడు లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్లలో పనిచేశారు. ఇక్కడి నుంచి పొరుగు జిల్లాలకు వెళ్లినప్పుడూ ఎల్అండ్‌వో స్టేషన్లలో పనిచేయడం గమనార్హం. ఆయన ఇంతకు ముందు అజిత్‌సింగ్‌నగర్, నున్న, సత్యనారాయణపురం, సూర్యారావుపేట, పెనమలూరు, గవర్నరుపేట పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు. వైసీపీ ప్రభుత్వంలో కమిషనరేట్ నుంచి పశ్చిమగోదావరి జిల్లా తణుకు ఎస్‌హెచ్‌వోగా వెళ్లారు. ఎన్నికల సమయంలో రేంజ్‌కు వెళ్లి అక్కడి నుంచి పోలీసు కమిషనరేట్‌కు వచ్చారు. ఎన్నికల పోస్టింగ్‌లో ఇబ్రహీంపట్నంలో ఆయనకు చోటు కల్పించారు. తాజాగా జరిగిన బదిలీల్లో ఆయన అక్కడి నుంచి గవర్నరుపేటకు బదిలీ అయ్యారు. సత్యనారాయణ గవర్నరుపేటలో పనిచేయడం ఇది రెండోసారి.

ఆరోపణలు ఉన్నా అందలం

చలుమూరి ప్రకాశ్ మాచవరం పీఎస్‌లో ఎస్‌ఐగా పనిచేశారు. ఈయనపై ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఉన్నతాధికారులు చార్జి మోమోలు కూడా జారీ చేశారు. ఏడాదిగా స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్నారు. అక్కడే ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి వచ్చింది. మాచవరంలో పనిచేసినప్పుడు స్పా సెంటర్ల వ్యవహారంలో ఆయన పాత్ర ఉన్నట్టు టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ అధికారులు నిర్ధారించారు. ఈ నివేదికతో ఆయనను మాచవరం నుంచి వీఆర్ పంపారు. మాచవరంలో ఉండగా, పీవీపీ మాల్ పక్క వీధిలో ఉన్న చిరువ్యాపారులను ప్రకాశ్ టార్గెట్ చేసుకుని వేధించారు.

వారికి న్యాయం జరగలేదు..

అధికారులు చేసిన తప్పిదాలతో ఇబ్బందులు పడ్డారు కొందరు. 'పై' పలుకుబడితో లూప్‌లైన్లకు పరిమితమయ్యారు ఇంకొందరు. ఈ కేటగిరీకి చెందిన ఇన్‌స్పెక్టర్లకు పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదన్న వాదనలు కమిషనరేట్‌లో వినిపిస్తున్నాయి. అప్పటి డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి కాన్వాయ్ ఒక రోడ్డులో వెళ్లాల్సింది మరో రోడ్డులోకి వచ్చింది. ఆ సమయానికి ఈ మార్గంలో ట్రాఫిక్ ఉండటంతో అక్కడున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేశారు. నాడు కమిషనరేట్‌లో జరిగిన బదిలీల్లో అధికారులు కొంతమందికి స్టేషన్లు కేటాయించారు. నాటి కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులు మర్నాడు ఉదయానికి రద్దయ్యాయి. అప్పటి డీజీపీ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాలతోనే ఈ ఉత్తర్వులు రద్దయ్యాయన్నది బహిరంగ రహస్యం. దీనివల్ల అప్పటి వరకు పనిచేస్తున్న పోస్టు పోయి, కొత్తగా రావాల్సిన పోస్టు కూడా పోవడంతో పలువురు ఇన్‌స్పెక్టర్లు కమిషనరేట్‌కే పరిమితమయ్యారు. అటువంటి వారిలో ఒకరిద్దరికే ఈ బదిలీల్లో స్థానాలు దక్కాయి. ప్రస్తుతం మొదటి విడత బదిలీ జాబితా పూర్తయింది. రెండో విడతలో జరిగే బదిలీల్లో అయినా న్యాయం జరుగుతుందా అన్న సందేహంలో బాధిత ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

క్రిప్టో పేరిట రూ.కోట్లు కొట్టేశారు

నిందితులు మేయర్ భాగ్యలక్ష్మి బంధువులే..

- టెలిగ్రామ్‌లో గ్రూపు సృష్టించిన కుటుంబం
- రాష్ట్రవ్యాప్తంగా 650 మంది బాధితులు
- సైబర్ పోలీసులకు ఫిర్యాదు

(ఆంధ్రజ్యోతి- విజయవాడ) : 'క్రిప్టో కరెన్సీలో మంచి లాభాలు వస్తున్నాయి. పెట్టుబడులు పెట్టండి. ఎంత ఎక్కువ పెట్టుబడి పెడితే అంత ఎక్కువ లాభాలు వస్తాయి.' అంటూ టెలిగ్రామ్‌లో గ్రూపును సృష్టించి వందల్లో యువతను ముగ్గులోకి దింపారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి సమీప బంధువులు క్రిప్టో కరెన్సీలో లక్షలాది రూపాయలను దోచేశారు. ఈ వ్యవహారంలో నిలువునా మునిగిపోయిన బాధితులు సైబర్ పోలీసులను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళితే.. కొత్తపేటలోని సాయిరాం థియేటర్ ప్రాంతానికి చెందిన కొరగాని కార్తీక్ ఇంజనీరింగ్ చేశాడు. మేయర్ రాయన భాగ్యలక్ష్మికి సమీప బంధువు. అన్నయ్య రూపేష్, మరికొంతమంది స్నేహితులతో కలిసి టెలిగ్రామ్ యాప్‌లో క్రిప్టో పల్స్ పేరుతో గ్రూపును ఏర్పాటు చేశాడు. ఇందులో తనకు పరిచయం

- మిగతా 6లో

నెరవేరిన సొంతింటి కల

- ఇద్దరు గిరిజన లబ్ధిదారుల వాటా చెల్లించిన కేంద్రం
- చెక్కులు అందజేసిన కలెక్టర్ సృజన

6లో..

భూ సేకరణ లేకుండా ఈ11, ఈ13 రోడ్ల పొడిగింపు

- సీడ్ యాక్సిస్ రోడ్డుకు సమాంతరంగా..
- సీఆర్డీయే కీలక ప్రకటన

దుర్గమ్మ సేవలో కేశినేని చిన్ని దంపతులు



కేశినేని చిన్ని దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

వన్‌టౌన్, ఆగస్టు 3: విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) తన పుట్టినరోజు సందర్భంగా శనివారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను తన సతీమణి జానకీలక్ష్మి, తల్లి ప్రసూనాంబతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మ వారిని దర్శించుకుని చిన్ని దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటాలను వారికి ఆలయ ఈవో రామారావు అందజేశారు. వేదపండితులు ఆశీస్సులు అందజేశారు. అంతకు ముందు చిన్ని దంపతులు కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడిలో ప్రత్యేక పూజలు చేశారు.

సుబ్బారాయుడికి జస్టిస్ బి.శ్రీనివాస్ పూజలు



స్వామి చిత్రపటాన్ని హైకోర్టు న్యాయమూర్తి బి.శ్రీనివాస్‌కు అందిస్తున్న ఈవో చక్రధరరావు

మోపిదేవి, ఆగస్టు 3: సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్రీనివాస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేద మంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో సత్కరించారు. స్వామి చిత్రపటం, ప్రసాదాలను న్యాయమూర్తి కుటుంబ సభ్యులకు ఆలయ ఈవో ఎస్.ఎస్. చక్రధర్ అందజేశారు.

రైతు బాంధవుడు కాకాని వెంకటరత్నం



పాల ఫ్యాక్టరీలో కాకాని వెంకటరత్నం విగ్రహానికి నివాళులర్పిస్తున్న చలసాని ఆంజనేయులు

చిట్టినగర్, ఆగస్టు 3: "సామాన్య రైతుబిడ్డగా జీవితం ప్రారంభించి ఉన్నతస్థాయి పదవులు చేసి తుదిశ్వాస వరకు రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేసిన రైతు బాంధవుడు కాకాని వెంకటరత్నం. పాడి పరిశ్రమ అభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారు. కృష్ణా మిల్క్ యూనియన్ స్థాపనలో ఆయన చూపిన చొరవను మరువలేం." అని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. కాకాని వెంకటరత్నం 124వ జయంతి కార్యక్రమాన్ని శనివారం పాల ఫ్యాక్టరీ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కాకాని విగ్రహానికి చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాలకవర్గ సభ్యులు, అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉద్యానపంటల రాయితీలు విడుదల

మచిలీపట్నం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లాలో ఉద్యాన పంటలు సాగుచేసే రైతులకు రాయితీలను ప్రభుత్వం విడుదల చేసిందని కలెక్టర్ డీకే బాలాజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆయిల్‌పామ్ తోటలు సాగుచేసిన రైతులకు రాయితీగా రూ.1.13 కోట్లను విడుదల చేశామన్నారు. ఈ నగదును రైతుల ఖాతాల్లో త్వరలో జమచేస్తామని తెలిపారు. 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరా లకు ఉద్యాన పంటలకు రాష్ట్రీయకృషి వికాసయోజన పథకం ద్వారా రూ.20 లక్షల రాయితీని ఇప్పటికే విడుదల చేశామని తెలిపారు. 2024-25లో ఉద్యాన పంటలు సాగుచేసిన రైతులకు రాయితీలను ప్రకటిస్తూ విధివిధా నాలను ప్రభుత్వం విడుదల చేసిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 1800 హెక్టార్లలో డ్రిప్, స్ప్రింకర్లు, మైక్రోఇరిగేషన్ కోసం రూ.12.96కోట్లను జిల్లాకు కేటాయిస్తూ ప్రభుత్వం అనుమతులిచ్చిందని తెలిపారు. ఉద్యానపంటలు సాగుచేసే రైతులు రాయితీలకోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎన్టీఆర్ జిల్లాలో రూ.3.23 కోట్లు జమ

కృష్ణలంక: ఎన్టీఆర్ జిల్లాలో 2,387 మంది రైతులకు వివిధ ఉద్యాన పథకాల(2023-24) కింద మొదటి విడతగా రూ.3.23 కోట్ల ప్రభుత్వ రాయితీ విడుదలైందని, కలెక్టర్ ఆమోదంతో రైతుల ఖాతాల్లో ఈ రాయితీ మొత్తాన్ని నేరుగా జమ చేస్తామని జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీకుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రీయ కృషి వికాస యోజన కింద 267 మంది రైతులకు రూ.0.965కోట్లు, జాతీయ వంట నూనెల విషన్-ఆయిల్‌పాం కింద 661 మంది రైతులకు రూ.1.614 కోట్లు, ఉద్యాన పంటల సమగ్రాభివృద్ధి పథకం కింద 1,459 మంది రైతులకు 0.649 కోట్లు రాయితీ విడుదలైనట్లు తెలిపారు. 2023-24కు సంబంధించి రెండో విడత నిధులు, 2022-23, 2021-22, 2020-21 సంవత్సరాలకు రాయితీ నిధులు కూడా త్వరలో విడుదలవుతాయని రాష్ట్ర ఉద్యాన సంచాల కులు తెలియజేశారని ఆయన వెల్లడించారు. 2024-25కు ఉద్యాన పథకాల్లో రాయితీ పొందేందుకు రైతులు తమ గ్రామంలోని రైతుసేవా కేంద్రాల్లోని గ్రామవ్యవసాయ/ఉద్యాన సహాయకులను సంప్రదించాలని సూచించారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

వన్‌టౌన్ ఆగస్టు 3: ఆటోలో ప్రయాణించిన మహిళ తన వల్లే చనిపోయిందని మనస్తాపం చెంది దోబీఖానా ప్రాంతంలో ఉంటున్న ఆటో డ్రైవర్ ఎన్.రమేష్ (42) తాను నివాసముంటున్న రూమ్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. స్నేహితుడు జ్యోతి రమేష్ ఫిర్యాదు మేరకు శనివారం కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేశారు. దోబిఖానా ప్రాంతంలోని ఓ రూమ్ లో ఎన్.రమేష్‌తో పాటు అతడి స్నేహితుడు జ్యోతి ర మేష్ ఉంటున్నాడు. ఇద్దరూ ఆటోలు తోలుకుంటూ జీ విస్తున్నారు. గతనెల 27న రమేష్ తన ఆటోలో మహి ళా ప్రయాణికురాలిని కిరాయికి తీసుకు వెళుతూ ప్ర మాదవశాత్తు ఆటో యాక్సిడెంట్ అయ్యి చనిపో యిం ది. భవానీపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి నుంచి రమేష్ మనస్తాపం చెంది బాధపడుతున్నాడు. శుక్రవారం రాత్రి స్నేహితుడు జ్యోతి రమేష్ కిరాయికి వెళ్లాడు. రూమ్‌లో ఒంటరిగా ఉన్న ఎన్.రమేష్ రేకులషెడ్ రూమ్‌లో రాడ్‌కు ఉరేసుకుని చనిపోయాడు. ఎస్.ఐ వై.దుర్గారావు సిబ్బందితో వెళ్లి స్థానికులను వివరాలడిగి తెలుసుకుని వేలాడుతున్న రమేష్ మృతదేహాన్ని కిందకు దించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కృష్ణానదిలో ఒకరి మృతదేహం

ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానదిలో ఓ వ్యక్తి మృతదేహం లభించినట్టు శనివారం కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. కృష్ణానదిలో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్టు అందిన సమాచారం మేరకు ఎస్.ఐ వై.దుర్గారావు సిబ్బందితో ఘటనా ప్రాంతానికి వెళ్లి నదిలో ఉన్న మృతదేహాన్ని ఒడ్డుకు తెచ్చి పరిశీలించారు. మృతదేహం వద్ద గుర్తింపు ఆధారాలు లేనందున పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపాల్ అరెస్టు

భవానీపురం శివాలయం సెంటర్ వద్ద ఉన్న ఓ ప్రైవేట్ స్కూల్‌లో బాలిక పట్ల లైంగిక వేధింపులకు పాల్పడిన ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసరావును శనివారం భవానీపురం పోలీసులు అరెస్టు చేశారు. 10వ తరగతి చదువుతున్న బాలికపట్ల లైంగిక వేధింపులకు పాల్పడటంతో బాలిక త ల్లిదండ్రులు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఉమామహేశ్వర రావు అతడిపై పోక్సో కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి కోర్టు లో హాజరుపరిచారు. కోర్టు నిందితుడికి రిమాండ్ విధించింది. స్పందించిన జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్బారావు ఆదేశాలతో అధికారులతో కలిసి ఆ స్కూల్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించి స్కూల్ యాజమాన్యానికి నోటీసులిచ్చారు.

వైసీపీ పాలనలో కుదేలైన రాష్ట్రం

▸ ఆర్థిక వ్యవస్థ మెరుగుకు, రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి: మంత్రి సత్యకుమార్



కూచిపూడి సిలికానాంధ్ర సంజీవని వైద్యశాలలో ధన్వంతరి వార్డును ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యేలు వర్ల కుమార్ రాజా, మండలి బుద్ధప్రసాద్

కూచిపూడి, ఆగస్టు 3: "గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని రంగాలు ఆర్థికంగా కుదేలయ్యాయి. వాటిని సరిచేసి ఆర్థిక వ్యవస్థను మెరుగుపర్చి రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేసేందుకు చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది." అని వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర మంత్రి సత్యకుమార్ అన్నారు. కూచిపూడి సిలికానాంధ్ర సంజీవని వైద్యశాలలో ధన్వంతరి వార్డును శనివారం ఆయన ప్రారంభించారు. వైసీపీ హయాంలో జరిగిన అవినీతి, విధ్వంస కాండలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్వేతపత్రాలపై వివరిస్తున్నారన్నారు. తలసరి ఆదాయం పెరగాల్సింది పోయి తలసరి అప్పులు పెరిగాయన్నారు. కూటమి ప్రభుత్వానికి అద్భుత విజయాన్ని అందించి ప్రజలు రాష్ట్రాన్ని కాపాడుకున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సిలికానాంధ్ర వైద్యశాల అభివృద్ధికి చంద్రబాబు రూ.10 కోట్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని, ఆ నిధులు విడుదలకు కృషి చేయాలని నిర్వాహకులతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు సత్యకుమార్‌ను కోరారు. సీఎంతో మాట్లాడి నిధుల మంజూరుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అంతకు ముందు బీజేపీ నాయకుడు పోలన అశోక్‌కుమార్ నాయకత్వంలో మంత్రిని కూచిపూడి సెంటర్‌లో భారీ గజమాలతో సత్కరించారు. వైద్యశాల అభివృద్ధికి ప్రభుత్వం తరఫున పూర్తిస్థాయిలో సహకరిస్తామని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా హామీ ఇచ్చారు. వైద్యశాల అభివృద్ధిపై మంత్రికి కొన్ని విజ్ఞాపనలు అందజేశారు. సంజీవని వైద్యశాలలో అందిస్తున్న ఉచిత వైద్య సేవలు అభినందనీయ మని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. లాభాపేక్ష లేకుండా తమ వైద్యశాలలో వైద్య సేవలు అందిస్తున్నామని సిలికానాంధ్ర వ్యవస్థాపక అధ్యక్షులు కూచిభొట్ల ఆనంద్ తెలిపారు. ఆర్ టీవీ అధినేత రవిప్రకాష్, సర్పంచ్ కొండవీటి విజ యలక్ష్మి, వైద్యశాల ఏవో జొన్నలగడ్డ హనుమకుమార్, డీఎంహెచ్‌వో జె.గీతాభాయి పాల్గొన్నారు. సత్యకుమార్, బుద్ధప్రసాద్, కుమార్‌రాజాను నిర్వాహకులు సత్కరించారు.

నెరవేరిన సొంతింటి కల

▸ ఇద్దరు గిరిజన లబ్ధిదారుల వాటా చెల్లించిన ప్రభుత్వం



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న కలెక్టర్ జి.సృజన

కృష్ణలంక, ఆగస్టు 3: ఇళ్ల కేటాయింపులో చెల్లించాల్సిన గిరిజనుల వాటాను ప్రభుత్వమే చెల్లించి వారి సొంతింటి కలను నెరవేర్చిందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన తెలిపారు. జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం కింద ఇంటిని కేటాయించేందుకు గిరిజన సంక్షేమ శాఖ ద్వారా లబ్ధిదారుల వాటాగా ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సహాయ చెక్కులను శనివారం గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి జె.సునీతతో కలిసి కలెక్టరేట్‌లోని చాంబర్‌లో అందించారు. అజిత్‌సింగ్‌నగర్ సమీపంలో ఉంటున్న ఎస్టీలు ట్రాన్స్‌జెండర్ పాలపర్తి గౌరి, విభిన్నప్రతిభావంతురాలు మిండ్యాల మరియమ్మకు ప్రభుత్వం జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం కింద రాజరాజేశ్వరీపేటలో ఇళ్లు మంజూరు చేసిందన్నారు. గృహాలను పొందేందుకు లబ్ధిదారుల వాటా కింద చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించలేమని, ప్రభుత్వపరంగా ఆర్థిక సహాయం చేయాలని వారు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దీంతో గిరిజన సంక్షేమ శాఖ నుంచి ఒక్కొక్కరికి రూ.66 వేలను మంజూరు చేసి ఆర్థిక సహాయాన్ని నేరుగా నగర పాలక సంస్థకు చెల్లించి సొంత ఇంటి కలను నెరవేర్చినట్లు కలెక్టర్ తెలిపారు.

కాంట్రాక్టు ఉపాధ్యాయులకు నియామకపత్రాలు

ఎ.కొండూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న ప్రతిభావంతులైన ఉపాధ్యాయుల సర్వీసును ఏడాది పాటు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని కలెక్టర్ జి.సృజన తెలిపారు. హిందీ స్కూల్ అసిస్టెంట్ ఎం.శరత్ బాబు, ఫిజికల్ డైరెక్టర్ జి.బాబూరావు, తెలుగు ఎస్‌ఏ జి.అమలమ్మ, ఇంగ్లీష్ ఎస్‌ఏ ఎం.శిరీష, బయోలాజికల్ సైన్స్ ఎస్‌ఏ ఎం.చంద్రబాబు, ఫిజికల్ సైన్స్ ఎస్‌ఏ ఎస్‌కే సైదా, సోషల్ స్టడీస్ అసిస్టెంట్ పి.పద్మజ, ఎస్జీటీ కె.రాజబాబుకు సర్వీసు పొడిగిస్తూ నియామకపత్రాలను కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో అందించారు.



యువ బ్యాటర్ సందీప్, అతని తండ్రి సురేంద్రను అభినందిస్తూ రూ.లక్ష చెక్కును ఇస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, గోకరాజు గంగరాజు

405 పరుగులు చేసిన సందీప్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

● ఎంపీ కేశినేని శివనాథ్

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 3: యువ క్రికెటర్ వై.సందీప్ చేసిన 405 పరుగుల ఇన్నింగ్స్ యువ క్రికెటర్లకు స్ఫూర్తిదాయకమని, అతడు భవిష్యత్‌లో భారత్ క్రికెటర్‌గా ఎదగాలని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆకాంక్షించారు. కేడీసీఏ జిల్లా సెక్రటరీ ఎం రవీంద్ర చౌదరి ఆధ్వర్యంలో మల్టీడేస్ మ్యాచ్‌లో ప్రకాశంపై 405 పరుగులతో అజేయంగా నిలిచిన కృష్ణా యువ బ్యాటర్ సందీప్‌కు అభినందన సభ ఐజీఎంసీలోని క్రికెట్ నెట్స్ వద్ద శనివారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీ మాట్లాడారు. అనంతరం ఎంపీ తన జన్మదినం సందర్భంగా కేక్‌కట్ చేసి క్రికెటర్‌కు స్వయంగా తినిపించి అభినందిస్తూ ట్రోఫీతో సత్కరించారు. గోకరాజు గంగరాజు అందించిన రూ.లక్ష చెక్కును సందీప్, అతడి తండ్రికి బహూకరించి అభినందించారు. బీసీసీఐ మాజీ ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజు, ఏసీఏ జాయింట్ సెక్రటరీ రాకేష్, ఏసీఏ మాజీ సెక్రటరీలు చుక్కపల్లి అరుణ్‌కుమార్, వీ దుర్గాప్రసాద్, కేడీసీఏ జాయింట్ సెక్రటరీ శ్రీధర్, కేడీసీఏ అడహక్ కమిటీ మాజీ చైర్మన్ టి.త్రినాథ్‌రాజు, కబడ్డీ జాతీయ జట్టు మాజీ కోచ్ పద్మజా బాల, ఏసీఏ కోచ్‌లు శ్రీనివాస్, గాంధీ పాల్గొన్నారు.

పేదల పక్కా ఇంటి కల నెరవేరుస్తాం

▸ గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇస్తాం: మంత్రి కొల్లు రవీంద్ర



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 3: పేదల పక్కా ఇంటి కల సాకారం చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టంచేశారు. తన కార్యాలయంలో శనివారం మునిసిపల్ కమిషనర్, వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలు అంతా డ్రామా అని పేదలకు న్యాయం జరగలేదని అన్నారు. సెంటు పట్టాల పేరుతో భారీ స్కామ్‌లకు వైసీపీ నాయకులు తెరలేపారని ఆరోపించారు. అగ్గిపెట్టెల్లాంటి ఇళ్లు ఇచ్చి అవే గొప్ప అన్నట్టుగా వ్యవహరించారన్నారు. గ్రామాల్లో ఎంపిక చేసిన లబ్ధిదారు లకు 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇస్తామని, త్వరలోనేమార్గదర్శకాలు విడుదల చేస్తామని తెలిపారు. స్థలం ఎక్కడ అందుబాటులో ఉందో చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఇళ్ల పట్టాల కేటాయింపులో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కొల్లు రవీంద్ర సూచించారు.

డాక్టర్ సతీష్‌రెడ్డికి మండలి కృష్ణారావు పురస్కారం

అవనిగడ్డ, ఆగస్టు 3: తెలుగు తేజం, దివిసీమ గాంధీ మండలి వెంకట కృష్ణారావు 99వ జయంతి వేడుకలను గాంధీక్షేత్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో భారత రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ జి.సతీష్ రెడ్డికి స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవ పురస్కారాన్ని ప్రదానం చేస్తామని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షుడిగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గ్రంధి భవానీప్రసాద్ వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. ముఖ్యఅతిథులుగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, సిలికానాంధ్ర వ్యవస్థాపకుడు కూచిభొట్ల ఆనంద్, జమిన్ రైతు సంపాదకుడు డోలేంద్ర ప్రసాద్ విచ్చేస్తారని పేర్కొన్నారు.

గంజాయి విక్రేతకు మూడేళ్ల జైలు

మచిలీపట్నం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడిన వ్యక్తిపై నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి చిన్నంశెట్టి రాజు శనివారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం బొంగారపుపేటకు చెందిన మీసాల శ్రీనివాసరావు గుడివాడ మండలం రామనపూడివద్ద గంజాయి విక్రయిస్తుండగా 2020 ఆగస్టు 1వ తేదీన గుడివాడ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. అతనిపై నేరం రుజువు కావడంతో కోర్టు శిక్ష విధించింది.

గుడివాడ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

▸ నిధుల మంజూరుకు కృషి: ఎంపీ బాలశౌరి



ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ: గుడివాడ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని, అత్యధిక నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఎంపీ వల్లభనేని బాలశౌరి హామీ ఇచ్చారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలిసి ఆయన మాట్లాడారు. టిడ్కో కాలనీలో తాగునీటి సమస్యపై టిడ్కో, మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. టిడ్కో కాలనీలో రూ.కోటి కేంద్ర నిధులతో కమ్యూనిటీ హాల్‌ను నిర్మిస్తానన్నారు. పట్టణంలో బైపాస్ రోడ్డుకు కూడా నిధులు విడుదలయ్యేలా కృషి చేస్తానన్నారు. టిడ్కో కాలనీలో రెండో వాటర్ ట్యాంకును నిర్మించేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. పట్టణంలోని రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి పూర్తిస్థాయిలో అంచనాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలని, కొన్ని ప్రాంతాల్లో అండర్‌పాస్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రిలో రూ.2కోట్లతో సోలార్ ప్లాంట్, సిటి స్కాన్‌ల ఏర్పాటుకు నిధులు విడుదల చేశామన్నారు. గంజాయిని అరికట్టాలని పోలీసులను ఆదేశించారు. ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలన్నీ కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు.

రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన

పామర్రురోడ్డులో నిర్మాణంలో ఉన్న రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలిసి ఎంపీ బాలశౌరి పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని నేషనల్ హైవే అథారిటీ డీఈ సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. మార్చి నెలాఖరుకు పనులు పూర్తి చేయాలన్నారు.

ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే వెనిగండ్లకు సత్కారం

ప్రజావేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ బాలశౌరి పాల్గొన్నారు. ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే వెనిగండ్ల రామును సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో బాబూరాజేంద్రప్రసాద్, నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు కాకరాల సురేష్, ఇతర సర్పంచ్‌లు సత్కరించి నోటు పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం, యలవర్తి శ్రీనివాసరావు, పిన్నమనేని బాబ్జీ, బూరగడ్డ శ్రీకాంత్, గుత్తికొండ శ్రీరాజబాబు, అసిస్టెంట్ కమిషనర్ కృష్ణారావు, మున్సిపల్, రెవెన్యూ, నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామి ఆలయంలో తనిఖీలు



రికార్డులు తనిఖీ చేస్తున్న దేవదాయశాఖ రాజమహేంద్రవరం ఆర్‌జేడీ కె.సుబ్బారావు, డిప్యూటీ కమిషనర్ శోభారాణి

ఉయ్యూరు, ఆగస్టు 3: సోమేశ్వర స్వామి ఆలయంలో శనివారం దేవదాయశాఖ రాజమహేంద్రవరం ఆర్‌జేసీ కె.సుబ్బారావు, డిప్యూటీ కమిషనర్ శోభారాణి ఆధ్వర్యంలో రికార్డులు తనిఖీ చేశారు. సోమేశ్వరుడి సొమ్ము స్వాహా, ఆలయంలో రూ.4 కోట్లు హాంఫట్ శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి విచారణ చేపట్టారు. దేవస్థానానికి చెందిన 26 ఎకరాల పొలంలో ఆరు ఎకరాలు విజయవాడ- మచిలీపట్నం హైవే నిర్మాణంలో పోగా దేవస్థానానికి రూ.8.36 కోట్లు ఆదాయం వచ్చింది. ఆ మొత్తాన్ని బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. దానికి సంబంధించి ఐదేళ్లగా వడ్డీ రూపంలో వచ్చిన మొత్తం, ఆలయానికి వచ్చే ఆదాయం ఆలయ ఈవో పక్కదారి పట్టించినట్టు వచ్చిన కథనంపై అధికారులు విచారణ చేపట్టారు.

కమిషనర్‌కు నివేదిక సమర్పిస్తాం

బ్యాంకు నుంచి సొమ్ము డ్రాచేసి పక్కదారి పట్టించారని వచ్చిన కథనం మేరకు దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాలతో విచారణ చేపట్టామని, రికార్డులు తనిఖీ చేసి నివేదిక సమర్పిస్తామని ఆర్‌జేసీ కె.సుబ్బారావు తెలిపారు.

దేవదాయశాఖలో అవినీతిపై విచారణ జరిపిస్తాం

▸ భక్తులకు డిప్యూటీ కమిషనర్ విజయకుమార్ హామీ



అన్యాక్రాంతమవుతున్న ఆలయాల ఆస్తుల వివరాలను డీసీ విజయకుమార్‌కు వివరిస్తున్న భక్తుడు ఈపూరి సురేష్

నందిగామ, ఆగస్టు 3: దేవదాయశాఖలో అవినీతి జరుగుతోందని భక్తులు చేస్తున్న ఆరోపణలపై ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయకుమార్ స్పందించారు. ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపిస్తామని ఆయన హామీ ఇచ్చారు. స్థానిక సీతారామాంజనేస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం నందిగామ ప్రాంతంలోని 26 ఆలయాలకు చెందిన రికార్డులను డిప్యూటీ కమిషనర్ పరిశీలించారు. డిప్యూటీ కమిషనర్‌ను రామలింగేశ్వరస్వామి ఆలయ ఆస్తుల అన్యాక్రాంతంపై న్యాయపోరాటం చేస్తున్న ఈపూరి సురేష్ అనే భక్తుడు కలిశారు. పట్టణంలోని రామలింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన 821-1లో ఉన్న అత్యంత విలువైన 5.38 ఎకరాలను సర్వే చేయాలని తాను దరఖాస్తు చేశానని, దరఖాస్తుదారుడైన తనకు సమాచారం ఇవ్వకుండా అక్రమార్కులతో చేతులు కలిపి తప్పుడు సర్వే చేశారని, అక్రమార్కులకు లబ్ధి జరిగేలా ఆర్అండ్‌బీ రోడ్డుపైకి హద్దులు తేల్చారని డీసీకి వివరించారు. స్పందించిన డీసీ తక్షణమే మరోమారు ఫిర్యాదుదారుడితో పాటు పది మంది సమక్షంలో సర్వే చేయాలని ఈవోను ఆదేశించారు. 1996లో రామలింగేశ్వనగర్‌లోని 17 ఎకరాల భూమిని ప్లాట్లుగా విభజించి వేలం నిర్వహించారని అందులో 32 ప్లాట్లు అన్యాక్రాంతం అయినట్లు తాను పలుమార్లు ఫిర్యాదు చేశానని అయినా పట్టించుకోవడం లేదని సురేష్ ప్రశ్నించారు. దీనిపై సమగ్ర విచారణకు ఆదేశిస్తామని డీసీ ఆయనకు హామీ ఇచ్చారు. ఆలయ భూములను 11 సంవత్సరాల లీజుల పేరుతో అన్యాక్రాంతం చేయడం మానుకోవాలని డీసీని సురేష్ కోరారు. పట్టణంలోని సీతారామాంజనేయస్వామి ఆలయానికి చెందిన షాపుల అద్దెల విషయంలోనూ భారీ అవినీతి జరుగుతోందని పలువురు భక్తులు ఆరోపించారు. దీనిపై స్థానిక అధికారులను డీసీ వివరణ కోరగా, తాము స్థలానికి మాత్రమే అద్దె వసూలు చేస్తున్నామని, షాపులు వ్యాపారులే నిర్మించుకున్నారని చెప్పారు. దీంతో అధికారులపై డీసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ స్థలాల్లో శాశ్వత భవనాలను వారెలా నిర్మించుకుటారని ప్రశ్నించారు. తక్షణమే అద్దెలపై సమీక్ష జరిపి ఆలయానికి ఆదాయం పెరిగేలా చూడాలని ఆదేశించారు. ఖాళీ స్థలం అద్దెలు కాకుండా భవనాల లెక్కన అద్దెలు వసూలు చేయాలని ఆదేశించారు.

బిందు సేద్యానికి రాయితీలు

కృష్ణలంక, ఆగస్టు 3: 2024-25 సంవత్సరానికి ఉద్యాన శాఖ ద్వారా డ్రిప్, సింక్లర్లకు ఆరు వేల హెక్టార్లు లక్ష్యంగా నిర్దేశించారని, ఇందుకు రూ.19.82 కోట్ల రాయితీ కేటాయించామని ఏపీఎంఐపీ పథక సంచాలకుడు పీఎం సుభాని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెట్ట, మాగాణి ఏదైనా 5 ఎకరాల లోపు 90 శాతం రాయితీ(రూ.2.18 లక్షల వరకు), 5 నుంచి 12.50 ఎకరాలలోపు 50 శాతం రాయితీ(రూ.3.10 లక్షల వరకు) ఇస్తామని పేర్కొన్నారు. డ్రిప్, స్పింకర్ల పరిక రాలు పొందే రైతులు ఆధార్ కార్డ్, 1బీ పత్రం, ఎఫ్ఎంబీ, బ్యాంక్ పాస్‌బుక్ తీసుకుని సమీప రైతుసేవా కేంద్రం/ ఉద్యాన అధికారి/పథక సంచాలకుడు కార్యాలయంలో సంప్రదించి నచ్చిన కంపెనీని ఎన్నుకుని బయోమెట్రిక్ నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 0866-3500193, 79950 09910, 79950 09911 నెంబర్లకు ఫోన్‌చేసి సంప్రదించాలని ఆయన సూచించారు.

టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో మరొకరికి రిమాండ్

గన్నవరం, ఆగస్టు 3: గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో మరొకరిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఏ 23 అయిన రౌడీషీటర్ పఠాన్ యాసఫ్‌ఖాన్‌ను శనివారం గన్నవరం స్థానిక కోర్టులో హాజరు పరచారు. కోర్టు అతనికి 14రోజులు రిమాండ్ విధించింది. ఆయనను గన్నవరం సబ్ జైల్‌కు తరలించారు. అదే కేసులో ఉన్న మెండెం రాంబాబును, షేక్ ఇమ్రాన్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

భూ సేకరణ లేకుండా ఈ11, ఈ 13 రోడ్ల పొడిగింపు

విజయవాడ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని సీడ్ యాక్సెస్ రోడ్డుకు సమాంతరంగా నిర్మించే ఈ 11, ఈ 13 రోడ్లకు ఎలాంటి భూ సేకరణ లేకుండానే ఎన్‌హెచ్16కు అనుసంధానం చేయనున్నారు. ఈ11 రోడ్డు నీరుకొండ నుంచి కురగల్లు వరకు 7.5 కిలోమీటర్లు నిర్మిస్తారు. కురగల్లు, నవులూరు, మంగళగిరి మీదుగా ఎయిమ్స్ ముందు నుంచి మంగళగిరిలోని 16వ నెంబరు జాతీయ రహదారి వరకు మరో 4 కిలోమీటర్లు పొడిగిస్తారు. ఈ13 రోడ్డు నీరుకొండ నుంచి నవులూరు వరకు 7.5 కిలోమీటర్లు నిర్మి స్తారు. ఎయిమ్స్ వెనుక వైపు నుంచి మంగళగిరిలోని 16వ నెంబరు జాతీయ రహదారి వరకు మరో 2.5 కిలోమీటర్లు దీనిని పొడిగిస్తారు. నీరుకొండ డౌన్ నుంచి నిడమర్రు, ఎర్రబాలెం, మంగళగిరి మీదుగా వెళుతుంది. ఈ రెండు రహదార్లకు సీఆర్డీయే సమావేశంలో సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే.

క్రిప్టో పేరిట రూ.కోట్లు కొట్టేశారు

(ఐదో పేజీ తరువాయి)

ఉన్న స్నేహితులను సభ్యులుగా చేర్పించాడు. ఒక్కొక్కరి నుంచి రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు వసూలు చేశాడు. గ్రూపులో సభ్యులుగా చేరడానికి తమ బ్యాంక్ అకౌంట్లలో డబ్బును లాభాలుగా చూపించారు. వివిధ ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్న వారిని ఇందులో సభ్యులుగా చేర్చుకున్నారు. వారంతా ఆన్‌లైన్ ద్వారా కొంత మొత్తాన్ని, నగదు రూపంలో కొంత మొత్తాన్ని ఇచ్చారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా గ్రూపులో చేరిన 650 మంది నుంచి లక్షలాది రూపాయలను వసూలు చేశారు. ఈ మొత్తాన్ని కార్తీక్ తల్లి, మాజీ కార్పొరేటర్ అనురాధ, తండ్రి మల్లేశ్వరరావు పేరుతో ఉన్న ఖాతాల్లోకి మళ్లించారు. కొంత మొత్తాన్ని అమెరికాలో ఉన్న స్నేహితుల ఖాతాల్లోకి మళ్లించినట్టు తెలిసింది. మోసపోయామని తెలుసుకున్న బాధితులు డబ్బు కోసం కార్తీక్‌ను నిలదీయడం మొదలు పెట్టారు. కొంతమంది సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయం తెలుసుకున్న కార్తీక్ గ్రూపులో ఉన్న సభ్యులను తొలగించాడు. తాను గ్రూపు అడ్మిన్‌గా లేనని చూపించే ప్రయత్నాలు చేస్తున్నాడు. కొద్దిరోజుల్లో అమెరికా వెళ్లిపోవడానికి కార్తీక్ ఏర్పాట్లు చేసుకున్నట్టు సమాచారం. కాగా, కార్తీక్, అతడి కుటుంబ సభ్యులను సైబర్ క్రైం పోలీసులు పిలిపించినట్టు సమాచారం. పోలీసులకు ఒక కథ చెప్పి ఇంటికి వెళ్లిపోయినట్టు తెలిసింది.

విజయవాడ

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	96, 105, 116
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.50

దోమల నివారణకు ఫాగింగ్



చిట్టినగర్, ఆగస్టు 3: నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా శనివారం నగరంలో 64 డివిజన్లలో ఆటో, హ్యాండ్ మిషన్‌లతో మలేరియా సిబ్బంది ఫాగింగ్ కార్యక్రమం నిర్వహించారు. దోమల నియంత్రణకు ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డేని నిర్వహించి అవగాహన ర్యాలీలతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. **భవానీపురం:** 43వ డివిజన్ 126 సచివాలయం పరిధిలోని హెచ్‌బీ కాలనీలో డెంగ్యూ జ్వరాలు, ఇతర వ్యాధుల నివారణకు డ్రెయిన్ల వద్ద ఆరోగ్య సిబ్బంది శనివారం ఫాగింగ్ నిర్వహించారు. పలు వీధుల్లో ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

విద్యార్థులకు ఆట వస్తువుల పంపిణీ



అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 3 : స్థానిక ఎంకే బేగ్ నగరపాలకసంస్థ, వివేకానంద స్కూల్‌లో విద్యార్థులకు శనివారం పుస్తకాలు, పెన్నులు, బాల, బాలికలకు క్యారంబోర్డులు, షటిల్ బ్యాట్లు, టెన్ని కాయిట్ రింగులు, స్కిప్పింగ్ ఆట వస్తువుల పంపిణీ కార్యక్రమం జరిగింది. సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యుడు కేవీ భాస్కరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు హాజరై విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, ఆట వస్తువులు పంపిణీ చేశారు.

కృష్ణలంక నుంచి దుర్గమ్మకు ఆషాఢ సారె



కృష్ణలంక, ఆగస్టు 3 : ఆషాఢ మాసం ఆఖరి రోజైన శనివారం కృష్ణలంక పాత పోలీస్ స్టేషన్ రోడ్డు నుంచి 108 మంది మహిళలు కనక దుర్గమ్మకు ఆషాఢ సారెను తీసుకెళ్లారు. రెడ్డం వెంకటరెడ్డి, చెంచులక్ష్మి దంపతుల అధ్వర్యంలో 108 మంది మహిళలు ఊరేగింపుగా సారె తీసుకువెళ్లారు. వెన్నా నర్సమ్మ, గంటా మాధవి, జయ, తిరుపతమ్మ, ఆదిలక్ష్మి, రమణ, లక్ష్మి పాల్గొన్నారు.

నేడు ప్రజాకవి వడ్లమూడి శతజయంతి ఉత్సవం

వన్‌టౌన్, ఆగస్టు 3: ప్రజాకవి, నాటక రచయిత, రైతు ఉద్యమనేత వడ్లమూడి నాగేశ్వరరావు శతజయంతి ఉత్సవం విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి జరుగుతాయని ప్రజా నాట్యమండలి, వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్ట్ శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవంలో వడ్లమూడి రచనల గురించి ప్రజా కవి దేవేంద్ర, అంకురం సినిమా దర్శకుడు సి.ఉమామహేశ్వరరావు, రైతు ఉద్యమ నేతగా వడ్లమూడి కృషిని రైతు సంఘం నాయకులు కె. శంకరరావు, తదితరులు వివరిస్తారని పేర్కొన్నారు.

కేరళ బాధితుల కోసం విరాళాల సేకరణ



పటమట, ఆగస్టు 3 : కేరళ బాధిత కుటుంబాల సహాయార్థం సీపీఎం ఆధ్వర్యంలో సహాయ నిధి సేకరణ కార్యక్రమం పటమట ఎన్టీఆర్ సర్కిల్ వద్ద శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ సీపీఎం కేంద్ర కమిటీ దేశంలోని అన్ని కమిటీలకు కేరళ సహాయ నిధి సేకరించి పంపాలని పిలుపునిచ్చిందని, ఈ సందర్భంగా విజయవాడ తూర్పు కమిటీ ఆధ్వర్యంలో ప్రజల వద్దకు వెళ్లి సహాయ నిధి వసూలు చేస్తున్నామన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి.కృష్ణ, నాయకులు గురుమూర్తి, చంద్రశేఖర్, మురహరిలు పాల్గొన్నారు.

షైన్ ఆనంద శరణాలయంలో స్నేహితుల దినోత్సవం



లబ్బీపేట: నలంద డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు చినకాకానిలోని షైన్ ఆనంద శరణాలయంలో అనాథ పిల్లలతో స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న చిన్నారులతో మేమందరం మీకున్నాం అని భరోసా ఇవ్వడంతో పాటు వారందరికీ ఫ్రెండ్‌షిప్ బ్రాండ్లు కట్టారు. అనంతరం కేక్ కట్ చేసి వారికి మిఠాయిలు అందజేశారు, జ్ఞాపికలుగా స్కూల్‌బ్యాగ్స్ అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.వెంకటేశ్వరరావు, 50 మంది వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ శివనాథ్ జన్మదిన వేడుకలు



చిట్టినగర్ సొరంగం రోడ్డులో చీరల పంపిణీ, బెంజిసర్కిల్ వద్ద అన్నదానం, బీఎస్ఆర్‌కేలో కేక్ తినిపిస్తున్న కేశినేని జానకి

చిట్టినగర్, ఆగస్టు 3: నగరంలో పలు ప్రాంతాల్లో ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. 48వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పేరాబత్తుల రమణ ఆధ్వర్యంలో చిట్టినగర్ సొరంగం రోడ్డులో జరిగిన వేడుకల్లో టీడీపీ యువ నాయకులు కాండ్రేగుల రవీంద్ర పాల్గొని కేక్ కట్ చేసి పేదలకు చీరలు పంపిణీ చేశారు. 49వ డివిజన్‌లో ఉరిటీటి నాగమోహన్ ఆధ్వర్యంలో మట్టా లాజరస్ స్కూల్లో జరిగిన వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ బుల్లా విజయ్ కుమార్ పాల్గొని కేక్ చేసి విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టేషనరీ, స్వీట్లు పంపిణీ చేశారు. తెలుగుయువత పశ్చిమ అధ్యక్షుడు ఆర్ మాధవ్ ఆధ్వర్యంలో చిట్టినగర్ జంక్షన్‌లో ఘనంగా జరిగాయి. తొలుత పలువురు టీడీపీ నాయకులు చిట్టినగర్‌లో మహాలక్ష్మి అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వన్‌టౌన్: 38, 39, 52, 53 డివిజన్లలో జరిగిన కేక్ కటింగ్ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్ పాల్గొన్నారు. కేక్ కట్ చేసి చిన్నికి శుభాకాంక్షలు తెలిపారు. **గవర్నర్‌పేట:** ఎంజీ రోడ్డులోని నిర్మల హృదయ భవన్‌లో అనాథలకు పండ్లు, బ్రెడ్‌లు, దుప్పట్లు పంపిణీ జరిగింది. కేశినేని చిన్ని భార్య జానకి, తనయుడు వెంకట్‌లు హాజరై స్థానిక కార్పొరేటర్ ఎన్. బాలస్వామి ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి పేదలకు పండ్లు పంపిణీ చేశారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

భవానీపురం: 43వ డివిజన్‌లోని ఊర్మిళానగర్‌లో టీడీపీ సీనియర్ నాయకులు మోరబోయిన రాంబాబు కేక్ కట్ చేసి, 120 మంది వివిధ స్కూళ్ల విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంచిపెట్టారు. 45వ డివిజన్‌లో బీసీ నాయకులు దేవరకొండ చక్రవర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్ కేక్ కట్ చేసి పంచారు.

పటమట: బెంజిసర్కిల్ వద్ద టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా భవకుమార్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో కేశినేని శివనాథ్ విజయవాడ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

మొగల్రాజపురం: మొగల్రాజపురం జమ్మిచెట్టు సెంటర్‌లో ఉన్న బోయపాటి శివరామకృష్ణయ్య పాఠశాలలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. చరణ్ సాయి యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎంపీ సతీమణి కేశినేని జానకి లక్ష్మి, కుమారుడు వెంకట్ ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచారు. అనంతరం వారు నాలుగు వేల నోట్ పుస్తకాలు విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాల దత్తత తీసుకున్న అమ్మ అసోసియేషన్ నాయకులు యార్లగడ్డ సుబ్బారావు, 8వ డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సొంగా సంజయ్‌వర్మ, టీఎన్ఎస్ఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.● 8వ డివిజన్ మదర్‌థెరీసా జంక్షన్ వద్ద బద్దూరి వీరారెడ్డి ఆధ్వర్యంలో ప్రతాప్ ఇండస్ట్రీస్ అధినేత, టీడీపీ నాయకులు గురుప్రసాద్, నాగుమోతు రాజా, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, డివిజన్ కార్యదర్శి మల్లెల రామకృష్ణ తదితరులు కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు.

విద్యాధరపురం: జిల్లా టీడీపీ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో మాచవరం ఎస్ఆర్ఆర్ కాలేజీ వద్ద జరిగిన వేడుకల్లో ఎంపీ కేశినేని శివనాథ్, ఆయన కుమారుడు కేశినేని వెంకట్ పాల్గొని భారీ కేక్ కట్ చేసి పంచారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కాకాని వెంకటరత్నంను ఆదర్శంగా తీసుకోవాలి



కాకాని విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న అడ్డూరి శ్రీరామ్, కాకాని తరుణ్ తదితరులు

లబ్బీపేట, ఆగస్టు 3: దేశం కోసం, రాష్ట్ర ప్రగతి కోసం అహర్నిశలు పాటుపడిన కాకాని వెంకటరత్నంను ఆదర్శంగా తీసుకుని అందరూ ముందుకు సాగాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, రాష్ట్ర మాజీ మంత్రి కాకాని వెంకటరత్నం 124వ జయంతి కార్యక్రమాన్ని బెంజిసర్కిల్‌లోని కాకాని వెంకటరత్నం విగ్రహం వద్ద ఆయన మనవడు కాకాని తరుణ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాకాని తరుణ్ అదే ప్రాంతంలో ఉన్న నిరుపేద కుటుంబం జీవనోపాధి నిమిత్తం రూ.30వేలు విలువ చేసే స్టీల్ కౌంటర్ అందజేశారు. బీజేపీ జిల్లా సెక్రటరీ భోగవల్లి శ్రీధర్, కొలపల్లి గణేష్, గోవింద్, శ్రీనివాసరావు, కిలారు దిలీప్, వెంకట్, మోతుకూరి వెంకటేశ్వరరావు, అనిల్ లింగమనేని పాల్గొన్నారు. **గవర్నర్‌పేట:** ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో జరిగిన వేడుకలకు కాకాని మనవడు కాకాని తరుణ్ కార్యక్రమానికి హాజరై వెంకటరత్నం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అవసరాల నిమిత్తం ఏసీని బహూకరించారు. జిల్లా కన్స్యూమర్ కోర్టు జడ్జిలు నేలపూడి చిరంజీవి, అక్కిపెద్ది వెంకటరమణ, బీజేవైఎం నాయకులు నవీన్, గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి, పాఠకులు పాల్గొన్నారు.

విద్యుత్ రంగంలో సంస్కరణలు మొదలు పెట్టింది బాబే : గద్దె



విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గద్దె, విద్యుత్ అధికారులు

భారతీనగర్, ఆగస్టు 3 : విద్యుత్ రంగంలో సంస్కరణలు మొదటిగా మొదలు పెట్టింది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడేనని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా మూడో డివిజన్‌లోని కనక దుర్గానగర్ కాలనీలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ శనివారం పర్యటించారు.ఈ సందర్భంగా కాలనీలోని సమస్యలను స్థానికులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం కాలనీలో నూతనంగా నిర్మాణం చేసిన విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ 2014-19లో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తూర్పులో 8 నూతన విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మాణం చేశామన్నారు. ఈ కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మోడరన్ సబ్‌స్టేషన్‌గా నిర్మాణం చేశామన్నారు. విద్యుత్ శాఖ అధికారి ఎస్ఈ మురళీమోహన్ మాట్లాడుతూ ఈ కేంద్రంలో విద్యుత్ సరఫరాతో పాటుగా విద్యుత్ బిల్లులను కూడా వినియోగదారులు చెల్లించవచ్చన్నారు. డీఈ హరిబాబు, కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, తాడి బాబూరావు, గుత్తికొండ కృష్ణమోహన్, గుల్లపల్లి నారాయణరావు, గుత్తి కొండ మోహన్‌రావు, యలమంచిలి పండు, విద్యుత్ శాఖ అధికారులు డి.దుర్గాప్రసాద్, పరమేశ్వరరావు పాల్గొన్నారు.

పార్కుల సుందరీకరణకు చర్యలు : బొండా ఉమా



పాయకాపురం, ఆగస్టు 3 : ప్రజలకు ఆరోగ్యంతో పాటు ఆహ్లాదాన్ని అందించేలా నియోజకవర్గంలో పార్కుల సుందరీకరణకు చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. వాంబేకాలనీ జీ, ఎఫ్ బ్లాక్‌లలోని పార్కుల సుందరీకరణ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో నియోజకవర్గ అభివృద్ధిని పూర్తిగా గాలికి వదిలేశారని విమర్శించారు. స్థానిక కార్పొరేటర్ కంచి దుర్గ, కంచి ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ స్థలాన్ని పూలమార్కెట్‌కు కేటాయించాలి

అజిత్‌సింగ్‌నగర్: గాంధీనగర్‌లోని జీఎస్ రాజు రోడ్డులోని రైతుబజార్ స్థలాన్ని హోల్‌సేల్ పూలమార్కెట్‌కు కేటాయించాలని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కలెక్టర్ సృజనకు సిఫార్స్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో ఆమెను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. పూలమార్కెట్ వ్యాపారుల సమస్యను దృష్టిలో ఉంచుకుని జీఎస్ రాజు రోడ్డులోని రైతుబజార్ స్థలాన్ని పూల మార్కెట్‌కు కేటాయించాలని ఆయన కోరారు.

మర్యాదపూర్వక కలయిక



భారతీనగర్, ఆగస్టు 3 : ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన కె. దామోదర్‌ను గురునానక్ కాలనీలోని ఆయన నివాసంలో శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ పెద్దలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన ను సన్మానించారు. కాలనీ పెద్దలు, గల్లా రవి, పోట్ల శ్రీనివాసరావు,శంకర్ రావు, పెద్ది రాజు, విమల్ పాల్గొన్నారు.

బెజవాడ రాజారావు స్కూల్‌లో ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభం

విద్యాధరపురం, ఆగస్టు 3 : స్థానిక బెజవాడ రాజారావు స్కూల్‌లో ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభం సందర్భంగా 17వ ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్ సుబేదార్ మేజర్ ఎస్.వి. రమణ ఎన్‌సీసీలో చేరిన బాలబాలికలకు తొలి శిక్షణ ఇచ్చి శనివారం యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ డివిజన్ స్థాయిలో ఎన్‌సీసీ ఎ సర్టిఫికెట్ పొందిన వారికి ఉన్నత విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ సదుపాయం, సైన్యం, అగ్నివీర్ నియామకాల్లో ఉపయోగపడు తుందన్నారు.

చైతన్య స్కూల్లో కుటుంబ దినోత్సవం

గుణదల, ఆగస్టు 3: కొరెస్సీనగర్లోని చైతన్య స్కూల్లో కుటుంబ దినోత్సవ కార్యక్రమం శనివారం నిర్వహించారు. చిన్నారులకు పలు అంశాల్లో అవగాహన కల్పించే విషయంలో భాగంగానే నేడు కుటుంబ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పొట్లూరి సునీత తెలిపారు. కష్టమొస్తే చెప్పుకోవడానికి ఒక ఫ్రెండ్‌లా, బాధను ఓదార్చడానికి ధైర్యం చెప్పడానికి జన్మనిచ్చిన తల్లిదండ్రుల పాత్ర చాలా అవరమని చెప్పారు. వేడుకకు హాజరైన తల్లిదండ్రులకు బహుమతులను పాఠశాల ఏజీఎం మురళీకృష్ణ, ఆర్.ఐ. నరేంద్రలతో కలిసి ప్రధానోపాధ్యాయురాలు సునీత అందజేశారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల తనిఖీ

వన్‌టౌన్, ఆగస్టు 3 : ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ శనివారం హెచ్‌బీ కాలనీ, చిట్టినగర్‌లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను ఆయన పరిశీలించారు. ఆసుపత్రి పరిధిలో గర్భిణుల వివరాల నమోదు, ఔట్ పేషెంట్ తదితరాల నమోదుపై ఆరా తీశారు. డాక్టర్ కె. నిరుపమ, డాక్టర్ ఎస్.రాజా, హెల్త్ సూపర్‌వైజర్ అపరంజమ్మ, స్టాఫ్ నర్స్ చంద్రమతి పాల్గొన్నారు.

ఆంధ్ర యూనివర్సిటీలో
డిస్టెన్స్, ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లు



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(ఏయూ-సీడీఓఈ) ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(ఎస్‌డీఈ)- ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్, ఆన్‌లైన్ మోడ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.

అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు: బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. బీఎస్సీ ప్రోగ్రామ్‌ను ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. మిగిలినవాటిని ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో చదువుకోవచ్చు.

- **బీఎస్సీ గ్రూప్ సబ్జెక్టులు:** మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్, బోటనీ, జువాలజీ
- **అర్హత:** బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూప్‌తో ఇంటర్/రెండేళ్ల ఐటీఐ/పాలిటెక్నిక్ డిప్లొమా ఉత్తీర్ణులు; వెటర్నరీ/అగ్రికల్చర్ డిప్లొమా పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏపీఓఎస్/ఎన్ఐఓఎస్ అభ్యర్థులు కూడా అర్హులే. బీఎస్సీ(ఎంపీసీ/ఎంపీసీఎస్/ఎంస్టాట్‌సీఎస్) కోర్సులకు పాలిటెక్నిక్ డిప్లొమా/ఇంటర్(ఎంపీసీ) ఉత్తీర్ణులు; మేథమెటిక్స్‌లో బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసిన ఒకేషనల్ అభ్యర్థులు అర్హులు. బీఎస్సీ(సీబీజడ్) కోర్సుకు ఇంటర్(బైపీసీ)/డిప్లొమా(వెటర్నరీ/అగ్రికల్చర్) ఉత్తీర్ణులు; సైన్స్‌లో బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసిన ఒకేషనల్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు: ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి.

- **ఎంఏ స్పెషలైజేషన్‌లు:** తెలుగు, ఇంగ్లీష్, ఎకనామిక్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హిస్టరీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, మేథమెటిక్స్
- **ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు:** సైకాలజీ, మేథమెటిక్స్, బోటనీ, ఫిజిక్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, జువాలజీ
- **ఎంబీఏ స్పెషలైజేషన్‌లు:** హెచ్‌ఆర్‌ఎం, ఫైనాన్స్, మార్కెటింగ్
- **అర్హత:** ఎంసీఏలో ప్రవేశానికి బీటెక్(సీఎస్ఈ)/బీసీఏ ఉత్తీర్ణులు; ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి బీఎస్సీ/బీకాం/బీఏ పూర్తిచేసినవారు; బీఏ/బీకాం ఉత్తీర్ణతతోపాటు ఏయూ నుంచి పీజీడీసీఏ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మిగిలిన ప్రోగ్రామ్‌లకు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. (ఎంఏ/ఎమ్మెస్సీ)(మేథమెటిక్స్), ఎమ్మెస్సీ(బోటనీ/ఫిజిక్స్/ఆర్గానిక్ కెమిస్ట్రీ/జువాలజీ), ఎంఏ(హిందీ) ప్రోగ్రామ్‌లకు మాత్రం డిగ్రీ స్థాయిలో సంబంధిత స్పెషలైజేషన్ సబ్జెక్ట్ చదివి ఉండాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.andhrauniversity-sde.com

జేఎన్‌టీయూకేలో స్పాన్సర్డ్ ఎంటెక్

కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే)- స్పాన్సర్డ్ కేటగిరీ కింద ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. కాకినాడ, నర్సరావుపేట క్యాంపస్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. అకడమిక్ మెరిట్, గేట్ 2024/జీప్యాట్ 2024/పీజీఈసెట్ 2024 ర్యాంక్, అనుభవం, కౌన్సెలింగ్‌ల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. స్పెషలైజేషన్‌కు అయిదు సీట్లు చొప్పున మొత్తం 125 సీట్లు ఉన్నాయి. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు స్కాలర్‌షిప్‌లు, స్టయిపెండ్ లభించవు.

ఎంటెక్ విభాగాలు-స్పెషలైజేషన్‌లు: సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్, బయోటెక్నాలజీ, నానోటెక్నాలజీ, రిమోట్ సెన్సింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఏవియానిక్స్, ఎన్విరాన్‌మెంటల్ ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ.

అర్హత: ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి సంబంధిత ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్/ఏఎంఐఈ పూర్తిచేసి ఉండాలి. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన ప్రకారం ఎంసీఏ లేదా ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్/స్టాటిస్టిక్స్/మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్/అప్లయిడ్ స్టాటిస్టిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/జియో ఫిజిక్స్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్/కంప్యూటర్ అప్లికేషన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్/కెమిస్ట్రీ/బయో కెమిస్ట్రీ/మైక్రోబయాలజీ/బయోటెక్నాలజీ/లైఫ్ సైన్సెస్/ఎర్త్ సైన్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్/డెయిరీ టెక్నాలజీ) ఉత్తీర్ణులు; ఎంబీబీఎస్/బీడీఎస్/బీ ఫార్మసీ/బీవీఎస్సీ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. డిగ్రీ/పీజీ స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. గేట్ 2024/జీప్యాట్ 2024/పీజీఈసెట్ 2024 అర్హత తప్పనిసరి. అభ్యర్థులకు కనీసం ఏడాది ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి. స్పాన్సర్‌షిప్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **సెమిస్టర్ ఫీజు:** రూ.25,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 23
- **వెబ్‌సైట్:** www.jntuk.edu.in

దిక్సూచి
DIKSUCHI

బయోటెక్నాలజీ, సైన్సెస్ విభాగాల్లో పీజీ చేయాలనుకొనే వారి కోసం ఉద్దేశించిన 'జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్(జామ్) 2025' షెడ్యూల్ వెలువడింది. దీనిని ఈ ఏడాది ఐఐటీ ఢిల్లీ నిర్వహిస్తోంది. ఈ పరీక్షలో సాధించిన స్కోర్ ద్వారా ఎమ్మెస్సీ; ఎమ్మెస్సీ(టెక్); ఎంఎస్(రీసెర్చ్); జాయింట్/డ్యూయల్ డిగ్రీ ఎమ్మెస్సీ-పీహెచ్‌డీ; ఎమ్మెస్సీ-ఎంటెక్ డ్యూయెల్ డిగ్రీ; ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న 21 ఐఐటీలు అందిస్తున్న వివిధ పీజీ ప్రోగ్రామ్‌లలో సుమారు 3000 సీట్లను జామ్ స్కోర్ ద్వారా నేరుగా భర్తీ చేస్తారు. అలాగే నిట్ సంస్థలు, ఐసర్లు, ఐఐఎస్సీ, ఐఐఈఎస్‌టీ, డీఐఏటీ, ఐఐపీఈ, జేఎన్‌సీఏఎస్ఆర్, ఎస్ఎల్ఐఈటీ సహా ప్రముఖ సీఎఫ్‌టీఐ సంస్థల్లో 2300కు పైగా ఉన్న సీట్ల భర్తీకి కూడా ఈ స్కోరునే ప్రామాణికంగా తీసుకుంటారు.

సైన్స్ పీజీల్లో ప్రవేశానికి జామ్

జామ్ పేపర్లు: జామ్ ఎగ్జామ్‌ను ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో నిర్వహిస్తారు. ఉదయం సెషన్‌లో కెమిస్ట్రీ, జియాలజీ, మేథమెటిక్స్ పేపర్లు; మధ్యాహ్నం సెషన్‌లో బయోటెక్నాలజీ, ఎకనామిక్స్, మేథమెటికల్ స్టాటిస్టిక్స్, ఫిజిక్స్ పేపర్లు ఉంటాయి. అభ్యర్థులు గరిష్ఠంగా రెండు పేపర్లు రాయవచ్చు. రెండు పేపర్లు రాసేవారు ఉదయం సెషన్ నుంచి ఒక పేపర్, మధ్యాహ్నం సెషన్ నుంచి మరో పేపర్ ఉండేలా చూసుకోవాలి. పేపర్లకు నిర్దేశించిన సిలబస్‌ను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. కెమిస్ట్రీ పేపర్ సిలబస్ మారినందున దానిని త్వరలోనే అప్‌లోడ్ చేస్తారు.

అర్హత: అభ్యర్థి జామ్‌లో ఎంచుకొన్న పేపర్/పేపర్లను అనుసరించి సంబంధిత సబ్జెక్టులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు; సంబంధిత ఇండియన్ డిగ్రీ పూర్తిచేసిన విదేశీ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు. ఒక అభ్యర్థి ఎన్నిసార్లయినా జామ్ ఎగ్జామ్ రాయవచ్చు.

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** సెప్టెంబరు 3
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 11
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** 2025 జనవరిలో
- **జామ్ 2025 ఎగ్జామ్ తేదీ:** 2025 ఫిబ్రవరి 2
- **వెబ్‌సైట్:** jam2025.iitd.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/gudU4Skలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



యుద్ధానికి సిద్ధం

అడివిశేష్ హీరోగా నటించిన 'గూఢచారి' సినిమాకి కొనసాగింపుగా వస్తోన్న చిత్రం 'గూఢచారి 2'. వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్, అనిల్ సుంకర నిర్మిస్తున్నారు. 'గూఢచారి' చిత్రం విడుదలై ఆరేళ్లు అవుతున్న సందర్భంగా పార్ట్ 2 నుంచి ఆరు స్టైలిష్ యాక్షన్ స్టిల్స్‌ను శనివారం యూనిట్ విడుదల చేసింది. 'గూఢచారి 2' భారీ స్థాయిలో అంతర్జాతీయ ప్రమాణాలతో తెరకెక్కుతోంది' అని శేష్ చెప్పారు. ఇప్పటికి 40 శాతం షూటింగ్ పూర్తయిందని నిర్మాతలు తెలిపారు.



రెడ్‌కార్పెట్ లుక్

'69వ శోభా ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ 2024' వేడుక శనివారం రాత్రి హైదరాబాద్‌లో అట్టహాసంగా జరిగింది. హీరోలు నాని, సుధీర్‌బాబు, సందీప్ కిషన్, అల్లు శిరీష్, నవీన్ పొలిశెట్టి, సిద్ధార్థ్... హీరోయిన్లు పాయల్ రాజ్‌పుత్, ఐశ్వర్యా రాజేశ్, జ్యోతిక, నభానటేశ్, రాశీఖన్నా, ప్రియమణి తదితరులు పాల్గొన్నారు.

లావణ్యే డ్రగ్స్ అలవాటు చేసింది

● రాజ్‌తరుణ్ మాజీ ప్రియురాలిపై కేసు

రాజ్‌తరుణ్, ఆయన మాజీ ప్రియురాలు లావణ్య మధ్య నడుస్తున్న వివాదం కొత్త మలుపు తీసుకుంది.



లావణ్య తనకు డ్రగ్స్ అలవాటు చేసిందంటూ ప్రీతీ అనే యువతి నార్సింగి పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. 'లావణ్య ఇప్పటికే చాలామంది అమ్మాయిలకు డ్రగ్స్ అలవాటు చేసింది, తరచూ నాకు ఫోన్‌చేసి బెదిరిస్తోంది, ఆమెవల్ల ఇప్పటికే చాలా జీవితాలు నాశనం అయ్యాయి' అని ప్రీతి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరుపుతున్నట్లు ఎస్సై సుఖేందర్‌రెడ్డి తెలిపారు. డ్రగ్స్ విషయంలో అడ్డు చెప్పడం వల్లే ఆమె రాజ్‌తరుణ్‌పై కక్ష పెంచుకుందని ఆయన తరపు లాయర్ మధుశర్మ చెప్పారు.

వయనాడ్ విలయం... సినీతారల సాయం



కేరళ సీఎం సహాయక నిధికి రూ. 25 లక్షల సాయం అందించిన మలయాళ నటుడు మోహన్‌లాల్ సహాయక చర్యల్లో సైతం పాల్గొని తన గొప్ప మనసు చాటుకున్నారు. టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్‌గా కొనసాగుతున్న ఆయన ఆ హోదాలో దగ్గరుండి సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారు. వయనాడ్‌లోని ఆర్మీ బేస్ క్యాంప్‌లో ఆయన సైనికులను కలిశారు. తాత్కాలిక బ్రిడ్జిల నిర్మాణం లాంటి కార్యక్రమాల్లో సైనికులతో కలసి పాల్గొన్నారు. 'మీరు రీల్ హీరో కాదు రియల్ హీరో' అంటూ నెటిజన్లు మోహన్‌లాల్‌ను ప్రశంసిస్తున్నారు.



నటీనటుల విరాళాలు

భారీ వరదలు, కొండ చరియలు విరిగిపడి తీవ్రంగా నష్టపోయిన వయనాడ్ ప్రాంతంలో సహాయ, పునరావాస కార్యక్రమాలకు తమవంతు సాయం అందించేందుకు తారాలోకం నడుంకట్టింది. పలువురు నటీనటులు ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలు ఇస్తున్నారు. టాలీవుడ్ కథానాయిక రష్మిక మందన్న రూ. 10 లక్షలు, నిర్మాత సూర్యదేవర నాగవంశీ రూ. 5 లక్షలు విరాళంగా ఇచ్చారు. తమిళ నటులు సూర్య, కార్తి, జ్యోతిక కలిసి రూ. 50 లక్షలు ఇవ్వగా, కమల్‌హాసన్ రూ. 25 లక్షలు, విక్రమ్ రూ. 20 లక్షలు ఇచ్చారు. దుల్కర్ సల్మాన్ రూ. 10 లక్షలు, మమ్ముట్టి రూ. 15 లక్షలు, ఫహద్‌ఫాజిల్, నజ్రియా దంపతులు రూ. 25 లక్షలు విరాళంగా అందించారు.



సక్సెస్



థియేటర్లు పెరుగుతున్నాయి

రాజ్ తరుణ్, మాళ్వీ మల్హోత్రా జంటగా రూపొందిన 'తిరగబడరా సామీ' చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విజయోత్సవంలో నిర్మాత మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ 'మొత్తం 200 థియేటర్లలో విడుదల చేశాం. ఈ రోజు మరో 20 థియేటర్లు పెరిగాయి. మా సినిమాకు మంచి రిపోర్ట్ వచ్చింది. దర్శకుడు రవికుమార్ చౌదరి అద్భుతంగా తీశారు. లేడీ విలన్‌గా మన్నారా చోప్రా చక్కగా నటించింది' అన్నారు. మంచి సినిమాను ఏదీ అడ్డుకోలేదని ప్రేక్షకులు నిరూపించారని దర్శకుడు రవికుమార్ చౌదరి చెప్పారు.

ప్రేక్షక దేవుళ్లు కరుణించారు



'ఒక కొత్త హీరో నటించిన సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు. 'ప్రేక్షక దేవుళ్లు' అని ఎందుకు అంటారో నాకు ఇప్పుడు అర్థమైంది' అన్నారు 'అలనాటి రామచంద్రుడు' చిత్ర హీరో కృష్ణవంశీ. శుక్రవారం విడుదలైన ఈ చిత్రానికి మంచి ఆదరణ లభించిందని శనివారం నిర్వహించిన థ్యాంక్స్ మీట్‌లో వెల్లడించారు. ఈ చిత్ర నిర్మాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్మాత శ్రీరామ్ జడపోలు కృతజ్ఞతలు తెలిపారు.



రెస్పాన్స్ బాగుంది

'చాలా రోజుల తర్వాత ఒక క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను చూశామని ప్రేక్షకులు అంటుంటే ఆనందంగా ఉంది' అన్నారు దర్శకుడు విజయ్‌భాస్కర్. శ్రీకమల్, తాన్వీ ఆకాంక్ష జంటగా రూపొందిన 'ఉషా పరిణయం' చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ నేపథ్యంలో శనివారం ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌లో చిత్రనిర్మాత, దర్శకుడు విజయభాస్కర్ మాట్లాడుతూ 'కలెక్షన్లు నెమ్మదిగా పెరుగుతున్నాయి. రెస్పాన్స్ బాగుంది. ఇలాంటి చిన్న సినిమాలను ఆదరిస్తే మరిన్ని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లు వస్తాయి' అన్నారు





పారిస్ ఒలింపిక్స్ (జులై 26 - ఆగస్టు 11)



చరిత్ర సృష్టిస్తాడా?

వరల్డ్ నెంబర్ వన్ విక్టర్‌తో లక్ష్యసేన్ సెమీస్ పోరు నేడు

ఒలింపిక్స్ బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో ఆదివారం మరో హైటెన్షన్ పోరుకు రంగం సిద్ధమైంది. డిఫెండింగ్ చాంపియన్, డెన్మార్క్‌కు చెందిన విక్టర్ అక్సెల్సెన్‌ను సెమీఫైనల్లో ఢీకొట్టేందుకు 22 ఏళ్ల లక్ష్యసేన్ సై అంటున్నాడు. ఈ మ్యాచ్‌లో గెలిస్తే..ఒలింపిక్స్ చరిత్రలో పురుషుల బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో ఫైనల్‌కు చేరిన తొలి భారత షట్లర్‌గా సేన్ రికార్డులకెక్కుతాడు. కాగా ఇప్పటివరకు వీరిద్దరూ ఏడుసార్లు తలపడగా ఆరు మార్లు విక్టర్‌నే విజయం వరించింది. రియోలో కాంస్యం, టోక్యోలో స్వర్ణం సాధించిన విక్టర్, మూడో ఒలింపిక్ పతకంపై కన్నేశాడు. గ్రూప్ దశలో వరల్డ్ నెంబర్ 4 జొనాథన్ క్రిస్టీ, క్వార్టర్స్‌లో ప్రపంచ 11వ ర్యాంకర్ చౌ టైన్ చెన్‌కు షాకిచ్చిన సేన్, విక్టర్‌ను నిరోధించడానికి తన సర్వ శక్తులు ఒడ్డేందుకు సమాయత్తమయ్యాడు.

23వ స్థానంలో శరవణన్

సెయిలింగ్ పురుషుల డింగీ ఈవెంట్‌లో విష్ణు శరవణన్ పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. ఐదో రేస్‌లో 21వ స్థానంలో నిలిచిన శరవణన్.. ఆరో రేస్‌లో 13వ స్థానం దక్కించుకొన్నాడు. ఓవరాల్‌గా ఆరు రేస్‌లు ముగిసే సరికి విష్ణు 23వ స్థానంలో నిలిచాడు. మహిళల డింగీ ఈవెంట్‌లో నేత్ర కుమనన్ రేస్-4లో 28వ, రేస్-5లో 28వ, రేస్-6లో 20వ స్థానాల్లో నిలిచింది. ఓవరాల్‌గా 24వ ర్యాంక్‌లో కొనసాగుతోంది. ఓపెనింగ్ 10 సిరీస్‌ల్లో టాప్-10 నెట్ స్కోర్లు సాధించిన సెయిలర్లు మెడల్ రేస్‌కు అర్హత సాధిస్తారు.



హాకీ కుర్రాళ్లు.. నాకౌట్ ఫైట్‌కు సిద్ధం

గ్రూప్ దశలో అద్భుతమైన ప్రదర్శన కనబర్చిన భారత పురుషుల హాకీ జట్టు నాకౌట్ సమరానికి సిద్ధమైంది. ఆదివారం జరగనున్న క్వార్టర్ ఫైనల్స్‌లో బ్రిటన్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. గ్రూప్-బిలోని తమ చివరి మ్యాచ్‌లో టోక్యో ఒలింపిక్స్ రన్నరప్ ఆస్ట్రేలియాపై 3-2తో విజయం సాధించి, అగ్రశ్రేణి జట్లకు హెచ్చరికలు పంపిన భారత్ క్వార్టర్స్ పోరులో ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. ఒకే ఒక్క ఓటమితో గ్రూప్ దశలో రెండో స్థానంలో నిలిచిన భారత్, ఈసారి టోక్యో ఒలింపిక్స్ కంటే మెరుగైన ప్రదర్శన చేయాలని పట్టుదలతో ఉంది. చివరిగా కంగారూలతో జరిగిన మ్యాచ్‌లో భారత్ జట్టు దూకుడుగా ఆడడంతో పాటు అద్భుతమైన సమన్వయం కనబర్చింది. మిడ్‌ఫీల్డ్‌లో మన్‌ప్రీత్, హార్దిక్ సింగ్, ఫార్వర్డ్ లైన్‌లో గుర్జంత్, సుఖ్‌జీత్ సింగ్ అంచనాలకు తగ్గట్టు ఆడుతుండడం భారత్‌కు సానుకూలాంశం. బ్రిటన్ దాడులకు వెటరన్ గోల్‌కీపర్ శ్రీజేష్ అడ్డుగోడలా నిలిస్తే భారత్ గెలుపునకు తిరుగుండదు.



బంగారు బైల్స్

సిమోన్ ఖాతాలో మూడో స్వర్ణం ● మహిళల వాల్ట్ టైటిల్ కైవసం

పారిస్: తనకు ఎదురేలేదని అమెరికా స్టార్ జిమ్నాస్ట్ సిమోన్ బైల్స్ నిరూపించింది. పారిస్ ఒలింపిక్స్‌లో ఇప్పటికే మహిళల ఆర్టిస్టిక్ టీమ్, వ్యక్తిగత ఆల్‌రౌండ్ విభాగాల్లో పసిడి పతకాలను సొంతం చేసుకున్న ఆమె..వాల్ట్‌లోనూ స్వర్ణం కొల్లగొట్టింది. తద్వారా ఈసారి విశ్వక్రీడల్లో స్వర్ణాల హ్యాట్రిక్ సాధించింది. వ్యక్తిగతంగా మాత్రం ఆమె రెండు పసిడి పతకాలు (ఆల్‌రౌండ్, వాల్ట్) అందుకుంది. కాగా..వెరా కస్లావ్‌స్కా (చెక్ రిపబ్లిక్, 1964, 1968 ఒలింపిక్స్) తర్వాత విశ్వక్రీడల వాల్ట్ విభాగంలో రెండు స్వర్ణాలు దక్కించుకున్న తొలి జిమ్నాస్ట్‌గా బైల్స్ రికార్డు నెలకొల్పింది. శనివారం జరిగిన వాల్ట్ ఫైనల్లో బైల్స్ 15.300 పాయింట్లతో స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. అండ్రాడే (బ్రెజిల్, 14.966) రజతం, కేరీ (అమెరికా, 14.466) కాంస్యం గెలిచారు.

'బ్లాక్ జాబ్' నాకిష్టం: ట్రంప్‌నకు బైల్స్ కౌంటర్

'జిమ్నాస్టిక్స్‌లో స్వర్ణ పతకాలు గెలవడం నా బ్లాక్ జాబ్. ఈ బ్లాక్ జాబ్ నాకు ఎంతో ఇష్టం' అని బైల్స్. మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఘాటైన జవాబిచ్చింది. వలసవాదుల వల్ల అమెరికన్లు నిరుద్యోగ సమస్య ఎదుర్కొంటున్నారని.. ఆ వలసవాదులు చేసే ఉద్యోగాలను 'బ్లాక్ జాబ్స్'గా ట్రంప్ విమర్శించారు. పారిస్ ఒలింపిక్స్ జిమ్నాస్టిక్స్ వ్యక్తిగత ఆల్‌రౌండ్ విభాగంలో పసిడి పతకం గెలిచిన అనంతరం.. ట్రంప్ 'బ్లాక్ జాబ్స్' విమర్శకు బైల్స్ పరోక్షంగా గట్టి బదులిచ్చింది.



ఒక్క తూటా.. ఒకే ఒక్క తూటా మను భాకర్ చరిత్ర సృష్టించే అవకాశాన్ని చేజార్చింది. ఇప్పటికే రెండు పతకాలు సాధించిన మను 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లోనూ ఫైనల్‌కు వెళ్లడంతో అంచనాలు ఆకాశాన్నంటాయి. మూడో స్థానం కోసం జరిగిన షూటాఫ్‌లో మను మూడు షాట్లు మాత్రమే కొట్టగా.. ప్రత్యర్థి నాలుగు షాట్లతో ముందుకెళ్లింది. దీంతో లక్ష్య ఛేదనలో కొద్దిలో గురి తప్పిన ఈ హరియాణా షూటర్ నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. అయినా ఇప్పటికే రెండు పతకాలతో దేశ ఖ్యాతిని పెంచిన మనుపై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది.



ఆ ఒక్క గురి హ్యాట్రిక్ చేజారి..

మూడో పతకాన్ని త్రుటిలో కోల్పోయిన మను భాకర్

25మీ. పిస్టల్ ఈవెంట్‌లో నాలుగో స్థానంతో సరి

పారిస్: సంచలన ప్రదర్శనతో రికార్డుల మోత మోగించిన యువ షూటర్ మను భాకర్ పారిస్ గేమ్స్ ప్రస్థానం ముగిసింది. శనివారం జరిగిన 25మీ. పిస్టల్ ఈవెంట్ ఫైనల్లో అద్భుత పోరాటాన్ని కనబరచిన మను త్రుటిలో పతకాన్ని చేజార్చుకుంది. 28 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. దీంతో ఒకే ఒలింపిక్స్‌లో మూడు పతకాలతో చరిత్ర సృష్టిద్దామనుకున్న భాకర్ ఆశలకు బ్రేక్ పడినట్టయ్యింది. ఇప్పటికే మను మహిళల వ్యక్తిగత 10మీ. ఎయిర్ పిస్టల్‌తో పాటు మిక్స్‌డ్ టీమ్‌లో సరబ్‌జోత్‌తో కలిసి కాంస్య పతకాలు సాధించిన విషయం తెలిసిందే. కాగా, ఈ పోటీలో కొరియా షూటర్ జిన్ యాంగ్ (37)కు స్వర్ణం, ఫ్రాన్స్‌కు చెందిన కమిలె జెద్రెజెస్కికి రజతం, వెరోనిక(హంగేరి)కు కాంస్యం దక్కింది. భారత్ నుంచి గతంలోనూ షూటర్లు జాయ్‌దీప్ కర్మాకర్ (2012), అభినవ్ బింద్రా (2016), అర్జున్ బబుతా (2024) నాలుగో స్థానంలో నిలిచిన వారిలో ఉన్నారు.

షూటాఫ్‌లో తడబాటు

ఫైనల్‌లో భాగంగా స్టేజీ1లో జరిగే మూడు సిరీస్‌ల్లో ఒక్కో షూటర్ 15 షాట్లు కొట్టాల్సి ఉంటుంది. ఆ తర్వాత స్టేజీ2 ఎలిమినేషన్‌లో 4-10 సిరీస్‌లు జరుగుతాయి. అయితే పోటీని మను పేలవంగానే ఆరంభించినప్పటికీ క్రమక్రమంగా పర్ఫెక్ట్ షాట్లతో తన స్థానాలను మెరుగుపర్చుకుంటూ కొద్ది క్షణాల పాటు నెంబర్‌వన్‌గానూ నిలిచింది. కానీ అదే నిలకడను కొనసాగించలేక మూల్యం చెల్లించుకుంది. స్టేజీ1 తొలి సిరీస్‌లో ఐదు టార్గెట్లలో రెండు మాత్రమే కొట్టింది. కానీ వెంటనే పుంజుకుని తర్వాత రెండు సిరీస్‌ల్లో నాలుగేసి షాట్లతో మొత్తం 10 పాయింట్లతో రెండో స్థానానికి వెళ్లింది. ఆ తర్వాత ఎలిమినేషన్ రౌండ్‌లో భాకర్ ఐదో సిరీస్‌ను ఐదు షాట్లతో ముగించి భేష్ అనిపించుకుంది. ఏడో సిరీస్‌లో రెండు వరుస షాట్లతో కాసేపు భాకర్ టాప్‌లోకి వెళ్లినా, ఆ తర్వాత మూడో షాట్ మిస్ అయింది. అటు జిన్ యాంగ్ మూడు వరుస షాట్లతో టాప్‌లోకి వెళ్లి భాకర్‌ను మూడో స్థానంలోకి నెట్టింది. ఇక ఎనిమిదో సిరీస్‌లో మను రెండు షాట్లు మాత్రమే కొట్టగా, వెరోనిక మూడు షాట్లతో ఇద్దరూ 28 పాయింట్లతో మూడో స్థానంలో నిలవాల్సి వచ్చింది. వాస్తవానికి ఇక్కడ మను మరో షాట్ సరిగ్గా కొట్టి ఉంటే 29 పాయింట్లతో షూటాఫ్ ఆడాల్సి వచ్చేది కాదు. టాప్-3లోకి వెళ్లి కనీసం కాంస్యమైనా దక్కించుకునేది. షూటాఫ్‌లోనూ భాకర్ 3 షాట్లు, వెరోనిక 4 షాట్లు కొట్టడంతో భారత షూటర్‌కు నిరాశ తప్పలేదు.


మెరిసిన మహేశ్వరి

పురుషుల స్కీట్ ఈవెంట్‌లో అనంత్ జీత్ నరుకకు నిరాశే ఎదురైంది. రెండో రోజు క్వాలిఫికేషన్ రౌండ్‌లో తను 24వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయాడు. అటు మహిళల స్కీట్ తొలి రోజు క్వాలిఫికేషన్‌లో మహేశ్వరి చౌహాన్ 71 పాయింట్లతో 8వ స్థానంతో ఆకట్టుకుంది. దీంతో ఫైనల్‌కు అర్హత సాధించే టాప్-6లో ఉండేందుకు తన అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. మరో షూటర్ రైజా ధిల్లాన్ 66 పాయింట్లతో 25వ స్థానంలో కొనసాగుతోంది. ఆదివారం జరిగే మరో ఐదు రౌండ్లలో ఫైనలిస్టులు ఖరారవుతారు.

ఒత్తిడి లేదు..

'కొద్దిలో పతకం మిస్ అయినందుకు షూటర్ మను భాకర్ భావోద్వేగానికి లోనైంది. రెండు పతకాలు సాధించినప్పటికీ.. మూడో ఈవెంట్‌లో ఓటమి బాధ కలిగించింది. నాలుగో స్థానం అంత మంచిది కాదు' అని కన్నీటిని ఆపుకొంటూ భాకర్ తెలిపింది. అయితే తానేమీ ఒత్తిడిలో బరిలోకి దిగలేదని స్పష్టం చేసింది. లాస్ ఏంజిల్స్‌లో తిరిగి సత్తా చూపుతానని విశ్వాసం వ్యక్తం చేసింది. 'మ్యాచ్ అయిపోయాక ఫలితం గురించి ఆలోచించకుండా ప్రశాంతంగా కూర్చుని పోటీ ఫలితాన్ని విశ్లేషించుకోవాలని నా కోచ్ జస్పాల్ రాణా చెప్పాడు. నన్ను వాస్తవిక స్థితిలో ఉంచేందుకు ఆయన చేసిన ప్రయత్నం గొప్పది. మూడో పతకం కోసం నాపై ఎలాంటి ఒత్తిడీ లేదు. టోక్యో గేమ్స్‌లో ఆత్మవిశ్వాసంతో లేను. ప్రతీ దానికి భయపడుతూ ఉండేదాన్ని. కానీ ఇప్పుడు నాలో అనుభవంతో కూడిన మార్పు వచ్చింది. దీనికి నా కోచ్ రాణా కారణం' అని మను పేర్కొంది.

పతకాల పట్టిక



దేశం	స్వ	ర	కా	మొ
చైనా	16	11	9	36
ఫ్రాన్స్	12	14	15	41
ఆస్ట్రేలియా	12	7	5	24
అమెరికా	11	20	20	51
బ్రిటన్	10	10	12	32
కొరియా	9	7	5	21
జపాన్	8	5	9	22
ఇటలీ	6	8	4	18
నెదర్లాండ్స్	5	4	4	13
జర్మనీ	4	3	2	9
భారత్	0	0	3	3

గమనిక: స్వ=స్వర్ణం, ర=రజతం, కా=కాంస్యం, మొ=మొత్తం.

పారిస్‌లో నేటి భారతం



షూటింగ్: పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ **క్వాలిఫికేషన్ స్టేజ్ 1, 2:** విజయ్‌వీర్ సిద్ధు, అనీష్ (మ. 12.30), మహిళల స్కీట్ **క్వాలిఫికేషన్ రెండో రోజు**- రైజా ధిల్లాన్, మహేశ్వరి చౌహాన్ (మ.1).
గోల్ఫ్: పురుషుల వ్యక్తిగత స్ట్రోక్ ప్లే 4వ రౌండ్ - శుభాంకర్, గగన్‌జీత్ (మ. 12.30)
హాకీ: క్వార్టర్‌ఫైనల్: భారత్ x బ్రిటన్ (మ. 1.30).
అథ్లెటిక్స్: మహిళల 3 వేల మీటర్ల స్టీపుల్‌చేజ్ రౌండ్ 1 - పారుల్ చౌదరి (మ. 1.35); పురుషుల లాంగ్ జంప్ క్వాలిఫికేషన్: జెస్విన్ ఆల్డ్రిన్ (మ. 2.30).
బాక్సింగ్: మహిళల 75 కిలోల క్వార్టర్‌ఫైనల్స్: లవ్లీనా బోర్గోహైన్ x లి కియాన్ (చైనా) (మ. 3.02).
బ్యాడ్మింటన్: పురుషుల సింగిల్స్ సెమీఫైనల్: లక్ష్యసేన్ x విక్టర్ అక్సెల్సెన్ (డెన్మార్క్) (మ. 3.30).
సెయిలింగ్: పురుషుల డింగీ **రేసు 7,8** - విష్ణు శరవణన్ (మ. 3.35); మహిళల డింగీ **రేసు 7,8** - నేత్ర కుమనన్ (సా. 6.05).



ఆమెకు పతకం ఖరారు

విల్లెపింటె (ఫ్రాన్స్): పురుష లక్షణాలున్నాయన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న అల్జీరియా బాక్సర్ ఇమానె ఖెలిఫ్ పారిస్ ఒలింపిక్స్‌లో పతకం ఖాయం చేసుకుంది. శనివారం జరిగిన మహిళల 66 కిలోల విభాగం క్వార్టర్స్ బౌట్‌లో ఖెలిఫె 5-0తో అన్నా లూకా హమోరి (హంగేరి)ని చిత్తు చేసి సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. ఖెలిఫె సెమీస్‌లో ఓడినా కనీసం కాంస్య పతకం దక్కుతుంది. 25 ఏళ్ల ఖెలిఫ్ టోక్యోలోనూ పోటీపడ్డా, క్వార్టర్స్‌లోనే ఓడింది. కానీ, ఈసారి పట్టుదలగా పోరాడి పతకాన్ని ఖరారు చేసుకుంది. కాగా, మహిళల బాక్సింగ్ పోటీలో ఓ పురుషుడిని ఎలా అనుమతిస్తారంటూ ఖెలిఫ్‌పై సోషల్ మీడియాతో పాటు ప్రపంచ వ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్, ప్రముఖ రచయిత్రి జేకె రౌలింగ్‌లాంటి ప్రముఖులు ఖెలిఫ్‌ను మహిళల బాక్సింగ్‌లో ఆడించడాన్ని తప్పుపట్టారు.



ఆధిక్యం దక్కినా..

క్వార్టర్స్‌లో దీపిక ఓటమి

అత్యున్నత వేదికపై వెటరన్ ఆర్చర్ దీపికా కుమారి మరోసారి తడబడింది. వరుసగా నాలుగో ఒలింపిక్స్‌లో బరిలోకి దిగిన దీపిక.. పతకం లేకుండానే వెనుదిరిగింది. దీంతో ఆర్చరీలో భారత పోరాటం ముగిసింది. శనివారం జరిగిన రికర్వ్ వ్యక్తిగత విభాగం క్వార్టర్స్‌లో దీపిక 4-6తో షుహయోన్ నామ్ (కొరియా) చేతిలో పరాజయం పాలైంది. తొలి మూడు సెట్లలో రెండు నెగ్గిన దీపిక 4-2తో ముందంజలో నిలిచింది. అయితే, నాలుగో సెట్ రెండో అవకాశంలో దారుణంగా 7 పాయింట్లు మాత్రమే సాధించడంతో అంతా తారుమారైంది. ఆ సెట్‌ను గెలిచిన కొరియా ఆర్చర్ స్కోరు సమం చేసింది. నిర్ణాయక ఐదో సెట్‌లో దీపిక వరుసగా 9,9,9 స్కోరు చేయగా.. 10, 9, 10 పాయింట్లు స్కోరు చేసి ఆ సెట్‌తోపాటు మ్యాచ్‌నూ సొంతం చేసుకొంది. అంతకుముందు జరిగిన ప్రీక్వార్టర్స్‌లో దీపిక 6-4తో మిచెల్లీ క్రోపెన్ (జర్మనీ)ని ఓడించింది. లండన్, రియో, టోక్యోలో విఫలమైన దీపికపై ఈసారి పెద్దగా అంచనాలు లేకుండానే బరిలోకి దిగింది. కానీ, వ్యక్తిగత ఈవెంట్‌లో క్వార్టర్స్ చేరిన ఏకైక భారత ఆర్చర్‌గా అందరినీ ఆశ్చర్యపర్చింది. ఇక, పతకంపై ఆశలు రేపిన టీనేజర్ భజన్ కౌర్ షూటాఫ్‌లో ఎలిమినేట్ అయింది. ప్రీ క్వార్టర్స్‌లో కౌర్ 5-6తో దియానంద (ఇండోనేసియా) చేతిలో పరాజయం పాలైంది. ఐదు సెట్లు ముగిసేసరికి ఇద్దరూ 5-5తో సమంగా నిలిచారు. కానీ, షూటాఫ్‌లో భజన్ 8 పాయింట్లు మాత్రమే సాధించగా.. ప్రత్యర్థి 9 పాయింట్లు స్కోరు చేసింది.



మధ్యాహ్నం 2.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..

బ్యాటింగ్‌పైనే దృష్టి

శ్రీలంకతో రెండో వన్డే నేడు

కొలంబో: సునాయాసంగా నెగ్గాల్సిన తొలి వన్డేను స్టార్ బ్యాటర్లతో కూడిన టీమిండియా టైతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కీలక తరుణంలో విజృంభించిన శ్రీలంక స్పిన్నర్లు జట్టును ఓటమినుంచి గట్టెక్కించారు. ఈనేపథ్యంలో రెండు జట్ల నడుమ ఆదివారంనాటి రెండో వన్డే ఆసక్తిగా సాగడం ఖాయం. కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్ వంటి స్టార్ బ్యాటర్లున్నా మొదటి వన్డేలో..231 పరుగుల మోస్తరు లక్ష్యాన్ని భారత్ ఛేదించలేక పోయింది. కెప్టెన్ రోహిత్ ధనాధన్ ఇన్నింగ్స్‌తో గిల్‌తో కలిసి తొలి వికెట్‌కు 75 రన్స్‌తో తిరుగులేని ఆరంభం ఇచ్చాడు. ఇక ఆపై వచ్చే బ్యాటర్లు సునాయాసంగా ఛేదనను పూర్తి చేయాల్సి ఉంది. కానీ కోహ్లీ, అయ్యర్, అక్షర్ పటేల్ కుదురుకుంటున్న తరుణంలో వికెట్లు పారేసుకున్నారు. కేఎల్ రాహుల్ కూడా విఫలమయ్యాడు. మొత్తంగా ప్రత్యర్థి స్పిన్నర్లను ఎదుర్కోవడంలో మన బ్యాటర్లు తడబాటుకు లోనయ్యారు. మరోవైపు తొలి వన్డేను టై చేసుకున్న ఆత్మవిశ్వాసంతో ఉన్న ఆతిథ్య జట్టు భారత్‌కు గట్టి పోటీ ఇవ్వాలని పట్టుదలగా ఉంది. స్పిన్నర్లతో భారత్‌కు చెక్ పెట్టాలనుకుంటోంది.

జట్లు (అంచనా)
భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లీ, శ్రేయాస్, కేఎల్ రాహుల్, శివమ్ దూబే, అక్షర్, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్, సిరాజ్, అర్ష్‌దీప్.
శ్రీలంక: అసలంక (కెప్టెన్), నిస్సాంక, ఆవిష్క ఫెర్నాండో, కుశాల్ మెండిస్, సదీర సమరవిక్రమ, లియనాగే, వెల్లలగే, హసరంగ, అకిల దనంజయ, మహ్మద్ షిరాజ్, అసిత ఫెర్నాండో.
పిచ్/వాతావరణం: తొలి వన్డేలో మొత్తం18 వికెట్లు పడితే.. వాటిలో 13 స్పిన్నర్లే సాధించారు. అదే మాదిరి క్వెట్టరామ పిచ్ రెండో వన్డేలోనూ స్పిన్నర్లకు అనుకూలించనుంది. మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగించే అవకాశముంది.

ఫైనల్లో జొకోవిచ్ x అల్కారజ్



అంచనాలకు తగ్గట్టుగానే రాణించిన జొకోవిచ్, అల్కారజ్ టెన్నిస్‌లో ఒలింపిక్ స్వర్ణం కోసం అమీతుమీ తేల్చుకోనున్నారు. ఆదివారం పురుషుల సింగిల్స్‌లో ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఎవరు గెలిచినా కెరీర్‌లో తొలి స్వర్ణం కానుంది. శుక్రవారం జరిగిన రెండో సెమీస్‌లో జొకో 6-4, 6-2తో లోరెంజో ముసెట్టి (ఇటలీ)పై సునాయాసంగా గెలిచాడు. జొకోకిది తొలి ఫైనల్ కావడం విశేషం. మరోవైపు మూడు వారాల క్రితమే వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ కోసం జొకో-అల్కారజ్ పోటీపడిన విషయం తెలిసిందే. ఆ ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలని వెటరన్ జొకో ఎదురుచూస్తున్నాడు. గతంలో వీరు ఆరు సార్లు తలపడగా 3-3తో సమంగా ఉన్నారు.

జెంగ్ క్విన్‌వెన్‌కు స్వర్ణం

మహిళల సింగిల్స్ ఫైనల్లో చైనాకు చెందిన ఆరో సీడ్ జెంగ్ క్విన్‌వెన్ స్వర్ణం సాధించింది. శనివారం గంటా 45 నిమిషాటు జరిగిన ఫైనల్లో జెంగ్ 6-2, 6-3తో వెకిక్ డొన్నా (క్రొయేషియా)ను ఓడించింది.

విడిపోయారు.. విజయంతో కలిశారు!



పారిస్: వాళ్లిద్దరూ మూడేళ్లపాటు కలిసి తిరిగారు.. అందమైన ప్రేమపక్షులని అనిపించుకున్నారు.. ఏమైందో ఏమో కానీ.. సరిగ్గా పారిస్ ఒలింపిక్స్ ఆరంభానికి వారం రోజుల ముందు విడిపోతున్నట్టు ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. కానీ, దేశం కోసం విశ్వక్రీడల్లో కలిసి ఆడారు.. ఏకంగా చాంపియన్లుగా నిలిచారు. వాళ్లే చెక్ రిపబ్లిక్‌కు చెందిన టెన్నిస్ స్టార్లు కేటరీనా సినియకోవా, టొమాస్ మచాక్. వీళ్లిద్దరూ పారిస్‌లో టెన్నిస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో కలిసి బరిలోకి దిగారు. ఫైనల్లో ఈ జోడీ 6-2, 5-7, 10-8తో చైనా జంట వాంగ్ గ్జిన్యూ-జాంగ్ జిజెన్‌ను ఓడించి స్వర్ణ పతకం సాధించారు. గెలిచిన ఆనందంలో ఇద్దరూ కోర్టులోనే హగ్ చేసుకున్నారు.. ముద్దులు కూడా పెట్టుకున్నారు. దీంతో.. 'మీరిద్దరూ ఇంకా ప్రేమికులేనా!' అని విజయానంతరం పాత్రికేయులు అడిగారు. ఇందుకు.. 'అది మా వ్యక్తిగతం. మీకు చెప్పాల్సిన పని లేదు' అని సినియకోవా పేర్కొనగా.. మచాక్ మాత్రం 'అది టాప్ సీక్రెట్' అని నవ్వుతూ బదులివ్వడం విశేషం. దీంతో విడిపోయిన ప్రేమపక్షులు విజయంతో మళ్లీ కలిశారన్న కామెంట్లు వినిపిస్తున్నాయి.

మూడో డోపీ దొరికాడు



పారిస్: ఒలింపిక్స్‌లో మూడో డోపింగ్ కేసు బయటపడింది. అఫ్ఘానిస్థాన్ జుడోకా మహ్మద్ సమీమ్ ఫైజాద్ డోపీగా తేలాడు. 81 కిలోల విభాగంలో తొలి బౌట్‌కు ముందు అతడి నుంచి సేకరించిన శాంపిల్‌లో నిషేధిత ఉత్ప్రేరకాలున్నట్టు నాడా ప్రకటించింది. 1988 సియోల్ ఒలింపిక్స్‌లో స్ప్రింటర్ బెన్ జాన్సన్ వాడినట్టు తేలిన స్టానోజొలోల్ అవశేషాలను గుర్తించినట్టు పేర్కొంది. వెంటనే అతడిని ఒలింపిక్స్ నుంచి బహిష్కరించారు.



కోచింగ్‌కు గుడ్‌బై

సాత్విక్-చిరాగ్ కోచ్ మథియాస్

పారిస్: డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి కోచ్ మథియాస్ బో కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. భారీ అంచనాలతో ఒలింపిక్స్ బరిలోకి దిగిన సాత్విక్ జోడీ క్వార్టర్స్‌లోనే వెనుదిరిగి తీవ్రంగా నిరాశపర్చింది. ఈ క్రమంలో కోచింగ్‌ను వదిలేస్తున్నట్టు మథియాస్ శనివారం సోషల్ మీడియాలో ప్రకటించాడు. 'నా కోచింగ్ రోజులు ముగిశాయి. కోచ్‌గా ఉండడం ఒత్తిడితో కూడుకున్నది. ఎంతో అలసిపోయాన'ని 44 ఏళ్ల మథియాస్ పోస్టు చేశాడు. లండన్ ఒలింపిక్స్ రజత పతక విజేత అయిన బో.. టోక్యో క్రీడల ముందు సాత్విక్-చిరాగ్ కోచ్‌గా బాధ్యతలు అందుకొన్నాడు. డెన్మార్క్‌కు చెందిన మథియాస్ బో.. బాలీవుడ్ నటి తాప్సీని వివాహం చేసుకొన్నాడు.

ఆదివారం

సండే సెలబ్రిటీ



మెగా కుటుంబం నుంచి నటిగా సినిమా రంగంలోకి ప్రవేశించిన నిహారిక కొణిదెల... 'కమిటీ కుర్రాళ్లు'తో నిర్మాతగా మారారు. ఈ సందర్భంగా తాను చేస్తున్న ప్రాజెక్టులు... వ్యక్తిగత జీవిత విశేషాలను 'నవ్య'తో పంచుకున్నారు.

వదిన కోసం మేము మారాం

నిర్మాతగా...

నేను ఇంతకుముందు ఓటీటీ కోసం కొన్ని సీరియల్స్ నిర్మించాను. వాటికి ఎంత శ్రమపడ్డామో, 'కమిటీ కుర్రాళ్లు' చిత్రానికి కూడా అంతే శ్రమపడ్డాం. బడ్జెట్స్‌లో మార్పు వచ్చి ఉండచ్చు. కానీ వర్క్‌పరంగా పెద్ద తేడా ఏమీ లేదు. నాకు చాలా మంచి టీమ్ దొరికింది. షూటింగ్‌కు వెళ్లకపోయినా ఏం తీశారో సాయంత్రానికి ఫుటేజ్ వచ్చేస్తుంది. ఇక నటన విషయానికివస్తే... తమిళంలో ఒక సినిమా చేస్తున్నా. తెలుగులో ఒక సినిమా ఈ ఏడాది చివర్లో ప్రారంభమవుతుంది.

24 క్రాఫ్ట్స్‌లో...

నాకు ప్రొడక్షన్, యాక్టింగ్‌తో పాటు ఎడిటింగ్ అంటే చాలా ఇష్టం. ఎందుకంటే.. ఒక సినిమా హిట్ అవ్వాలన్నా, ఫ్లాప్ కావాలన్నా.. ఎడిటింగ్ ప్రముఖమైన పాత్ర పోషిస్తుందని నేను నమ్ముతాను. ఎడిటర్స్ అంటే నాకు చాలా గౌరవం ఉంది.

నటిగా నేర్చుకున్నది...

ఏకాగ్రతతో పని చేయాలని ఒక నటిగా నేర్చుకున్నా. మనకు ఫోకస్ ఉంటే.. నచ్చిన విషయాన్ని పొందగలుగుతాం. ఉదాహరణకు నేను ఇప్పటికీ వర్క్‌షాప్‌లకు వెళ్లి నటించటం ఎలాగో, మాట్లాడటం ఎలాగో తెలుసుకుంటూ ఉంటా. స్క్రిప్టుల విషయంలో నేను చేసేది ఏంలేదు. నా నటన చూసి 'ఈ అమ్మాయి బాగా చేస్తోంది. మనం ఒక పాత్ర రాయాలి' అని రైటర్స్ అనుకోవాలి. వాళ్లు అలా అనుకోవాలంటే... నేను బాగా నటించాలి.

> **బయట తినను**
>
> నేను ఎక్కువగా ఇంట్లో అమ్మ వండినవే తింటాను. బయట తినను. పప్పుచారు, చికెన్ అంటే నాకు చాలా ఇష్టం. కొన్నిసార్లు వంట నేనే చేస్తుంటాను.

క్లిష్టమైన సమయం...

'కమిటీ కుర్రాళ్లు' ప్రారంభించినప్పుడు ఎవ్వరూ మమ్మల్ని నమ్మలేదు. 11 మంది కొత్త వాళ్లతో సినిమా చేస్తున్నానంటే.. నమ్మలేనట్లు చూసేవారు. టీజర్, ట్రైలర్ రిలీజ్ అయిన తర్వాత మమ్మల్ని నమ్మడం మొదలుపెట్టారు. ఇప్పుడు చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. నాకే కాదు.. ఎవరికైనా ఇతరులను నమ్మించటానికి చాలా సమయం పడుతుంది.

ఎమోషనల్ పర్సన్‌ని...

నేను చాలా ఎమోషనల్ పర్సన్‌ని. కానీ నా ఎమోషన్స్ బయటకు కనపడనివ్వను. ఇక నాకు ఎమోషనల్ సపోర్టు అంటే మా నాన్నే. చాలా మంది నమ్మకపోవచ్చు కానీ.. నాన్న (నాగబాబు) తన విషయంలో ఎమోషనల్‌గా ఉండరు. తాను ప్రేమించేవాళ్లను ఏదైనా అంటే ఊరుకోరు. నేనూ అంతే. నాన్న తన ఎమోషన్స్‌ను పక్కనపెట్టి నాకు మద్దతు ఇచ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

ఆ విధంగా...

సోషల్ మీడియా ద్వారా మన వ్యక్తిగత జీవితంలోకి దూసుకువచ్చేస్తారు. ఇప్పటిదాకా నా మీద అంత ఘోరమైన ట్రోల్స్ రాలేదనుకోండి. ఈ విషయంలో నేను అదృష్టవంతురాలినే. నా దృష్టిలో సోషల్ మీడియాకు రెండు పార్శ్వాలు ఉన్నాయి. ఒక పార్శ్వం... చాలా మంచిది. మనకు ఎంతో ఉపకరిస్తుంది. దాన్ని తగినట్లుగా వాడుకోవాలి. ఇక్కడ ఇంకో విషయం చెప్పాలి. నేను ఎప్పుడూ కామెంట్స్ సెక్షన్ చూడను. ఎందుకంటే దానిలో విపరీతమైన నెగిటివిటీ ఉండొచ్చు.

> **అతి ముఖ్యమైనది...**
>
> ఈతరం అమ్మాయిలకు గౌరవం చాలా ముఖ్యం. కొందరు అమ్మాయిలను అలుసుగా తీసుకుంటారు. నా ఉద్దేశంలో చదువును బట్టి జ్ఞానం రాదు. మన ఇంట్లో ఉన్న ఆడవాళ్లను గౌరవించేవాళ్లు... ఎవరినైనా గౌరవించగలరు. తల్లితండ్రులు తమ పిల్లలకు ఈ తరహా సంస్కృతిని నేర్పాలి.

వెంటాడే భయం...

నేను ప్రేమించే వ్యక్తులు దూరమవుతారనేది నన్ను ఎక్కువగా భయపెడుతుంది. ఇక నాకు బల్లులంటే విపరీతమైన భయం.

సర్దుకుపోవాలి...

కొత్త వ్యక్తులు ఇంటికి వచ్చినప్పుడు మనం సర్దుకుపోవాలి. వాళ్లను మన జీవితాల్లోకి ఆహ్వానించాలి. వదిన (లావణ్య త్రిపాఠి) మా ఇంటికి వచ్చినప్పుడు మేము ఆహ్వానించాం. తను చాలా కాలంగా హైదరాబాద్‌లోనే ఉంది. కానీ ఉత్తరాది అమ్మాయి కావడంతో తన అలవాట్లు భిన్నంగా ఉండేవి. వాటికి అనుగుణంగా మేము మార్పులు చేసుకున్నాం. నా ఉద్దేశంలో కొత్త వ్యక్తి మనింటికి వచ్చినప్పుడు రెండు అడుగులు వెనక్కి వేస్తే తప్పేంలేదు. నేను, వదినా మంచి ఫ్రెండ్స్. గంటల తరబడి మాట్లాడుకుంటాం.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ది ఇన్‌ఫ్లూయన్సర్	కొరియన్ సిరీస్	ఆగస్టు 06
సీక్రెట్ వరల్డ్ ఆఫ్ సౌండ్	వెబ్‌సిరీస్	ఆగస్టు 07
ది అంబరిల్లా అకాడమీ 4	వెబ్‌సిరీస్	ఆగస్టు 08
ఇన్‌సైడ్ ది మైండ్ ఆఫ్ ఏ డాగ్	హాలీవుడ్ మూవీ	ఆగస్టు 09
మిషన్ క్రాస్	కొరియన్ మూవీ	ఆగస్టు 09
రొమాన్స్ ఇన్ ది హౌస్	కొరియన్ సిరీస్	ఆగస్టు 10
సోనీ లివ్		
టర్బో	మలయాళ చిత్రం	ఆగస్టు 09
జియో సినిమా		
ది కలర్ పర్పుల్	హాలీవుడ్ మూవీ	ఆగస్టు 08
ఘుడ్‌చఢీ	హిందీ చిత్రం	ఆగస్టు 09
దస్ జూనేకీ రాత్	హిందీ చిత్రం	ఆగస్టు 09
లీసా ఫ్రాంకెన్‌స్టైన్	హాలీవుడ్ మూవీ	ఆగస్టు 09
లయన్స్ గేట్ ప్లే		
జాంగో	వెబ్‌సిరీస్	ఆగస్టు 09
జీ 5		
గ్యారా గ్యారా	హిందీ సిరీస్	ఆగస్టు 09
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
ది జోన్ 3	కొరియన్ సిరీస్	ఆగస్టు 07
లైఫ్ హిల్ గయీ	హిందీ సిరీస్	ఆగస్టు 09
ఫిర్ ఆయీ హసీన్ దిల్‌రుబా	హిందీ చిత్రం	ఆగస్టు 09
ఆహా...		
తెప్ప సముద్రం	తెలుగు చిత్రం	ఆగస్టు 03



అలనాటి కథ

అందమైన జ్ఞాపకం

కొన్ని వస్తువులను మనం అపురూపంగా దాచుకొంటాం. ఎందుకంటే వాటితో మన అందమైన జ్ఞాపకాలు ముడిపడి ఉంటాయి. నచ్చిన కవిత్వపు పుస్తకం మధ్యలో దాచుకున్న పువ్వులు కావచ్చు.. వచ్చిన తొలి ప్రేమ లేఖ కావచ్చు... నాకున్న అలాంటి ఒక జ్ఞాపకం డైమండ్ రూబీ బ్రేస్‌లెట్. 70 ఏళ్ల క్రితం నాటి అందమైన జ్ఞాపకం అది. ఈ జ్ఞాపకాన్ని మీ అందరితోనూ పంచుకోవటానికి ఒక కారణముంది. రాజ కుటుంబాలలో పెరిగిన అమ్మాయిలకు భావ స్వేచ్ఛ ఉండదని, కేవలం తల్లితండ్రుల ఆజ్ఞను అనుసరించే జీవిస్తారని భావిస్తూ ఉంటారు. కానీ అందరి విషయంలోనూ అది నిజం కాదు. నాకు తెలిసిన రాజ కుటుంబాలలోని అమ్మాయిలను వారి తల్లితండ్రులు చాలా స్వేచ్ఛగా పెంచేవారు. అదే సమయంలో ఆ అమ్మాయిలు కూడా తల్లితండ్రుల మాట జవదాటేవారు కారు. అలాంటి ఒక అనుభవాన్ని మీతో పంచుకుంటున్నా. ఈ కథలో ఇతరుల పేర్లు మాత్రం చెప్పను. ఎందుకంటే వారి కుటుంబ సభ్యులు నొచ్చుకోవచ్చు. ఇక కథలోకి వెళ్తే... మనకు స్వాతంత్ర్యం వచ్చిన తొలి రోజులు. ఒక పెద్ద సంస్థానానికి ఒక యువరాజు ఉండేవారు. ఆరు అడుగుల అందగాడు. ఆయనను నేను చూసింది రెండుసార్లే. అది కూడా పార్టీల్లో... దూరంగా. అలాంటి వ్యక్తి హఠాత్తుగా 'రేపు సాలార్‌జంగ్ మ్యూజియంకు వస్తావా' అని అడిగేటప్పటికి ఏం చెప్పాలో అర్థం కాలేదు నాకు. 'నాన్నగారిని అడిగి చెబుతా' అన్నా. నాన్నను అడిగితే వెళ్లమన్నారు. నేను 'వస్తాను' అని చెప్పే లోపే... 'ఉదయం పది గంటలకు మీ మహల్‌కు వస్తా' అని యువరాజు వెళ్లిపోయారు. మర్నాడు చెప్పిన సమయానికే యువరాజు వచ్చారు. నేను ఆయన కారు ఎక్కా. మ్యూజియంకు వెళ్లేసరికి కమిటీ సభ్యులందరూ మాకు ఆహ్వానం పలికారు. మధ్యాహ్నం ఆయన నన్ను జ్ఞాన్‌బాగ్‌లో వదిలి వెళ్లిపోయారు. సాయంత్రం రాజ ముద్రతో నాకో ఉత్తరం వచ్చింది... 'రాజకుమారి సాహెబా.. నాకు మ్యూజియం చూపించినందుకు థాంక్యూ. మళ్లీ బొంబాయిలో కలుద్దాం' అని!

నాకు తెలిసిన రాజ మర్యాదల ప్రకారం... ఏదైనా ఉత్తరం వస్తే దానికి తప్పనిసరిగా సమాధానం ఇవ్వాలి. 'తప్పకుండా కలుద్దాం. నేను వేచి చూస్తున్నా' అని సమాధానమిచ్చా. ఆ తర్వాతి వారం మేమందరం బొంబాయి వెళ్లాం. నేపాల్ మహారాజు త్రిభువన్ తన కుటుంబంతో కలిసి తొలిసారి భారత్‌కు వచ్చారు. మా ప్యాలెస్‌లోనే ఆయనకు విడిది ఏర్పాటు చేశాం. అదే రోజు సౌదీ అరేబియా యువరాజు ప్రిన్స్ ఫైజల్ కూడా డిన్నర్‌కు వచ్చారు. ఆ సమయంలో నాకు యువరాజు నుంచి ఫోన్ వచ్చింది. 'డిన్నర్‌కు వెళ్దామా' అని! 'నేను డేటింగ్‌కు వెళ్లటానికి నాన్న ఒప్పుకోరు' అన్నా. 'సరే.. నేనే వస్తా' అన్నారు. నాన్న దగ్గరకు వెళ్లి 'యువరాజు డిన్నర్‌కు వస్తానన్నారు' అని చెప్పా. నాన్న వెంటనే తన సెక్రటరీతో యువరాజుకు ఫోన్ చేయించారు. కానీ యువరాజు తనకు వేరే అపాయింట్‌మెంట్ ఉందని డిన్నర్‌కు రాలేదు.

ఆ మర్నాడు నా జుట్టు సరి చేయించుకోవటానికి తాజ్ హోటల్‌కు వెళ్లా. సెలూన్ నుంచి బయటకు వస్తుంటే యువరాజు ఎదురుపడ్డారు. 'ఒక్కసారి నా స్వీట్ (రూమ్)కు వస్తావా?' అని అడిగారు. ఏం చెప్పాలో అర్థం కాలేదు. కాళ్లు, చేతులు వణుకుతున్నాయి. అయోమయ స్థితిలో నేను, నా గవర్నెస్.. యువరాజుతో రాజ్‌పుత్ స్వీట్‌కు వెళ్లాం. అక్కడ కొద్దిసేపు మాట్లాడిన తర్వాత యువరాజు మా గవర్నెస్‌ను బయటకు వెళ్లమన్నారు. నాకు భయం వేసింది. యువరాజు తన పర్స్ తీసి, దానిలో ఉన్న నా ఫోటో చూపించారు. అంతే... వెంటనే బ్యాగ్ తీసుకొని బయటకు పరిగెత్తుకుంటూ వచ్చేశాను. ఆ రోజు రాత్రి ఇంట్లో పార్టీ జరుగుతోంది. మా గవర్నెస్ ఒక పార్సిల్ ఇచ్చింది. ఆ పార్సిల్ ఇప్పి చూశాను. దాంట్లో అందమైన డైమండ్, రూబీలతో చేసిన బ్రేస్‌లెట్ ఉంది. దాన్ని నాన్నకు చూపించాను. 'ఏం చేయను' అని అడిగాను. 'నచ్చితే ఉంచుకో' అన్నారు. తన కూతురును దేశంలో ఒక పెద్ద సంస్థానానికి చెందిన యువరాజు ప్రపోజ్ చేశాడనే ఆనందం నాన్న కళ్లలో కనబడింది. అది ధరించి పార్టీకి వెళ్లా. యువరాజు కూడా వచ్చారు. 'ధరించినందుకు థాంక్స్' అన్నారు. తర్వాత పెళ్లికి అందరూ అంగీకరించారు. ఆ సమయంలో మా నాయనమ్మ హఠాత్తుగా జబ్బు పడింది. మరణానికి చేరువయింది. ఆ సమయంలో తను నన్ను పిలిచి.. 'కుటుంబాన్ని చూసుకోవాలి. నువ్వు ఎక్కడికీ వెళ్లకు' అని కోరింది. కాదనలేకపోయా.

ఆ తర్వాతి జీవితం వేరే కథ!



• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

బిజినెస్



ఫండ్స్‌లోకి నారీమనీ

మొత్తం మదుపరుల్లో 30% వారే

పెట్టుబడులపరంగా చూసినా 35% మహిళలవే

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోనూ అదే ట్రెండ్

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ నివేదిక వెల్లడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పెట్టుబడుల సరళి మారిపోతోంది. గతంలోలా మహిళలు నాలుగు డబ్బులు చేతిలో ఉంటే నగనట్రా కొనుగోళ్లకే పరిమితం కావడం లేదు. మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) పథకాల్లోనూ పెద్దఎత్తున మదుపు చేస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఇదే ట్రెండ్ కనిపిస్తోంది. గత ఐదేళ్ల (2019 మార్చి-2023 డిసెంబరు) కాలంలో ఎంఎఫ్ పథకాల్లో మదుపు చేసే మహిళల సంఖ్య ఆంధ్రప్రదేశ్‌లో 4.7 రెట్లు, తెలంగాణలో 3.1 రెట్లు పెరిగింది. పెట్టుబడులపరంగా చూస్తే గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లోని మహిళల ఎంఎఫ్ పెట్టుబడులు 4.1 రెట్లు, తెలంగాణలోని మహిళల పెట్టుబడులు 3 రెట్లు పెరిగాయి. 'యాక్సిస్ మ్యూచువల్ ఫండ్' సంస్థ రూపొందించిన ఒక నివేదిక ఈ విషయం తెలిపింది. 'విమెన్ ఇన్వెస్ట్‌మెంట్ బిహేవియర్ రిపోర్ట్, 2024' పేరుతో ఆ సంస్థ ఈ నివేదికను విడుదల చేసింది. 2019 మార్చి-2023 డిసెంబరు మధ్య కాలంలో తన పథకాల్లో మదుపు చేసిన కోటి మంది మదుపరుల డేటా ఆధారంగా యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ ఈ రిపోర్టును రూపొందించింది.

నిర్ణయాలు సొంతంగానే: ఎంఎఫ్ పథకాల్లో పెట్టుబడుల విషయానికి వస్తే 72 శాతం మంది మహిళలు సొంతంగానే తుది నిర్ణయాలు తీసుకుంటున్నారు. యువతుల్లో ఈ ట్రెండ్ మరింత ఎక్కువగా కనిపిస్తోంది. 25-34 ఏళ్ల మధ్య వయస్కులైన యువతుల్లో 75 శాతం, 35-44 ఏళ్ల మధ్య వయస్కుల్లో 70 శాతం మంది సొంతంగానే మ్యూచువల్ ఫండ్ పథకాల్లో పెట్టుబడుల నిర్ణయాలు తీసుకుంటున్నారు. అప్పుడప్పుడు పెట్టుబడుల నిపుణులు, కుటుంబసభ్యులు లేదా స్నేహితులను సంప్రదించినా.. తుది నిర్ణయం మాత్రం మహిళలదేనని నివేదిక తెలిపింది. గత ఏడాది డిసెంబరు నాటికి తమ మొత్తం మదుపరుల్లో 30 శాతం, పెట్టుబడుల్లో 35 శాతం నారీమణులదని పేర్కొంది.

దీర్ఘకాలిక లక్ష్యాలతోనే: మ్యూచువల్ ఫండ్ పథకాల్లో మదుపు చేసే మహిళల్లో ఎక్కువ మంది దీర్ఘకాలిక లక్ష్యాలతోనే మదుపు చేస్తున్నారు. పిల్లల చదువులు, పెళ్లిళ్ల ఖర్చులు ఇందులో ముఖ్యమైనవి. దీంతో గత ఐదేళ్లలో ఎంఎఫ్ పథకాల్లో మదుపు చేసే ఒక్కో మహిళ పెట్టుబడులు సగటున 25 శాతం పెరిగాయి. పురుషులతో పోల్చినా వీరి సగటు పెట్టుబడుల మొత్తం 37 శాతం అధికంగా ఉన్నట్టు నివేదిక తెలిపింది. గత ఐదేళ్లలో యాక్సిస్ ఎంఎఫ్‌కు చెందిన 22 లక్షల మంది మహిళా ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులపై సగటున రూ.80,000 వరకు లాభాలు ఆర్జించినట్టు పేర్కొంది.

డిజిటల్ రెడీ: ప్రస్తుతం చాలా మంది మహిళల చేతుల్లో స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. దీంతో డిజిటల్ లావాదేవీల్లోనూ వారు ఆరితేరిపోయారు. ఏదైనా మంచి ఎంఎఫ్ పథకం గురించి తెలిస్తే తమ ల్యాప్‌ట్యాప్ లేదా స్మార్ట్‌ఫోన్ ద్వారా చెల్లింపులు చేసి, ఆ పథకాల్లో మదుపు చేస్తున్నారు. ఐదేళ్ల క్రితం కేవలం 14 శాతం మంది మహిళలు మాత్రమే, డిజిటల్ సాధనాల ద్వారా ఎంఎఫ్ పథకాల్లో మదుపు చేసేవారు. గత ఏడాది చివరికి ఇది 55 శాతానికి చేరినట్టు యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ నివేదిక వెల్లడించింది.

పసిడి బాండ్ల హోల్డర్లకు 122% రిటర్నులు

రిడంప్షన్ ధర గ్రాముకు రూ.6,938గా నిర్ణయం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తరఫున భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) 2016 ఆగస్టులో జారీ చేసిన పసిడి బాండ్లలో పెట్టుబడి పెట్టిన వారికి లాభాల పంట పడింది. ఆర్‌బీఐ ఈ బాండ్లను యూనిట్ (గ్రాము)కు రూ.3,119 చొప్పున జారీ చేసింది. ఈ బాండ్ల 8 ఏళ్ల కాలపరిమితి ఈ నెల 5తో ముగియనుంది. ఈ సందర్భంగా ఆర్‌బీఐ ఈ విడత బాండ్ల రిడంప్షన్ రేటును గ్రాముకు రూ.6,938గా నిర్ణయించింది. అంటే, ఒక్కో గ్రాముపై 122 శాతం రిటర్ను లభించనుందని ఆర్‌బీఐ తన నోటిఫికేషన్‌లో పేర్కొంది.

ఎస్‌బీఐ లాభం రూ.19,325 కోట్లు



రూ.1,22,688 కోట్లకు మొత్తం ఆదాయం .. 2024-25లో రూ.25,000 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి (క్యూ1) భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 4.25 శాతం వృద్ధితో రూ.19,325 కోట్లకు చేరుకుంది. స్టాండ్‌ఎలోన్ లాభం మాత్రం కేవలం 0.9 శాతం వృద్ధితో రూ.17,035 కోట్లకు పరిమితమైంది. బ్యాంక్ నికర వడ్డీ మార్జిన్, ఇతర ఆదాయం తగ్గడంతో పాటు మొండి బాకీల నష్టాలను పూడ్చుకునేందుకు కేటాయింపులు పెరగడం లాభాల వృద్ధిని పరిమితం చేసింది. కాగా, ఈ క్యూ1లో ఎస్‌బీఐ స్టాండ్‌ఎలోన్ ఆదాయం రూ.1,22,688 కోట్లకు పెరిగింది. అందులో వడ్డీ ఆదాయం రూ.1,11,526 కోట్లుగా ఉంది. మరిన్ని ముఖ్యాంశాలు..


- ఈ ఏప్రిల్-జూన్ కాలానికి బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) వార్షిక ప్రాతిపదికన 5.71 శాతం వృద్ధితో రూ.41,125 కోట్లకు చేరుకుంది.
- నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) మాత్రం 0.11 శాతం తగ్గి 3.22 శాతానికి పరిమితమైంది. క్రితం సంవత్సరంలో ఇదే కాలానికి ఎన్ఐఎం 3.33 శాతంగా నమోదైంది.
- 2023 జూన్ 30 నాటికి 2.76 శాతంగా (రూ.91,327.84 కోట్లు) ఉన్న బ్యాంక్ మొండి బకాయిలు లేదా స్థూల నిరర్థక ఆస్తులు (గ్రాస్ ఎన్‌పీఏ).. ఈ ఏడాది జూన్ చివరి నాటికి 2.21 శాతానికి (రూ.84,226.04 కోట్లు) తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 0.71 శాతం (రూ.22,995.37 కోట్లు) నుంచి 0.57 శాతానికి (రూ.21,554.69 కోట్లు) దిగివచ్చాయి.
- మొండి బకాయిల నష్టాలను పూడ్చుకునేందుకు బ్యాంక్ రూ.4,580 కోట్ల కేటాయింపులు జరిపింది. క్రితం ఏడాదిలో జూన్ త్రైమాసికానికి జరిపిన రూ.2,488 కోట్ల కేటాయింపులతో పోలిస్తే 70 శాతం అధికమిది. కాగా, ఈ జూన్ చివరినాటికి కేటాయింపుల కవరేజీ నిష్పత్తి (పీసీఆర్) మాత్రం 91.76 శాతానికి పెరిగింది.
- ఈ ఏప్రిల్-జూన్ కాలంలో కొత్తగా రూ.7,903 కోట్ల రుణాలు మొండిపద్దుల్లోకి మళ్లాయి. అందులో రూ.1,600 కోట్లు ఇప్పటికే వసూలైనట్లు ఎస్‌బీఐ ఛైర్మన్ దినేశ్ ఖారా వెల్లడించారు.
- గత త్రైమాసికంలో బ్యాంక్ స్థూల రుణాలు 15.39 శాతం వార్షిక వృద్ధితో రూ.38.12 లక్షల కోట్లకు చేరుకోగా.. మొత్తం డిపాజిట్లు 8.18 శాతం పెరుగుదలతో రూ.49.02 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2024-25 మొత్తానికి రుణ వృద్ధి 15 శాతంగా నమోదు కావచ్చని బ్యాంక్ భావిస్తోంది.
- బాసెల్-3 ప్రమాణాలకు అనుగుణంగా అదనపు టైర్ 1, టైర్ 2 బాండ్ల జారీ ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.25,000 కోట్ల నిధుల సమీకరణకు ఎస్‌బీఐ బోర్డు ఆమోదం తెలిపింది. దేశీయ, విదేశీ ఇన్వెస్టర్లకు ఈ బాండ్ల జారీ ద్వారా దేశీయ కరెన్సీతోపాటు డాలర్లలో నిధులను సమీకరించనుంది. ఈ ప్రతిపాదనకు కేంద్రం అనుమతి కూడా అవసరమని పేర్కొంది.

ఖారా హయాంలో రూ.1.63 లక్షల కోట్ల లాభం

బ్యాంక్ షేరు ధర ఇంకా తక్కువేనన్న ఎస్‌బీఐ ఛైర్మన్




గడిచిన కొన్నేళ్లలో బ్యాంక్ లాభం భారీగా పుంజుకుందని ఎస్‌బీఐ ఛైర్మన్ దినేశ్ ఖారా అన్నారు. ఛైర్మన్‌గా తన హయాంలోని నాలుగేళ్లలో బ్యాంక్ మొత్తం రూ.1.63 లక్షల కోట్ల లాభం గడించిందని.. అంతక్రితం 64 ఏళ్లలో ఆర్జించిన రూ.1.45 లక్షల కోట్ల లాభం కంటే అధికమని ఫలితాల విడుదల సందర్భంగా ఖారా మీడియాకు వెల్లడించారు. తను ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినప్పుడు బ్యాంక్ లాభం రూ.14,000 కోట్ల స్థాయిలో ఉండగా.. ఇప్పుడది రూ.17,000 కోట్లు దాటిందన్నారు. అంతేకాదు, 22,000కు పైగా శాఖలతో పాటు భారీగా నిల్వలు, వైవిధ్యభరితమైన ఉత్పత్తులను కలిగి ఉన్నప్పటికీ బ్యాంక్ షేరుకు సరైన విలువ మాత్రం లభించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఖారా పదవీ కాలం ఈ నెలలోనే ముగియనుంది. ఆయన స్థానాన్ని తెలంగాణకు చెందిన చల్లా శ్రీనివాసులు శెట్టి భర్తీ చేయనున్నారు. శెట్టి ప్రస్తుతం ఎస్‌బీఐలో ఎండీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)


	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	70,580 ▼	64,700 ▼	90,900 ▼
ముంబై	70,392 ▲	64,479 ▲	83,501 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	450
వరంగల్	442	గోదావరి	440
చిత్తూరు	493	విశాఖపట్నం	450
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	80	విజయవాడ	92
వరంగల్	80	గుంటూరు	92
కరీంనగర్	80	ఒంగోలు	92
మహబూబ్‌నగర్	80	చిత్తూరు	106
కర్నూలు	80	నెల్లూరు	106
విశాఖపట్నం	86	అనంతపురం	92
గోదావరి	92		

అమర రాజా ఎనర్జీ ఆదాయం రూ.3,131 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ (ఎఆర్ఈ అండ్ ఎం).. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి గాను స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.244.55 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.198.65 కోట్లు)తో పోల్చితే లాభం 25 శాతం మేర వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం రెవెన్యూ కూడా 13 శాతం వృద్ధితో రూ.2,770.70 కోట్ల నుంచి రూ.3,131.19 కోట్లకు పెరిగింది. జూన్ త్రైమాసికంలో కంపెనీ నిలకడైన వృద్ధిని కనబరిచిందని, ఇందుకు సంస్థ రెవెన్యూ, లాభాలే నిదర్శనమని ఆటోమోటివ్ అండ్ ఇండస్ట్రియల్ బ్యాటరీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హర్షవర్ధన గౌరినేని అన్నారు. అంతేకాకుండా కంపెనీ అంతర్జాతీయ కార్యకలాపాలు కూడా మెరుగ్గా ఉండటం కలిసివచ్చిందని పేర్కొన్నారు. దేశీయంగా డిజైన్ చేసిన ఏజీఎం బ్యాటరీలకు మంచి స్పందన రావటంతో రానున్న నెలల్లో ఈ విభాగంలో గట్టి పట్టును చేజిక్కించుకోవాలని చూస్తున్నట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా ఉత్పత్తుల శ్రేణిని బలోపేతం చేయటంతో పాటు అంతర్జాతీయంగా స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకోవటంపై దృష్టిని కేంద్రీకరించనున్నట్లు హర్షవర్ధన పేర్కొన్నారు.

దివీస్ లాభంలో 21% వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో దివీస్ లేబొరేటరీస్ ప్రోత్సాహకర ఫలితాలు ప్రకటించింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి గాను కంపెనీ కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.2,197 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.430 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.356 కోట్లు)తో పోల్చితే లాభం 21 శాతం వృద్ధి చెందింది. కాగా గత ఏడాది ఇదే త్రైమాసికంలో మొత్తం ఆదాయం రూ.1,859 కోట్లుగా ఉంది.

10% పెరిగిన బీఓఐ లాభం

న్యూఢిల్లీ: జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికానికి బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) రూ.1,702.7 కోట్ల స్టాండ్‌ఎలోన్ నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.1,551 కోట్ల లాభంతో పోలిస్తే 10 శాతం వృద్ధి కనబర్చింది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం రూ.18,240 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 6.1 శాతం పెరుగుదలతో రూ.6,275.8 కోట్లుగా నమోదైంది. కాగా బ్యాంక్ మొండి బకాయిలు లేదా స్థూల నిరర్థక ఆస్తులు (గ్రాస్ ఎన్‌పీఏ) 4.62 శాతానికి తగ్గగా.. నికర ఎన్‌పీఏల నిష్పత్తి 0.99 శాతానికి జారుకుంది.

పులివెందులలో జగన్ బంధువుల భూ కబ్జా

- చంద్రబాబుకు బాధితురాలి ఫిర్యాదు

అమరావతి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి):మాజీ ముఖ్యమంత్రి జగన్ బంధువులు పులివెందులలో తమ భూమిని కబ్జా చేశారని బాధితురాలు కర్రెద్దుల విజయ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గ్రీవెన్స్ సందర్భంగా ఆమె సీఎంను కలిసి, న్యాయం చేయాలని కోరారు. జగన్ బంధువు మనోహర్ రెడ్డి, ఆయన అనుచరులు తమ ఐదెకరాల భూమిలో అక్రమంగా వాటర్ ట్యాంక్ నిర్మించారని, పొలం వద్దకు వెళ్తే తమను కొడుతున్నారని ఫిర్యాదు చేశారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అలాగే, తిరుపతిలో రూ.100 కోట్ల విలువైన పదెకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోందని తాము తిరుపతి మునిసిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, దానిపై చర్యలు తీసుకోవాలని శ్రీసాయి విష్ణు లే అవుట్ సంక్షేమ సంఘం ప్రతినిధులు చంద్రబాబుకు వినతి పత్రం ఇచ్చారు. కుండలు తయారు చేసి అమ్ముకొంటున్న తమ భూమిని వైసీపీ నేత వేమూరి ఆదాం ఆక్రమించాడని, అక్రమంగా తమపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పాడని ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం అబ్బూరు గ్రామ శాలివాహన కుల సంఘం నేతలు సీఎంకు ఫిర్యాదు చేశారు. పార్టీ కోసం పనిచేసిన వారికి నామినేటెడ్ పదవుల్లో చోటు కల్పించాలని కాకినాడ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి దంపతులు చంద్రబాబును కోరారు. అల్లూరి జిల్లా ఎటపాక మండలం నెల్లిపాక గ్రామానికి చెందిన రెండేళ్ల బాలిక కె.మోక్షితకాలేయ సమస్యతో బాధపడుతోందని, చికిత్సకు సాయం చేయాలని తల్లిదండ్రులు సీఎంకు విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్ వెళ్లి మరీ పెన్షన్ ఇచ్చారు



హైదరాబాద్‌లో డయాలసిస్ రోగికి పింఛను అందిస్తున్న ఉద్యోగి

జి.కొండూరు, ఆగస్టు 3: రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లోని లబ్ధిదారులకు కొండలు ఎక్కి వెళ్లి పింఛన్లు అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు.. వరదల్లోనూ అష్టకష్టాలు పడి లబ్ధిదారులకు పింఛన్లు ఇస్తున్నారు. తాజాగా ఎన్టీఆర్ జిల్లాలోని ఓ ఉద్యోగి రాష్ట్రం దాటి వెళ్లి మరీ పింఛను అందజేయడం విశేషం. జి.కొండూరు సచివాలయం-1 పరిధిలోని రేతినేని శ్రీనివాసరావు పింఛన్ లబ్ధిదారుడు. అతడు కిడ్నీ సమస్యతో హైదరాబాద్‌లోని శ్రీశ్రీ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నారు.ఈ విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి వై.బసవలింగేశ్వరరావు.. అగ్రికల్చరల్ అసిస్టెంట్ వేల్పూరి రాంబాబును హైదరాబాద్ పంపి పింఛను డబ్బు అందేలా చర్యలు తీసుకున్నారు.

ఇక.. ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ

- పేరు మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

అమరావతి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): హెల్త్ యూనివర్సిటీ పేరు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే యునివర్సిటీ పేరు మారుస్తూ ప్రభుత్వం అసెంబ్లీలో చట్టం చేసింది.



ప్రజాదర్బార్‌లో అర్జీలు తీసుకుంటున్న సీఎం చంద్రబాబు, అమరావతికి బంగారు గాజులు విరాళంగా ఇస్తున్న మాణిక్యమ్మ, ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరిస్తున్న టీడీపీ ఏపీ చీఫ్ పల్లా శ్రీనివాసరావు, సీఎంను కలిసిన ఎస్.ఆర్.ఎం చాన్స్‌లర్ పరివేందర్

మూడు గంటలు నిలబడే!

- గ్రీవెన్స్‌లో వినతులు స్వీకరించిన చంద్రబాబు
- వేల అర్జీదారులతో ఎన్టీఆర్ భవన్ కిటకిట
- విశాఖ ఉక్కు సమస్య పరిష్కారానికి చంద్రబాబు భరోసా
- బాబును చూసి కళ్లనీళ్లు పెట్టుకొన్న గోనె ప్రకాశరావు

అమరావతి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతిపత్రాలు ఇవ్వడానికి వేల సంఖ్యలో తరలివచ్చిన అర్జీదారులతో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం కిటకిటలాడింది. ప్రతి శనివారం ఆయన పార్టీ కార్యాలయానికి వస్తుండటంతో తమ సమస్యలు నేరుగా వివరించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి శనివారం భారీగా ప్రజానీకం తరలివచ్చారు. సీంకు విజ్ఞప్తులు ఇవ్వదల్చినవారు ముందుగా తమ పేర్లు నమోదు చేయించుకోడానికి పార్టీ కార్యాలయం ఒక టోల్ ఫ్రీ నెంబర్‌ను కూడా పెట్టింది. సుమారు 500 మంది ముందుగా ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోగా, వీరుగాక ఇంకా వేల సంఖ్యలో అప్పటికప్పుడు తరలివచ్చారు. కొంతమందిని పార్టీ కార్యాలయం లోపల కలిసిన చంద్రబాబు మిగిలిన వారి వద్దకు తానే వెళ్లి అందరి వద్దా వినతిపత్రాలు తీసుకున్నారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీఎం తిరిగి వెళ్లిపోయే సమయంలోనూ ఇంకా కొంతమంది ఉండిపోయి తోసుకుంటుండటంతో ఆయన కారు దిగి మళ్లీ వినతులు తీసుకున్నారు. వేల సంఖ్యలో ప్రజలు రావడంతో పార్టీ కార్యాలయంలో తోపులాట జరగకుండా చూడటం పోలీస్ అధికారులకు పెద్ద సమస్యగా మారింది. వీరందరినీ కలవడానికి చంద్రబాబు సుమారు మూడు గంటలపాటు నిలబడే ఉన్నారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస యాదవ్ కూడా ఉన్నారు. చంద్రబాబు వెళ్లిపోయిన తర్వాత మిగిలినవారి నుంచి ఆయన వినతులు స్వీకరించారు.

విశాఖ ఉక్కును ఆదుకోవాలని వినతి..

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ సమస్యపై దృష్టి పెడతానని చంద్రబాబు భరోసా ఇచ్చారు. ఫ్యాక్టరీ తీవ్ర ఆర్థిక సమస్యల్లో ఉందని, గతంలో చంద్రబాబు వల్లే కొంత ఊరట వచ్చిందని, ఇప్పుడు కూడా ఆదుకోవాలని కార్మిక సంఘ నేతలు చంద్రబాబును కలిసి విన్నవించారు. ఫ్యాక్టరీ చేయాల్సిన చెల్లింపులకు మూడేళ్ల మారటోరియం ఇప్పించాలని, ఎన్ఎండీసీ నుంచి ఆరు నెలలపాటు ఇనుప ఖనిజం అప్పుపై ఇప్పించాలని ఆ ప్రాంత ఎమ్మెల్యే కూడా అయిన పల్లా శ్రీనివాసరావు సీఎంను కోరారు. దీంతో ప్లాంట్ యాజమాన్యాన్ని పిలిపించి సమీక్ష జరిపి ఏం చేయాలో చూస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. 'కేంద్రం కూడా అడిగినంత ఇవ్వలేదు. వాళ్లకూ కొన్ని పరిమితులున్నాయి. ఆ పరిమితుల్లో ఏం చేయగలరో ప్రయత్నిద్దాం. మీరు కూడా కర్మాగారాన్ని నిలబెట్టడానికి బాగా పనిచేయండి.' అని చంద్రబాబు సూచించారు. చంద్రబాబును కలవడానికి సీపీఎం, బీజేపీ నేతలు విడివిడిగా వచ్చారు. సీపీఎం బృందంలో విశాఖ నేత నర్సింగరావు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు, అంగన్‌వాడీ వర్కర్ల సంఘం నేత ధనలక్ష్మి తదితరులున్నారు. భవన నిర్మాణ, ఇతర వృత్తుల కార్మికుల సమస్యలపై వారు వినతిపత్రం సమర్పించారు. బీజేపీ రాష్ట్ర సమన్వయకర్త కోట వీరబాబు చంద్రబాబును కలిసి కొన్ని సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు.

తెలంగాణ నుంచి..

తెలంగాణకు చెందిన మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశరావు మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో చంద్రబాబును కలిశారు. చంద్రబాబును చూడగానే ఆయన కళ్లనీళ్లు పెట్టుకున్నారు. ఇటీవల యాక్సిడెంట్ అయిందని, నడుం నొప్పితో నరకం అనుభవిస్తున్నానని, వచ్చే పరిస్థితి లేకపోయినా ఒక విషయం విడిగా మాట్లాడాలని వచ్చానని ఆయన చంద్రబాబుకు చెప్పారు. ఆప్యాయంగా ఆయన ఆరోగ్య పరిస్థితులను చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. తెలంగాణలోని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ కూడా చంద్రబాబును కలిసేందుకు వచ్చారు. తొలుత టీడీపీలో ఉన్న జైపాల్ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు.

అమరావతికి దివ్యాంగుడి 25 వేల విరాళం..

పక్కనున్నవారు పట్టుకోకుండా నడవడం సాధ్యం కాని దివ్యాంగుడు జీవన్ కుమార్ టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసి అమరావతి కోసం రూ.25 వేలు విరాళం ఇచ్చారు. ఆయనది చంద్రగిరి నియోజకవర్గం పెరుమాళ్ళపల్లి గ్రామం. ఎన్నికల్లో టీడీపీ గెలవాలని అతి కష్టంగానే కొండెక్కి దేవుడిని ప్రార్థించానని జీవన్ కుమార్ చెప్పగా, చంద్రబాబు అభినందించారు. పలువురు దాతలు రాజధానికి, అన్న క్యాంటీన్లకు విరాళాలు ఇచ్చారు. రాజధాని కోసం కృష్ణా జిల్లా కంకిపాడు రైతు ఎస్.ప్రభాకరరావు రూ.10 లక్షలు, విజయవాడకు చెందిన వృద్ధురాలు జీవీ మాణిక్యమ్మ తన చేతి బంగారు గాజులు, భగవద్గీత గ్రూప్ తరఫున నిర్మల అనే వృద్ధురాలు రూ.3.42 లక్షలు, చిత్తూరుకు చెందిన వల్లేరు వెంకటేశ్ నాయుడు రూ.లక్ష విరాళం ఇచ్చారు.



అనాథగా మారిన బాలికకు అండ

- మిద్దె కూలిన ఘటనపై చంద్రబాబు విచారం
- రూ.10 లక్షల సాయం..

అమరావతి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మట్టి మిద్దె కూలి ఒకే కుటుంబంలో నలుగురు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం చిన్నవంగలి గ్రామంలో అర్ధరాత్రి మట్టి మిద్దె కూలడంతో ఆ ఇంట్లో నిద్రిస్తున్న తల్లపురెడ్డి గురుశేఖర్, ఆయన భార్య దస్తగిరమ్మ, పిల్లలు పవిత్ర, గురులక్ష్మి చనిపోయిన విషయం తెలిసిందే. ఆ నలుగురు మరణించడంతో గురుశేఖర్ రెండో కుమార్తె తల్లపురెడ్డి గురు ప్రసన్న అనాథగా మారారు. గురుప్రసన్న ప్రొద్దుటూరులో 10వ తరగతి చదువుతోంది. ఈ ఘటనపై సమాచారం తెప్పించుకున్న ముఖ్యమంత్రి ప్రసన్నకు అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం తరఫున రూ.10 లక్షల సాయం ప్రకటించారు. ఈ ఘటన తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందన్నారు. ప్రస్తుతం ప్రసన్న నాయనమ్మ తల్లపురెడ్డి నాగమ్మ సంరక్షణలో ఉన్నట్టు అధికారులు సీఎంకు వివరించారు. ప్రసన్న పేరుతో రూ.10 లక్షలు డిపాజిట్ చేయడంతోపాటు వృద్ధురాలైన నాగమ్మకు కూడా రూ.2 లక్షల సాయం అందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులు బాలికను కలిసి ధైర్యం చెప్పాలని సూచించారు. బాలికకు అండగా నిలవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. పార్టీ పరంగా కూడా రక్షణ, విద్య విషయంలో ప్రసన్నకు బాసటగా నిలుస్తామని చంద్రబాబు ప్రకటించారు.

వంద రోజుల్లో వ్యవస్థలను గాడిలో పెడతాం


అమరావతి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దెబ్బతిన్న వ్యవస్థలన్నింటినీ వంద రోజుల్లో గాడిలో పెడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. శనివారం టీడీపీ ప్రధాన కార్యాలయంలో గ్రీవెన్స్ సందర్భంగా ప్రజల నుంచి వినతిపత్రాలు తీసుకునేందుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్ని వినతులు వచ్చినా... అన్నింటికీ పరిష్కారమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. గత ఐదేళ్లలో జరిగిన రెవెన్యూ సంబంధిత సమస్యలపైనే ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. రెవెన్యూ సమస్యలకు కారణమైన, అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు ఉంటాయని తేల్చిచెప్పారు. ప్రతి మండలంలోనూ ఓ భూకుంభకోణం వెలుగు చూస్తోందని, రెవెన్యూ రికార్డులన్నీ తారుమారు చేసి అస్తవ్యస్తం చేశారన్నారు. రీసర్వే అస్తవ్యస్తంగా జరగడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారన్నారు. వాటన్నింటిపై విచారణ చేపడతామని, ప్రతి జిల్లాలోనూ రెవెన్యూ సంబంధిత ఫిర్యాదుల స్వీకరణకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. రెవెన్యూశాఖను ఎంత దారుణంగా నిర్వీర్యం చేశారో మదనపల్లి ఘటనే ఓ ఉదాహరణ అన్నారు. భూకబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేస్తామన్నారు. ప్రతి ఒక్కరి సమస్యనూ సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు. వచ్చిన విజ్ఞప్తులన్నీ శాఖల వారీగా విభజించి నిర్దిష్ట కాలపరిమితిలోపు పరిష్కారానికి కార్యాచరణ రూపొందించుకుంటామన్నారు. ఉద్యోగులు కూడా పెద్ద ఎత్తున సమస్యలతో పార్టీ కార్యాలయానికి వస్తున్నారని చెప్పారు. కార్యకర్తలు, ప్రజలు, ఉద్యోగుల సమస్యలను వేటికవి విభజించి పరిష్కరిస్తామన్నారు. ప్రజలు దూర ప్రయాణాలు చేసి అమరావతి వరకు రాకుండా జిల్లాల వారీగా మంత్రులు, నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు వినతిపత్రాలు తీసుకునేలా యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. జిల్లాలో తన పర్యటన సందర్భంగా ఎవ్వరూ ఇబ్బంది పడకుండా పోలీసు వ్యవస్థలోనూ మార్పులు తెస్తామన్నారు. ప్రజా పోలీసింగ్ చేసే వ్యవస్థగా మారుస్తామని తెలిపారు. వర్షాలు పడి ప్రాజెక్టులు నిండటంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. శాఖల వారీగా సమీక్షలు సత్ఫలితాలనిస్తున్నాయని పేర్కొన్నారు.

రేపు కలెక్టర్ల సమావేశం

- ఒక్కరోజే నిర్వహణకు నిర్ణయం
- ప్రాథమిక రంగాలపై తొలి చర్చ
- ప్రభుత్వ లక్ష్యాలపై దిశానిర్దేశం చేయనున్న సీఎం చంద్రబాబు
- ఎజెండా ఖరారు చేసిన ప్రభుత్వం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జిల్లా కలెక్టర్ల సమావేశంపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సమావేశాన్ని 5వ తేదీ ఒక్కరోజే నిర్వహించాలని నిర్ణయించింది. అదే రోజు వివిధ శాఖలపై సమీక్ష చేయనుంది. సోమవారం సాయంత్రం కలెక్టర్లు, జిల్లా ఎస్పీలతో శాంతి భద్రతలపై సమీక్ష నిర్వహించి సమావేశాన్ని ముగించాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రభుత్వం ఎజెండాను ఖరారు చేసింది. జిల్లాల్లో పాలనాపరమైన అంశాలు, విధాన నిర్ణయాలు, సంక్షేమ పథకాల అమలు, ఇసుక, వ్యవసాయ రంగం తదితర అంశాల్లో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వానికి స్పష్టత ఉంది. ఈ నేపథ్యంలో 5న సచివాలయంలో జరిగే కలెక్టర్ల సమావేశంలో తొలుత ప్రాథమిక రంగాలపైనే చర్చించనున్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలు, అటవీ సంపద, గనులపై తొలి చర్చ జరిగేలా ఎజెండా రూపొందించారు. ఆయా అంశాలపై సంబంధిత శాఖల కార్యదర్శులు ప్రజెంటేషన్లు ఇస్తారు. వారి ప్రాధాన్యాలు, లక్ష్యాలను కలెక్టర్ల ముందు ఉంచుతారు. మధ్యాహ్న విరామం తర్వాత బడుగు, బహీనన వర్గాల సంక్షేమంపై చర్చ ఉంటుంది. అనంతరం వైద్య, ఆరోగ్యశాఖ, సీజనల్ పరిస్థితులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విద్యారంగం, పురపాలన, సీఆర్‌డీఏ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, హౌసింగ్, జలవనరులు, పౌరసరఫరాలు, పరిశ్రమలపై ప్రత్యేకంగా చర్చించనున్నారు. సాయంత్రం రెవెన్యూశాఖపై చర్చ జరగనుంది. అసైన్డ్, చుక్కల భూములు, ఫ్రీహోల్డ్ అంశం, రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నేతల భూ ఆక్రమణలు, అసైన్డ్ భూముల పరాధీనం, అక్రమ రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లపై రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా ప్రజెంటేషన్ ఇస్తారు. వైసీపీ నేతల భూ ఆక్రమణలు, దురాగతాలపై రాష్ట్రవ్యాప్తంగా విచారణ చేపట్టాలని నిర్ణయించిన నేపథ్యంలో కలెక్టర్ల నుంచి ప్రభుత్వం కీలక సమాచారం తీసుకోవాలని భావిస్తోంది. జిల్లాల వారీగా భూముల ఆక్రమణలపై డేటా తీసుకురావాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అనంతరం ఎక్సైజ్, రహదారులు, ఐటీ, హ్యాండ్లూమ్స్, పర్యాటక శాఖపై కలెక్టర్లు, ఆయా శాఖల ముఖ్యకార్యదర్శులతో సీఎం చంద్రబాబు మాట్లాడనున్నారు. చివరగా శాంతిభద్రతలపై కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు అధికారులతో జిల్లాల వారీగా సీఎం చర్చించనున్నారు. అనంతరం ఓపెన్ హౌస్ నిర్వహిస్తారు.



ఉచిత ఇసుకపై చర్చ

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా వేసింది. ఇప్పటికే పింఛన్లను పెంచి బకాయిలతో సహా లబ్ధిదారులకు అందించింది. టైటిల్ చట్టాన్ని రద్దుచేసింది. రైతులు, భూ యజమానులకు కష్టాలు తీసుకొచ్చిన రీసర్వేను నిలిపివేసింది. గృహనిర్మాణ రంగానికి ఊతం ఇచ్చేందుకు, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించేందుకు అత్యంత కీలకమైన ఉచిత ఇసుక విధానం అమలు చేస్తోంది. అయితే, రవాణా చార్జీల అంశం కొంత గందరగోళానికి దారితీస్తోంది. ఈ సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని, కలెక్టర్లు, ప్రజలతో సంప్రదింపులు జరిపి పరిష్కారాలు కనిపెట్టాలని సీఎం ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఉచిత ఇసుక అమలులో ఎదురవుతున్న సవాళ్లు, సమస్యలపై కలెక్టర్లతో చంద్రబాబు సవివరంగా మాట్లాడనున్నారు.

సీఆర్‌డీఏలో ఫైళ్లు మాయం!

(మొదటి పేజీ తరువాయి)

కనిపించడం లేదు. దీంతో సీఆర్‌డీఏ పాలనా వ్యవహారాలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో అమరావతి రాజధాని పనుల పునర్నిర్మాణం దిశగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో కీలక వ్యవహారాలపై ముందుకు వెళ్లేందుకు సీఆర్‌డీఏ అధికారులకు ఇబ్బందిగా మారింది. ఫైళ్లు కనిపించని విషయం మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ దృష్టికి కూడా వెళ్లింది. ఇంజనీరింగ్, ప్లానింగ్, రెవెన్యూ, ఎస్టేట్ ఇలా పలు విభాగాల ఫైల్స్ కనిపించడం లేదు. ఈ ఫైళ్లను టీడీపీ ప్రభుత్వంపై విచారణ పేరుతో వైసీపీ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.

చంద్రబాబుపై కక్షతోనే..!

ప్రస్తుత ముఖ్యమంత్రి నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబుపై కక్షగట్టిన వైసీపీ ప్రభుత్వం.. ఆయనను కేసులలో ఇరికించేందుకు సింగపూర్ దేశంతో చేసుకున్న ఎంఓయూలకు సంబంధించిన ఫైళ్లను కూడా వైసీపీ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. వీటిలో కూడా కొన్ని కనిపించటం లేదని తెలుస్తోంది. చంద్రబాబుతోపాటు ఆయన తనయుడు లోకేశ్‌లను ఇన్నర్‌రింగ్ రోడ్డు కేసులో ఇరికించేందుకు భూ సంబంధిత ఫైళ్లన్నీ పట్టుకుపోయారు. వీటిలో కూడా చాలావరకు వెనక్కి రాలేదని తెలుస్తోంది. అప్పటి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఆర్డీఏ అధికారులు ఈ ఫైళ్లు ఇచ్చేశారు. ఈ ఫైళ్లకు సంబంధించిన కాపీలు అయినా తమ దగ్గర పెట్టుకోలేదు. ప్రస్తుతం సీఆర్డీఏకు కమిషనర్ నుంచి అడిషనల్ కమిషనర్ల వరకు అంతా కొత్తవాళ్లు వచ్చారు. మిగిలిన ఫైళ్లు తెచ్చుకుందామంటే అవి ఎక్కడ ఉన్నాయో కూడా తెలియని పరిస్థితి ఉంది. అమరావతి శాశ్వత రాజధాని పనులకు సంబంధించి ఇంజనీరింగ్ విభాగం తమకు ఉన్న అవగాహన మేరకు ఎలాగోలా నెట్టుకొస్తోంది. ఫైళ్ల మాయం వ్యవహారంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో పనిచేసిన సీఆర్డీఏ ఉన్నతాధికారులతోపాటు, గతంలో పనిచేసిన వివిధ శాఖల అధికారులను బాధ్యులను చేసి, విచారించాల్సి ఉంది.



పరిశ్రమల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి టీజీ భరత్

శ్రీసిటీ తరహాలో ఇండస్ట్రియల్ జోన్ల అభివృద్ధి

- అధికారులతో పరిశ్రమల మంత్రి భరత్ సమీక్ష

అమరావతి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ఇండస్ట్రియల్ జోన్లను శ్రీసిటీ తరహాలో అభివృద్ధి చేయాలని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఉన్న ఇండస్ట్రియల్ జోన్లలో నెలకొన్న సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించడంతోపాటు వాటన్నింటిలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. సీఎం చంద్రబాబుకు ఉన్న బ్రాండ్ ఇమేజ్‌తో పారిశ్రామికవేత్తలకు ఇప్పటికే పాజిటివ్ సంకేతాలు వెళ్లాయని, ఫలితంగా ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక సంస్థలు చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. శనివారం ఆయన మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో పరిశ్రమలశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని ఇండస్ట్రియల్ జోన్ల ప్రస్తుత పరిస్థితిపై మంత్రి ఆరా తీశారు.

రాష్ట్ర ఆర్థికాభివృద్ధి కోసం రోడ్‌మ్యాప్

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎన్ఆర్ఐలు ఆసక్తి కనబరుస్తున్నారని, వారి పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం అన్ని రంగాల్లో వ్యాపారులకు మద్దతుగా నూతన పారిశ్రామిక విధానంతో ముందుకు రావాలని రాష్ట్ర పరిశ్రమల సమాఖ్య (ఏపీ చాంబర్స్) కోరింది. పెండింగ్‌లో ఉన్న పారిశ్రామిక ప్రోత్సాహకాలను వెంటనే విడుదల చేయాలని అభ్యర్థించింది. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం.. మంత్రి టీజీ భరత్, ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎస్.యువరాజ్‌ను కలిసి రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి సంబంధించిన రోడ్‌మ్యాప్ (2024-29)ను అందించింది.

నేడు మదనపల్లెలో భూ బాధితుల సదస్సు: రామకృష్ణ

అమరావతి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): భూ అక్రమాలకు సంబంధించిన ఫైల్స్‌ను బూడిద చేసేందుకు మదనపల్లె సబ్ కలెక్టరు కార్యాలయాన్ని తగలబెట్టిన నేపథ్యంలో ఆదివారం మదనపల్లెలో భూ బాధితులతో సదస్సు నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. మదనపల్లె ఘటనలో రాజకీయ నాయకులు, అధికారులు, ఉద్యోగులు కుమ్మక్కయ్యారని ఆయన ఆరోపించారు. త్వరలోనే విజయవాడలో భూ బాధితుల రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, అమరావతి రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ నుంచి మినహాయింపునివ్వాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు.

భాషా పండితులకు న్యాయం చేయండి: టీఎన్‌యూఎస్

అమరావతి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): డీఈవో పూల్‌లో ఉన్న భాషాపండితులకు న్యాయం చేయాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు టీఎన్‌యూఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, శ్రీరామరెడ్డి వెంకటేశ్వర్లు, ఆర్థిక కార్యదర్శి పినాకపాణి, గౌరవాధ్యక్షుడు మునుపాటి రజనీబాబు పాఠశాల విద్య సంచాలకుడు విజయరామరాజుకు లేఖ రాశారు.

రీయింబర్స్ పరిమితిని రూ.5 లక్షలకు పెంచాలి

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఉచిత వైద్య సదుపాయం (ఈహెచ్ఎస్) మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిమితిని రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షలకు పెంచాలని ఏపీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలాజీ, సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్‌కు బదులు ఈహెచ్ఎస్ క్యాష్‌లెస్ ట్రీట్మెంట్ కల్పించడంలో ప్రైవేటు ఆసుపత్రుల స్పందన సరిగ్గా లేనందువల్ల మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యాన్ని కొనసాగించాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి వివరించినట్లు శనివారంలో ఒక ప్రకటనలో తెలిపారు.

యామినీ కృష్ణమూర్తి కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

విడిచారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా మదనపల్లెలో 1940 డిసెంబరు 20న యామిని జన్మించారు. ఆమె అసలు పేరు యామినీ పూర్ణతిలకం. తల్లి లక్ష్మి, తండ్రి మంగిరి కృష్ణమూర్తి సంస్కృత పండితుడుగా మదనపల్లె ప్రాంతంలో పేరుగాంచారు. ఆమెకు ఇద్దరు సోదరీమణులు ఉన్నారు. యామిని చిన్నప్పుడే కుటుంబం తమిళనాడుకు వెళ్లింది. తండ్రి ప్రోత్సాహంతో ఐదేళ్ల వయసులోనే చెన్నైలోని రుక్మిణీదేవి అరుండేల్ కళాక్షేత్రంలో యామిని భరతనాట్యం నేర్చుకోవడం ప్రారంభించారు. అటుపిమ్మట వీరి కుటుంబం చిదంబరంలో స్థిరపడ్డారు. కాంచీపురం ఎల్లప్ప పిళ్లై, చొక్కలింగం పిళ్లై, బాలసరస్వతి, తంజావూరు కిట్టప్ప, దండాయుధపాణి వద్ద భరతనాట్యంలో యామిని శిక్షణ పొందారు. వేదాంతం లక్ష్మీనారాయణశాస్త్రి, చింతా కృష్ణమూర్తి, పసుమర్తి వేణుగోపాల కృష్ణశర్మ వంటి వారివద్ద కూచిపూడి నృత్యంలోనూ, పంకజ చరణ్‌దాస్, కేలూచరణ్ మహాపాత్ర వద్ద ఒడిస్సీ నృత్యంలోనూ శిక్షణ పొందారు. ఎం.డి. రామనాథన్ వద్ద కర్ణాటక సంగీతం నేర్చుకోవడంతో పాటు కల్పక్కం స్వామినాథన్ వద్ద వీణ వాయించడంలో తర్ఫీదు పొందారు. అనతికాలంలోనే భరతనాట్యం, కూచిపూడి నృత్యాల్లో ప్రావీణ్యం సంపాదించిన యామిని తన 17వ ఏటనే 1957లో చెన్నైలో నృత్య ప్రదర్శనతో అరంగేట్రం చేశారు. భరతనాట్యం, కూచిపూడి, ఒడిస్సీ నృత్యాల్లో నిష్ణాతురాలైన యామినీ కృష్ణమూర్తి ప్రతిభకు గాను పద్మశ్రీ (1968), పద్మభూషణ్ (2001), పద్మ విభూషణ్(2017)తో పాటు భరతనాట్యంలో సంగీత నాటక అకాడమీ(1977) అవార్డులు వరించాయి. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లె రాధకృష్ణన్ నుంచి భామావేణి బిరుదు పొందారు. 2017లో విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వారు స్వర్ణకమలం బహూకరించి నాట్య విద్యాభారతి బిరుదు అందజేశారు. యామిని అవివాహితగానే ఉండి తన జీవితాన్ని నాట్య రంగానికే అంకితం చేశారు. 1990లో ఆమె ఢిల్లీలో సొంత డ్యాన్స్ స్టూడియో 'యామినీ స్కూల్ ఆఫ్ డ్యాన్స్'ను ప్రారంభించారు. ఆమె టీటీడీ ఆస్థాన నర్తకిగా సేవలందించారు. యామినీ కృష్ణమూర్తి భౌతికకాయాన్ని ఆదివారం ఉదయం 9గంటలకు ఢిల్లీలోని ఆమె ఇన్‌స్టిట్యూట్‌కు తీసుకురానున్నారు. కళాకారులు, రచయితలు, ప్రముఖులు యామిని మృతి పట్ల సంతాపం ప్రకటించారు.



నృత్య రంగానికి తీరని లోటు: చంద్రబాబు

యామినీ కృష్ణమూర్తి మృతిపట్ల సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. 'భారతదేశం గర్వించదగిన నృత్యకారిణి యామినీ కృష్ణమూర్తి తుదిశ్వాస విడిచారని తెలిసి, తీవ్ర ఆవేదన చెందాను. ఆమె లేని లోటు నృత్య కళారంగంలో ఎవరూ తీర్చలేరు. ఆమె ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుడిని కోరుకుంటున్నా' అని చంద్రబాబు సంతాపం తెలిపారు.

లేట'రైట్.. రైట్'!

(మొదటి పేజీ తరువాయి)

చూసుకున్నారు. ఆయన కనుసన్నల్లోనే అడవిలో విలువైన లేటరైట్‌ను అక్రమంగా తవ్వితీసినట్లు తెలిసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గనులశాఖ అక్రమాలపై దృష్టిపెట్టింది. దాదాపు నెలరోజుల పాటు గనులశాఖ డైరెక్టరేట్, ఏపీఎండీసీ ప్రధాన కార్యాలయాలు సీజ్‌చేసింది. దీంతో ఆ లేటరైట్ తరలింపును వాయిదా వేసుకున్నారు. ఇటీవలి కాలంలో ఖనిజాల తరలింపునకు ఇచ్చే పర్మిట్లపై సందిగ్ధం నెలకొంది. సీనరేజీ కాంట్రాక్టు ఉన్న ఏడు ఉమ్మడి జిల్లాలు, ఆన్‌లైన్ విధానం నడిచే ఆరు జిల్లాల్లోనూ మైనింగ్ పర్మిట్లు ఇవ్వడం లేదు. దీంతో ప్రత్తిపాడులోని లేటరైట్‌ను తరలించకూడదనుకున్నారు. ఇంతలో మదనపల్లి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్లకు నిప్పుపెట్టిన వ్యవహారం తెరమీదకు వచ్చింది. ప్రభుత్వ దృష్టి దానిపైకి వెళ్లింది. వివిధ అంశాలపై శ్వేతపత్రాల విడుదల, అసెంబ్లీ సమావేశాలపై ప్రభుత్వం దృష్టిసారించింది. సందట్లో సడేమియా అన్న చందంగా.. ఇదే సమయంలో కాకినాడ గనుల శాఖ కీలక అధికారి శుక్రవారం సెలవు మీద పంపించారు. అదేరోజు సాయంత్రం 6.30గంటల నుంచి ప్రత్తిపాడులో డంప్ ఉన్న ఏరియాకు 6జేసీబీలు తీసుకొచ్చి లేటరైట్‌ను తరలించడం ప్రారంభించారు. దీనిలో కొంతభాగాన్ని రాత్రివేళ్లలో జగయ్యపేటకు, మరికొంత కాకినాడ పోర్టు ఏరియాకు తరలిస్తున్నట్లు తెలిసింది. ఆ లేటరైట్ అత్యంత నాణ్యమైనది. దాన్నిప్రాసెస్ చేస్తే అందులోనుంచి బాక్సైట్ కంటెంట్ వస్తుంది. దాన్ని కాకినాడ పోర్టుద్వారా విదేశాలకు తరలించాలన్నది వైసీపీ పెద్ద ప్లాన్ అని తెలిసింది. ఇందుకు అమెరికా కంపెనీతో ఒప్పందం కుదిరినట్లు సమాచారం.

కూటమి ప్రభుత్వం కొలువుతీనా ఎందుకిలా?

ఏపీలో 2నెలలుగా మైనింగ్ పర్మిట్లు లేవు. రవాణా లేదు. సిమెంట్ ఫ్యాక్టరీలకు లేటరైట్ కొరత ఏర్పడటంతో ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రస్తుతం టన్ను లేటరైట్ 4,800 నుంచి 5,600 మేర విక్రయిస్తున్నారు. ఈ ధరకే సిమెంట్ ఫ్యాక్టరీలకు ఇవ్వాలని వైసీపీ ప్రయత్నం. రవాణా విషయంలో సమస్యలు రాకుండా స్థానిక ప్రతినిధులతో వైసీపీ పెద్ద నేత లోపాయికారి ఏర్పాట్లు చేసుకున్నారని, దీంతో తరలింపు సజావుగా సాగుతున్నట్లు తెలిసింది. కూటమి ప్రభుత్వంలోనూ వైసీపీ నేతల ఆక్రమాలు ఆగడం లేదని, వారి బరితెగింపునకు అడ్డూఅదుపు లేకుండా పోయిందనడానికి ఇంతకుమించిన నిదర్శనం ఏముంటుంది?

50వేల టన్నులు భారతి సిమెంట్స్‌కు?!

ఎన్నికల సమయం నాటికి మరో 2లక్షల టన్నుల లేటరైట్‌ను తవ్వారు. అందులో 50వేల టన్నులు భారతి సిమెంట్స్‌కు తరలించినట్లు తెలిసింది. ఇంతలో ఎన్నికల నోటిఫికేషన్ రావడం, రహదారి తనిఖీలు, చెక్‌పోస్టుల పరిశీలన ఎక్కువకావడంతో ప్రత్తిపాడులోని ఓ కంపెనీ యార్డ్‌లో నిల్వచేసినట్లు తెలిసింది. ఇది సుమారు లక్షన్నర టన్నులు ఉంటుందని అంచనా. మళ్లీ జగనే అధికారంలోకి వస్తారని, తిరిగి సిమెంట్ ఫ్యాక్టరీలకు సరఫరా చేయవచ్చని వైసీపీ నేతలు భావించారు. కానీ వారి అంచనాలు తలకిందులయ్యాయి.


అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం హరిపురంలో వైసీపీ నేతలు కబ్జా చేసిన స్థలం..

ఆగని వైసీపీ నేతల ఆగడాలు

- అనకాపల్లి జిల్లా హరిపురంలో భూ కబ్జాలు
- నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్లు.. భూ యజమానులకు బెదిరింపులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ అధికారం కోల్పోయినా.. ఆ పార్టీ నేతల ఆగడాలు మాత్రం తగ్గడం లేదు. అధికారుల అండదండలతో చెలరేగిపోతున్నారు. నకిలీ పత్రాలు సృష్టించి భూములను కాజేస్తున్నారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం హరిపురం గ్రామంలోనూ వైసీపీ నేతలు భూకబ్జాకు పాల్పడ్డారు. సర్వే నంబరు 102లోని ఎకరా 3 సెంట్ల భూమిని వి శాఖకు చెందిన ఎన్‌ఆర్‌ఐ 2004 సంవత్సరంలో పరిశ్రమ ఏర్పాటు కోసం కొనుగోలు చేశారు. అందులో 43 సెంట్ల భూమిని ఇతరులకు విక్రయించి, మిగిలిన భూమిని చూసుకునే బాధ్యతను అచ్యుతాపురం మండలం మోసయ్యపేటలో ఉంటున్న మేనల్లుడు శ్రీమంతుల నవీన్‌కుమార్‌కు అప్పగించారు. గత నెల 27న నవీన్‌కుమార్ ఆ భూమిలో పనులు చేయిస్తుండగా వైసీపీ నేత కర్రి శివశంకర్ గణేశ్, మరో 20 మందితో వచ్చి అడ్డుకోవడమే కాకుండా ఆ స్థలం చుట్టూ కంచె వేసి ఆక్రమించేందుకు యత్నించారు. నవీన్‌కుమార్ ప్రశ్నించడంతో దాడికి పాల్పడి, కత్తితో బెదిరించారు. దీనిపై నవీన్‌కుమార్ గురువారం రాంబిల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రెవెన్యూ అండదండలతో అక్రమాలు

హరిపురం గ్రామంలో 2023లో రెవెన్యూ, పోలీస్ శాఖల అండదండలతో వైసీపీ నాయకులు అనేక అక్రమాలకు పాల్పడ్డారు. వైసీపీ కీలక నేత అండదండలతో వ్యవహారాలు నడిపించారు. ప్రైవేటు వ్యక్తుల భూములకు సంబంధించి వెబ్ ల్యాండ్ రికార్డుల్లో మార్పులు, చేర్పులు చేయించి, నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి సొంతం చేసుకున్నారు. అలా హరిపురం సర్వే నంబర్ 76/2లో 35 సెంట్ల భూమిని నకిలీ ధ్రువపత్రాలతో దాడి గణేశ్ పేరున రిజిస్ట్రేషన్ చేయించారు. అలాగే సర్వే నంబరు 71/2లో ఎకరా 83 సెంట్ల భూమిలో 45 సెంట్ల స్థలాన్ని వన్‌బీ సృష్టించి చోడిపల్లి మంగరాజు పేరున రిజిస్ట్రేషన్ చేయించారు. వైసీపీ నేతల ఆజ్ఞలకు రెవెన్యూ, పోలీసు అధికారులు కూడా తలాడించి రెవెన్యూ రికార్డుల్లో అడ్డగోలుగా మార్పులు, చేర్పులు చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రీ సర్వే చేసి న్యాయం చేయాలి..

హరిపురంలో మా భూమిని వైసీపీ నాయకులు కబ్జా చేశారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు. రెవెన్యూ అధికారులు స్పందించి రీసర్వే చేయించి కబ్జాకు గురైన మా భూములను అప్పగించాలి. భూ ఆక్రమణలు, దౌర్జన్యాలపై ఎమ్మెల్యే, ఎంపీతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశాం. న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నా.

- శ్రీమంతుల నవీన్‌కుమార్, బాధితుడు

జల సంధానం!

(మొదటి పేజీ తరువాయి)

అందుతాయి. సంక్లిష్టమైన నదుల అనుసంధానాన్ని.. సులువుగా పూర్తి చేసేలా ఈ ప్రణాళికను రూపొందించారు. గతంలో ఇచ్చంపల్లి నుంచి కావేరి దాకా నదుల అనుసంధాన ప్రక్రియకు వేసిన అంచనా వ్యయం రూ. 95వేల కోట్లు. తాజాగా రాష్ట్రం ప్రతిపాదించిన కొత్త అనుసంధాన ప్రక్రియను రూ.25,000 కోట్లతోనే పూర్తి చేయవచ్చు. భూసేకరణ జంఝాటం లేకుండా.. ప్రస్తుతం ఉన్న పైపులైన్లు, కాలువల ద్వారానే దీనిని చేపట్టవచ్చని రాష్ట్ర జలవనరుల శాఖ చెబుతోంది. ఈ ప్రతిపాదనలను త్వరలోనే కేంద్రానికి సమర్పించనున్నారు.



గోదావరి, పెన్నానదుల అనుసంధాన ప్రతిపాదిత మ్యాపు

సాగర్ ఆయకట్టుకు 80 టీఎంసీలు..

గోదావరి- పెన్నా నదుల అనుసంధాన ప్రక్రియను చేపట్టి .. గోదావరి జలాలను గుంటూరు .. ప్రకాశం జిల్లాల్లోని మెట్ట ప్రాంతాలకు సాగు .. తాగునీరందించేలా రాష్ట్ర జలవనరుల శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. గోదావరి మిగులు జలాల నుంచి 80 టీఎంసీలను నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలో వినియోగించుకునేలా కార్యచరణను రూపొందించింది.

ప్రకాశం, నెల్లూరుకు కొత్తగా 50 టీఎంసీలు

నదుల అనుసంధాన ప్రక్రియ ద్వారా ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఐదు లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు 50 టీఎంసీలు అందించవచ్చు. నెల్లూరు జిల్లాలోని సోమశిల పరీవాహక ప్రాంతంలో అదనంగా సాగు, తాగునీరందించేందుకు 20 టీఎంసీలను వినియోగించుకునేలా గోదావరి జలాలను తరలిస్తారు. వెలిగొండకు మరో 30 టీఎంసీలు దక్కేలా డీపీఆర్‌లో ప్రణాళికను రూపొందించింది.

రాయలసీమకు లాభసాటిగా..

గాలేరు నగరి సుజల స్రవంతి ద్వారా రాయలసీమ ప్రాంతం పరిధిలో సాగునీరు, తాగునీరుదక్కేలా 20 టీఎంసీలు తరలుతాయని సాగునీటి శాఖ పేర్కొంది. హంద్రీనీవాకు మరో 20 టీఎంసీలు గోదావరి జలాలు చేరుతాయని వెల్లడించింది. కడప, చిత్తూరు జిల్లాల్లో మరో ఐదు లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందేలా 50 టీఎంసీలు దక్కుతాయి. ప్రకాశం, నెల్లూరు, కడప, చిత్తూరు జిల్లాల గృహాలకు తాగునీటి సమస్య రాకుండా 40 టీఎంసీలను కేటాయించేలా ఈ ప్రణాళిక రూపొందింది. మొత్తంగా గుంటూరు, ప్రకాశం నెల్లూరు, కడప, చిత్తూరు జిల్లాలకు 320 టీఎంసీల జలాలు అదనంగా అందుతాయని .. దీనివల్ల కరవుకు ఆస్కారమే ఉండదని రాష్ట్ర జలవనరుల శాఖ పేర్కొంటోంది.

గతంలో ఇలా..

ప్రధాని మోదీ... గోదావరి (ఇచ్చంపల్లి వద్ద)- కృష్ణానది-(నాగార్జునసాగర్)- కావేరి నదుల అనుసంధాన ప్రక్రియను చేపట్టాలని పదేళ్లగా ప్రయత్నిస్తున్నారు. దీనికోసం బీజేపీ నేత వెదిరె శ్రీరామ్ అధ్యక్షతన టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేశారు. టాస్క్‌ఫోర్సు గతేడాది నవంబరులో సమావేశమై, అనుసంధాన ప్రక్రియపై కొన్ని ప్రతిపాదనలు చేసింది. అయితే, ఈ ప్రతిపాదనలకు తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. తమకు కేటాయించిన గోదావరి నికర జలాల జోలికి వెళ్లడానికి వీల్లేదని తెలిపింది. ఛత్తీస్‌గఢ్ అంతగా వినియోగించుకోని గోదావరి జలాలను అనుసంధాన పథకానికి వాడుకోవాలని సూచించింది. దీంతో రాష్ట్రాలకు కేటాయించిన నదీ జలాలను వాడకుండానే ఈ ప్రక్రియను చేపడతామని శ్రీరామ్ హామీఇచ్చారు. గోదావరి జలాలను ఇచ్చంపల్లి నుంచి సాగర్ మీదుగా కృష్ణా, పోలవరం వద్ద గోదావరి జలాలను వినియోగిస్తూ సోమశిల గుండా కావేరితో అనుసంధానం చేయడం సాధ్యమయ్యే పనికాదని ఏపీ స్పష్టం చేసింది. ఇది అంతర్రాష్ట్ర నదీజలాల వివాదాలకు దారితీస్తుందని హెచ్చరించింది. కేంద్రం ప్రతిపాదన ప్రకారం, రూ.95000 కోట్ల దాకా నిర్మాణ వ్యయం అవుతుంది. ఇందులో భూసేకరణకే రూ.45000కోట్ల దాకా పోతుంది. కేంద్రం ప్రతిపాదనల మేరకు.. నదీ జలాల తరలింపు ప్రక్రియ ఏటా ఆగస్టులో ప్రారంభమవుతుంది. ఆ సమయంలో గోదావరి ప్రవాహం ఉధృతంగా ఉంటుంది. అదే సమయంలో సాగర్‌లో కృష్ణాజలాలు 50 శాతానికి మించి ఉంటాయి. కృష్ణాజలాల ఉధృతికి గోదావరి జలాలు జతచేరితే సాగర్‌పై ఒత్తిడి పెరిగి.. డ్యామ్ మనుగడకే ముప్పువాటిల్లే ప్రమాదం ఉందని రాష్ట్రం హెచ్చరించింది ఈ నేపథ్యంలో నదుల అనుసంధాన ప్రక్రియ కార్యాచరణ అమలులో కేంద్రం పునరాలోచనలో పడింది. తొలుత మహానది-గోదావరి-కృష్ణా-కావేరి అనుసంధానం చేపట్టాలని, ఆ తర్వాత గోదావరి-కృష్ణా-కావేరి అనుసంధాన ప్రక్రియపై దృష్టిసారించాలని భావించింది. అయితే, ఒడిశా సహకరించకపోవడంతో మహానది అనుసంధాన ప్రక్రియ ముందుకెళ్లలేదు. దీంతో, తిరిగి గోదావరి - కావేరి నదుల అనుసంధాన ప్రక్రియపై కేంద్రం కేంద్రీకరించింది. కానీ, ఇచ్చంపల్లి నుంచి గోదావరి నదీ అనుసంధాన ప్రక్రియను చేపట్టేందుకు తెలంగాణ కొన్ని అభ్యంతరాలను వ్యక్తం చేసింది. దీంతో ఈ ఆలోచన కూడా ముందుకు సాగదన్న అభిప్రాయం ఏర్పడింది. తాజా ప్రతిపాదనతో తెలంగాణకు ఎలాంటి అభ్యంతరం ఉండదని... ఆ రాష్ట్రంపై ఎలాంటి ప్రభావం లేకుండా అనుసంధానం పూర్తి చేయవచ్చునని అధికారులు చెబుతున్నారు.

జస్టిస్ ఎన్వీ రమణతో మంద కృష్ణ భేటీ

న్యూఢిల్లీ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు మాజీ సీజేఐ, జస్టిస్ ఎన్వీ రమణతో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ భేటీ అయ్యారు. ఢిల్లీలోని జస్టిస్ రమణ నివాసంలో ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శాలువాతో సత్కరించారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీం తీర్పును ఎలా అమలు చేయాలన్న విషయమై సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. కాగా, ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు రావడం సంతోషంగా ఉందని జస్టిస్ రమణ అన్నారు. మంద కృష్ణను పూలమాలతో అభినందించారు.

పంప్డ్ స్టోరేజీ ప్లాంటు పనుల వేగాన్ని పెంచండి

- జెన్కో అధికారులను ఆదేశించిన ఎండీ చక్రధరబాబు

అమరావతి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా ఎగువ సీలేరు వద్ద నిర్మించదలచిన 1350 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్కేంద్రానికి కేంద్ర అటవీ పర్యావరణ అనుమతులు వచ్చినందున ప్లాంట్ నిర్మాణానికి కార్యాచరణను వేగవంతం చేయాలని ఏపీజెన్కో ఎండీ కేవీఎస్ చక్రధరబాబు అధికారులను ఆదేశించారు. ఎగువ సీలేరు పంప్డ్ స్టోరేజీ ప్లాంటుకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ అనుమతులు ఇవ్వడంతో శనివారం జెన్కో అధికారులతో చక్రధరబాబు సమీక్షించారు. ఎగువ సీలేరు పీఎస్‌పీ నిర్మాణం వల్ల 1350 మెగావాట్ల విద్యుత్తు చౌకగా అందుతుందని వెల్లడించారు.

బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించిన 'పిన్నెల్లి'

అమరావతి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నెల్లూరు కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఆయన దాఖలు చేసిన రెండు పిటిషన్లు సోమవారం విచారణకు రానున్నాయి. మే 13న పోలింగ్ కేంద్రంలో ఈవీఎం, వీవీ ప్యాట్‌ను పిన్నెల్లి ధ్వంసం చేశారు. అడ్డుకోబోయిన టీడీపీ ఏజెంట్ శేషగిరిరావుపై దాడి చేశారు. నాగశిరోమణి అనే మహిళను బూతులు తిట్టారు.

10 లక్షల జీతం అధికారికి ఉద్వాసన

అమరావతి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఉద్యోగిగా ఉంటూనే ప్రభుత్వ రంగంలోని ఓ సంస్థ సీఈవోగా అలవెన్సులతో కలిపి నెలకు రూ.10 లక్షలు జీతం తీసుకుంటున్న అధికారికి ఎట్టకేలకు మున్సిపల్‌శాఖ ఉద్వాసన పలికింది. ఏపీ పట్టణ మౌలిక వసతుల, ఆస్తుల నిర్వహణ సంస్థ(ఏపీయూఐఏఎంఎల్) సీఈవో నారాయణరెడ్డి ఈ నెలలో రిటైర్ కాబోతుండగా, ఆయనను మరో రెండేళ్లు కొనసాగించేందుకు మున్సిపల్ మంత్రి నారాయణ సిఫారసు చేశారు. కాగా, ఆయన అవినీతిపై 'ఆ సీఈవో వెరీ స్పెషల్' శీర్షికన గతంలోనూ, 'ప్రభుత్వమేదైనా ఆయనది ఇష్టారాజ్యం' శీర్షికన ఇటీవల మరోసారి 'ఆంధ్రజ్యోతి' కథనాలు ప్రచురించింది. దీంతో స్పందించిన బోర్డు చైర్మన్.. సీఎస్ నీరబ్‌కుమార్ ఆదేశాలతో ఆయనను ఆ బాధ్యతల నుంచి తప్పిస్తూ తాజాగా ఆదేశాలిచ్చారు.

అటల్ మారథాన్ పోటీల్లో ఏపీకి రెండో ర్యాంకు

- శ్రీకాకుళం విద్యార్థుల ప్రాజెక్టు ఎంపిక

అమరావతి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నీతి ఆయోగ్ అటల్ ఇన్నోవేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అటల్ మారథాన్ పోటీల్లో ఏపీ ప్రాజెక్టుకు రెండో ర్యాంకు లభించింది. శ్రీకాకుళం విద్యార్థులు రూపొందించిన సెలైన్ అలారం ప్రాజెక్టు ఇందుకు ఎంపికైనట్లు సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా ఇప్పిలి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు తక్కువ ఖర్చుతో ఈ ప్రాజెక్టును రూపొందించారన్నారు. రోగులకు సెలైన్ ఎక్కించినప్పుడు సకాలంలో దానిని తీయకపోతే రక్తం బయటకు వెళ్లే ప్రమాదం ఉందని, 5 మిల్లీలీటర్ల సెలైన్ ఉన్నప్పుడు అలారం మోగించడం ద్వారా అప్రమత్తం చేసేలా విద్యార్థులు రూపొందించారని వివరించారు. ఈ ఏడాది మొత్తం 500 ప్రాజెక్టులకు అవార్డులు వస్తే అందులో 35 ఏపీ ప్రాజెక్టులు ఉన్నాయని తెలిపారు.

14న కేఆర్ఎంబీ సమావేశం

- చెన్నైకు తాగునీటిపై నిర్ణయం

అమరావతి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): చెన్నయ్ నగరానికి తాగునీటిని అందించడంపై ఈ నెల 14వ తేదీన ఉదయం 11 గంటలకు ఆన్‌లైన్ విధానంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో కృష్ణా నదీయాజమాన్య సంస్థ సమావేశం కానున్నది. ఈ మేరకు మెంబర్ సెక్రటరీ రాయ్‌పురే సమాచారాన్ని తెలుగు రాష్ట్రాలకు పంపారు.

13న జీఆర్ఎంబీ భేటీ

గోదావరి యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశం ఈ నెల 13వ తేదీన జరగనున్నది. సీతారామ ఎత్తిపోతల పథకం, సీతారామ బహుళార్థసాధక ప్రాజెక్టు పథకాలకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను గోదావరి నదీ యాజమాన్య బోర్డుకు సమర్పించనుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 13న జీఆర్ఎంబీ భేటీకి హాజరుకావాలంటూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు జీఆర్ఎంబీ సమాచారం పంపింది. వాస్తవానికి ఈనెల 6న జరగాల్సిన ఈ సమావేశాన్ని తెలంగాణ అభ్యర్థన మేరకు 13కు వాయిదా వేసింది.

త్వరలో 100 మొబైల్ రైతుబజార్లు

- రైతు బజార్ల సీఈవో శేఖర్‌బాబు

అమరావతి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతుబజార్లను పటిష్ఠం చేయలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా 100 మొబైల్ వాహనాలను ఏర్పాటు చేయనున్నట్లు రైతుబజార్ల సీఈవో శేఖర్‌బాబు తెలిపారు. విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, కర్నూలు వంటి నగరాల్లో అపార్ట్‌మెంట్లలోను, శివారు కాలనీల్లో ఉండే ప్రజలకు రైతుబజార్ సేవలను అందుబాటులో తీసుకెళ్లాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం మొబైల్ రైతు బజార్లు కేవలం గుంటూరు, విజయవాడలో 16 మాత్రమే ఉన్నాయి. కాగా, రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 111 రైతుబజార్లున్నాయి. సాలూరు, అనపర్తి, అంగర, రాయవరం, బాపట్ల, వేంపల్లి, పొద్దుటూరు, పత్తికొండ, ఆళ్లగడ్డ, వెలుగోడు, ఆత్మకూరు, మదనపల్లిలో కొత్తగా నిర్మించిన రైతుబజార్లను త్వరలో ప్రారంభించనున్నారు. ప్రతి మున్సిపల్ కేంద్రంలో రైతుబజార్ ఏర్పాటుకు ప్రతిపాదన ఉన్నా.. 98 మున్సిపాలిటీలకు 74 చోట్లే రైతుబజార్లు ఉన్నాయి.

ప్రజారోగ్యాన్ని దెబ్బతీసిన జగన్ మద్యం

- వ్యసనపరులను బయటేయడానికి 28 డీ ఎడిక్షన్ కేంద్రాలు: మంత్రి సత్యకుమార్

గుంటూరు(మెడికల్), ధర్మవరం, ఆగస్టు 3: గత ఐదేళ్లగా రాష్ట్రంలో నాసిరకం మద్యంతో జగన్ సర్కార్ ప్రజల ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీసిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ మండిపడ్డారు. జే బ్రాండ్ మద్యంతో ఆరోగ్యం కుదేలైన వారిని ఆ వ్యసనం నుంచి బయటకు తెచ్చేందుకు ఏపీలో ఏకంగా 25 డీ ఎడిక్షన్ సెంటర్లు పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం త్వరలో కొత్త మద్యం విధానాన్ని రూపొందిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇందుకోసం సీఎం చంద్రబాబు, కేబినెట్ సబ్‌కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శనివారం కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలసి గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో పర్యటించిన మంత్రి సత్యకుమార్ యాదవ్, కొత్తగా ఏర్పాటు చేసిన సీటీ స్కాన్ మెషీన్‌ను ప్రారంభించారు. సీఎస్ఆర్ కింద ఐదు బ్యాంక్‌లు సంయుక్తంగా20 ఏసీలను విరాళంగా మంత్రి ద్వారా జీజీహెచ్‌కు అందజేశారు. అనంతరం విలేకర్ల సమావేశంలో సత్యకుమార్ మాట్లాడారు. టైర్-2 సెంటర్‌గా ఉన్న గుంటూరు జీజీహెచ్ కేన్సర్ కేంద్రానికి త్వరలో పెట్ స్కాన్ ఇతర ఆధునిక వైద్య పరికరాలు సమకూర్చి కేన్సర్ వైద్యంలో టైర్-1 సెంటర్‌గా మారుస్తామని మంత్రి వెల్లడించారు. సీఎస్ఆర్ కింద నాట్కో ఫార్మా జీజీహెచ్‌లో రూ.45కోట్లతో అత్యాధునిక కేన్సర్ సెంటర్‌ను నిర్మించడం పట్ల కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్,


రేడియో థెరపీ యంత్రాన్ని పరిశీలిస్తున్న వైద్య శాఖ మంత్రి సత్యకుమార్, కేంద్ర మంత్రి పెమ్మసాని

సత్యకుమార్... నాట్కో వైస్ ప్రెసిడెంట్ (కార్పోరేట్ వ్యవహారాలు) నన్నపనేని సదాశివరావును అభినందించారు. నాట్కో బాటలో ఇతర కార్పొరేట్ కంపెనీలు ముందుకు వచ్చి జీజీహెచ్‌కి చేయూతనివ్వాలని కోరారు. ప్రభుత్వాస్పత్రి ఆవరణలో రూ.100కోట్ల భారీ వ్యయంతో ఎంసీహెచ్ బ్లాక్‌ను నిర్మిస్తున్న 'జింకానా' వితరణను ప్రశంసించారు.

ఐదేళ్లలో ఎన్‌హెచ్‌లకు 35,300 కోట్లు

గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలోని జాతీయ రహదారుల కోసం కేంద్ర ప్రభుత్వం రూ.35,300 కోట్లు ఖర్చు చేసిందని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో శనివారం పోస్టు పెట్టారు. ఇందులో 2023-24లోనే రూ.11,780 కోట్లు వెచ్చించారని పేర్కొన్నారు. నిధులు మంజూరు చేసిన ప్రధాని మోదీకి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

'సహకారం'లో అవినీతిపై విచారణ

- బకాయిల వసూళ్లపై దృష్టి పెట్టండి: మంత్రి అచ్చెన్న
- ఆప్కాబ్ వాట్సాప్ బ్యాంకింగ్ సేవలు ప్రారంభం

అమరావతి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో సహకార సంస్థల్లో జరిగిన అవినీతి, కుంభకోణాలపై విచారణ జరపాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఉన్నతాధికారులను ఆదేశించారు. వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేలా సహకార వ్యవస్థ పని చేయాలని నిర్దేశించారు. శనివారం విజయవాడలో ఆప్కాబ్, సహకార శాఖ ఆధ్వర్యంలో డీసీవోలు, డీసీసీబీ సీఈవోలు, డీసీఎంఎస్ అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. ముఖ్య అతిథి మంత్రి అచ్చెన్నాయుడు ఆప్కాబ్ ఆధ్వర్యంలో రూపొందించిన వాట్సాప్ బ్యాంకింగ్ సేవలను ప్రారంభించారు. ఇందులో మంత్రి తొలి సభ్యుడిగా చేరారు. ఈ సందర్భంగా అచ్చెన్న మాట్లాడుతూ... 'ప్రభుత్వానికి వ్యవసాయం, సహకారం అత్యంత ప్రాధాన్యమైనవి. గత ఐదేళ్లలో అస్తవ్యస్తమైన సహకార వ్యవస్థను గాడిలో పెట్టి, సహకార సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలందిస్తాం. వాణిజ్య బ్యాంకులకు ధీటుగా సహకార బ్యాంకులను తీర్చిదిద్ది, నూతన సంస్కరణలతో రైతులకు మేలు చేస్తాం. కౌలు రైతుల్ని కూడా సహకార సంఘాల్లో సభ్యులుగా చేర్చి, రుణాలు, ఇతర ప్రయోజనాలు అందించాలి. ఆప్కాబ్, డీసీసీలు, పీఏసీఎస్‌ల ద్వారా మహిళా సంఘాలకు అధిక శాతం రుణాలివ్వాలి. సహకార సంస్థలకు రావాల్సిన బకాయిల వసూళ్లపై దృష్టి పెట్టాలి' అని మంత్రి సూచించారు.



త్వరలో కొత్త కౌలుదారీ చట్టం

కౌలు సాగుదారులకు ఉరితాడులా మారిన గత ప్రభుత్వ కౌలు రైతు చట్టాన్ని రద్దు చేసి, ప్రతి కౌలుదారుకీ మేలు జరిగేలా త్వరలో కొత్త చట్టం తెస్తామని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. 'సీసీఆర్సీ పేరుతో అనాలోచిత చట్టం తెచ్చి, గత ప్రభుత్వం కౌలు రైతుల్ని నట్టేట ముంచింది. అందుకే 2019లో తెచ్చిన చట్టాన్ని రద్దు చేసి, 2016లో చేసిన చట్టాన్ని అమలు చేస్తాం. చిట్టచివరి కౌలు రైతుకు కూడా న్యాయం జరగాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. కౌలు రైతులకు సులభంగా రుణాలు అందే పరిస్థితి ఉండాలి' అని మంత్రి అన్నారు. సమావేశంలో వ్యవసాయ సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఆప్కాబ్ చైర్మన్ అహ్మద్‌బాబు, ఎండీ శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు ఉచిత బీమా అమలు చేయాలి మంత్రి అచ్చెన్నకు సంఘం నేతల వినతి

రాష్ట్రంలో మేకలు, గొర్రెల పెంపకదారుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నేతలు మంత్రి అచ్చెన్నాయుడిని కోరారు. శనివారం విజయవాడలో మంత్రిని సంఘ అధ్యక్షుడు గంటా శ్రీరామ్, కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి కలిశారు. మేకలు, గొర్రెల కాపరులకు 50% రాయితీతో రూ.5 లక్షల రుణం ఇవ్వాలని, ఎన్సీడీసీ నిధుల్ని రాష్ట్ర సమాఖ్యకు విడుదల చేయాలని, ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి, జీవాలకు ఉచిత బీమా అమలు చేయాలని, ప్రమాదాలతో మృతి చెందిన కాపరులకు రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలని, ఉపాధి హామీ పథకం కింద 90% రాయితీతో జీవాలకు షెడ్లు నిర్మించాలని, వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా వాటికి అవసరమైన అన్ని రకాల టీకాలు, నట్టల నివారణ మందులు ఉచితంగా అందించాలని, వలసలు వెళ్లే జీవాల రక్షణ కోసం దోమ తెరల వంటి వలలు ఇవ్వాలని కోరారు.

జోన్‌కు భూమి చూపించని వైసీపీ ప్రభుత్వం

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



శ్రీకాకుళం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం విశాఖ రైల్వే జోన్‌కు కావాల్సిన భూమి చూపించలేకపోయిందని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. శ్రీకాకుళంలో శనివారం ఆయన మాట్లాడారు. 'విశాఖ రైల్వే జోన్‌కు అవసరమైన భూమిని గత ప్రభుత్వం చూపించలేకపోవడం వల్లనే ప్రక్రియ ఆలస్యమైంది. రైల్వే జోన్ కోసం గతంలోనే కేంద్రం బడ్జెట్ కేటాయించింది. కూటమి ప్రభుత్వం రైల్వే జోన్‌ను టాప్ ప్రయారిటీగా తీసుకుంది. ఇందుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను ప్రారంభించాం' అని వెల్లడించారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక స్కిల్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు.

న్యాయవాదులుగా ఒక్కరోజే 842 మంది నమోదు

అమరావతి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఏపీ బార్ కౌన్సిల్‌లో శనివారం 842 మంది న్యాయవాదులుగా నమోదయ్యారు. ఒకేరోజు ఇంత పెద్దసంఖ్యలో న్యాయవాదులుగా ఎన్‌రోల్ అవ్వడం ఇదే మొదటిసారి. శనివారం హైకోర్టులో ఏర్పాటు చేసిన ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన 842మందితో బార్ కౌన్సిల్ సభ్యులు గంటా రామారావు, చలసాని అజయ్‌కుమార్, కార్యదర్శి పద్మలత ప్రమాణం చేయించి, సర్టిఫికెట్లు అందజేశారు. కష్టపడే తత్వం, క్రమశిక్షణ, నిబద్ధత ఉంటేనే న్యాయవాద వృత్తిలో విజయవంతం అవుతారని బార్ కౌన్సిల్ చైర్మన్ ద్వారకానాథ్‌రెడ్డి అన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.






విరాళాల వెల్లువ

రాష్ట్ర రాజధానికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిసి తమ విరాళాలను ఆయనకు అందజేశారు. కృష్ణా జిల్లా కంకిపాడుకు చెందిన రైతు ఎన్ ప్రభాకరరావు రూ.10లక్షలను రాజధాని అమరావతి నిర్మాణం కోసం ఖర్చు చేయాలని ముఖ్యమంత్రికి అందజేశారు. అలాగే నగరానికి చెందిన నిర్మల రూ.3.42లక్షల చెక్కును ముఖ్యమంత్రికి అందజేసింది. అలాగే బొందలపాటి వెంకయ్య, కొడాలి లక్ష్మీకుమారి ఒక నెల పెన్షన్‌ను చెరి రూ.50వేల చొప్పున ఇద్దరి పెన్షన్ రూ.లక్ష రూపాయల చెక్కును ముఖ్యమంత్రి సహాయనిధి కోసం చంద్రబాబుకు అందజేశారు. అలాగే రిటైర్డ్ ఇంజనీర్ రాజ బాబయ్య, ఆయన సతీమణి కుమలకుమారి దంపతులు రూ.2 లక్షల చెక్కును త్వరలో ప్రారంభం కానున్న అన్న క్యాంటీన్ల నిర్వహణకు ఉపయోగించాలని ముఖ్యమంత్రికి అందజేశారు.



కొల్లు రవీంద్రకు వినతిపత్రం అందజేస్తున్న శంకర్

అక్రమ క్వారీల తవ్వకాలను అడ్డుకోండి

● మంత్రికి వినతిపత్రం

ధర్నాచౌక్: అక్రమ క్వారీల తవ్వకాలను నివారించాలని, క్వారీల లీజుల హద్దులు ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. పరిటాల క్వారీ మృతులకు నష్టపరిహారం చెల్లించాలని, ప్రమాదానికి కారణమైన పవన్ గ్రానైట్స్ మెటల్ వర్క్స్‌ను సీజ్ చేయాలని కోరుతూ మంత్రి కొల్లు రవీంద్రకు శనివారం వినతిపత్రం అందజేశారు. మృతుల కుటుంబాలకు నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, సీపీఐ జిల్లా నేతలు బుట్టి రాయప్ప, లంకా గోవిందరాజులు, తాడి పైడియ్య, కొట్టు రమణారావు, సంగుల పేరయ్య పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు

కృష్ణలంక: రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు బూసి వినీత శనివారం కలెక్టర్ డాక్టర్ జి.సృజనను ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి అక్కడే ఉన్నారు.

ఆత్మరక్షణ కోసమే వైసీపీ శ్రేణులు తిరగబడ్డారు

● మాజీ మంత్రి పేర్ని నాని

గన్నవరం: టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో రిమాండ్‌లో ఉన్న వైసీపీ నేతలను గన్నవరం సబ్‌జైల్‌లో మాజీ మంత్రి పేర్ని నాని, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా పేర్ని నాని మాట్లాడుతూ రాష్ట్రంలో సంపద సృష్టించే పరిస్థితి లేదన్నారు. వైసీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. అమాయకులైన కార్యకర్తలను కేసుల్లో ఇరికించటం అన్యాయమన్నారు. అక్రమ ఇసుక, లే అవుట్ల పైనే ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. వైసీపీ నేతలు రంగారావు, బాబు, రామిశెట్టి వెంకటేశ్వరరావు, కూరేటి శ్రీకాంత్ పాల్గొన్నారు.

న్యాయవాదులు గళం విప్పాలి

● ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని

విజయవాడ లీగల్: ప్రజల హక్కుల్ని కాలరాసేలా ఉన్న చట్టాల సవరణలపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని దీనిపై దేశవ్యాప్తంగా న్యాయవాదులు తమ గళం విప్పాలని, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ చలసాని అజయ్‌కుమార్ సూచించారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం శనివారం సూర్యారావుపేటలోని కార్యాలయంలో జరిగింది. గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.సురేష్‌బాబు మాట్లాడుతూ అంతర్జాతీయ న్యాయవాదుల సంఘం మహాసభలు త్వరలో జపాన్‌లో జరుగనున్నాయన్నారు. కేరళ వరదల బాధితుల సహాయార్థం అసోసియేషన్ తరపున విరాళాలు అందచేయాలన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు కేవీవీ పరమేశ్వరరావు, వి.చంద్రశేఖర్, వెలుగూరి రాధాకృష్ణ, వెంకట్ పాల్గొన్నారు.



అలరించిన సాహితి

ఘనంగా కూచిపూడి రంగప్రవేశం

ప్రశంసించిన అతిరథ మహారథులు, అతిథులు

ఆద్యంతం చప్పట్లతో మార్మోగిన ప్రాంగణం

విజయవాడ కల్చరల్, ఆగస్టు 3: అమెరికాకు చెందిన వేగుంట సాహితి 'ప్రణవాకారం' - ఓంకార రూపిని చిదానంద వధువుని శివగణములకు అధిపతిని సర్వాభరణభూషితుని విశ్వకారుకుని దేవ శివ గణ పరి వేష్టితుడై నటరాజ స్తుతి అంశంతో శ్రీకారం చుట్టి నాట్యాన్ని ప్రారంభించింది. గౌళ, ఆరభి రాగాలలో సాగిన ఈ అంశం నయనానందకరంగా సాగింది. తదుపరి కళ్యాణరాగంలో రుక్మిణీ దరువు అంశంతో రమణీయంగా నర్తించి మెప్పించారు. 3వ అంశంగా రాగమాలిక రాగంలో శివతాండవహేళ, 4వ అంశంగా రాగమాలిక రాగంలో నందగోపాలకృష్ణ, 5వ అంశంగా హిందువుల రాగంలో దేవదేవం భజే అంశాలతో మనోహరమైన నాట్యాన్ని ప్రదర్శించి సాహితీ కనువిందు చేశారు. అతిరథ మహారథుల సమక్షంలో నాట్యం చేసిన సాహితిని అతిథులు, సంగీత విద్వాంసులు మల్లాది బ్రదర్స్, ప్రముఖ నాట్యాచార్యుడు వేదాంతం రాదేశ్యామ్ ప్రశంసించి సత్కరించారు. మృదంగంపై రాజగోపాల్, వేణువుపై వీవీఎస్ మురళి, వయోలిన్‌పై ఆర్.దినకర్, తబలాపై డి.జయకుమార్, ఘటంపై వి.లక్ష్మణ్, వీణపై శశిధర్, గాత్రం శాస్త్రి, నట్టుభంగం హరి రామ్మూర్తిలు సహకరించారు. సాహితీ తల్లిదండ్రులు వేగుంట రవికుమార్, శ్రీరాజ్యం పాల్గొన్నారు.

రాష్ట్రానికి 29 జాతీయ విద్యాసంస్థలు

● మంత్రి సత్యకుమార్ యాదవ్



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సికెల్ సెల్ బాధితులు

భారతీనగర్: నూతన జాతీయ విద్యావిధానం ఉపాధ్యాయులకు, విద్యార్థులకు వరం లాంటిదని ఈ విధానం విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తుందని మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ అన్నారు. విద్యాసంస్థల్లో జాతీయ విద్యావిధానం - 2020 అమలు, సవాళ్లు అనే అంశంపై అఖిల భాతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘ్, రమేష్ ఆసుపత్రి సమీపంలోని స్కూల్‌ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్లు సంయుక్తంగా నిర్వహించిన సదస్సు శనివారం ప్రారంభమైంది. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ జాతీయ విద్యావిధానంతో బట్టీ విధానికి స్వస్తి పలికి సృజనాత్మకత పెంపొందించడంతో పాటు ప్రతి ఒక్కరూ చదువుకునేలా చేయడం నూతన విద్యావిధాన ప్రధాన ఉద్దేశమన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రానికి 29 జాతీయ విద్యాసంస్థలను కేంద్రం ఇచ్చిందన్నారు. దేశంలో ఒక మైక్రోసాఫ్ట్ లాంటి కంపెనీలు సృష్టించాలంటే టెక్నాలజీ విద్య అవసరమన్నారు. ఈ సదస్సు రెండు రోజులు పాటు నిర్వహించబడుతుదన్నారు. స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్ కొండ రమేష్, నేషనల్ జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుంతా లక్ష్మణ, విశిష్ట అతిధులు వర్సిటీ నిధుల సంఘం (యూజీసీ), డిల్లీ జాయింట్ సెక్రటరీ, అవిచల్ రాజ్ కపూర్, సిద్ధార్థ అకాడెమీ అకాడమిక్ అడ్వైసర్‌నార్ల వినయ్ కుమార్, అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహసంఘ్ సభ్యులు అధ్యాపకులు ప్రొఫెసర్లు, ఉపాధ్యాయలు, అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య మంత్రిని కలిసిన సికెల్ సెల్ వ్యాధి బాధితులు

అజిత్‌సింగ్‌నగర్: అరకు ఏజెన్సీకి చెందిన పలువురు సికెల్ సెల్ వ్యాధి బాధితులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను శనివారం వినతిపత్రం ఇచ్చారు. నగరంలోని మంత్రి కార్యాలయంలో ఆయన్ను కలిసిన బాధితులు తమ సమస్యలను వివరించారు. అరకు ఏజెన్సీలో అనేక మంది ఇలాంటి బాధితులున్నారని రక్తహీనతతో బాధపడుతున్న వారిని ఆదుకోవాలని కోరారు. అరకు ఏజెన్సీలోనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసేలా చర్యలు తీసుకోవాలని, బ్లడ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. సెంట్రల్ ట్రైబల్ వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీదేవి, సైంటిస్టు డాక్టర్ బిరుదు రవిబాబు, ప్రభుదాస్, బుల్లి, కొర్ర దేవి ఉన్నారు.

అంబరాన్నంటిన జన్మదిన సంబరాలు





శివనాథ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న పల్లా శ్రీనివాసరావు, బొండా ఉమా, పలువురు నేతలు

వన్‌టౌన్ ఆగస్టు 3: ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) జన్మదిన వేడుకలు శనివారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆడంబరంగా జరిగాయి. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో వచ్చి వేడుకల్లో పాల్గొని ఎంపీ చిన్నికి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస యాదవ్ కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, తంగిరాల సౌమ్య, యార్లగడ్డ వెంకట్రావ్, శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), వెనిగండ్ల రాము, టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ శివనాథ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. చిన్ని స్పందిస్తూ తనపట్ల ఎంతో ప్రేమాభిమానాలు చూపించిన నేతలు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. యలమంచిలి శ్రీనివాస్, పొన్నం రవి, మన్నే కిరణ్, దేవినేని శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న) శుభాకాంక్షలు చిన్నికి తెలిపారు. 40వ డివిజన్‌లో డివిజన్ అధ్యక్షుడు పొనుగుపాటి వెంకట సుబ్బయ్య కేక్ కట్ చేసి శివనాథ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సిటీ టీఎన్‌టీయూసీ గౌరవాధ్యక్షుడు కాండ్రేగుల రవీంద్ర, డివిజన్ సెక్రటరీ గణేష్, మన్నం నారాయణ, గన్నవరపు సురేష్, సీనియర్ నేతలు, మహిళలు హాజరయ్యారు. 42వ డివిజన్‌లో డివిజన్ టీడీపీ అధ్యక్షుడు శివాజీ ముదిరాజ్, జిల్లా రజక సంఘం అధ్యక్షుడు ముదిగొండ శివ ఆధ్వర్యంలో శివాలయం సెంటర్‌లో శివనాథ్ భారీ కటౌట్ ఎదుట కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పొనుగుపాటి చిన సుబ్బయ్య, నియోజకవర్గ టీఎన్‌టీయేసీ అధ్యక్షుడు హనుమంతరావు, మైనార్టీ నేతలు రెహమాన్ బాయ్, ముప్పా విజయ, ఎడవల్లి సంధ్యారాణి పాల్గొన్నారు.

టీడీపీ వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో ఎంపీ కేశినేని చిన్ని జన్మదిన వేడుకలు

విద్యాధరపురం: టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డూండీ రాకేష్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డులోని ఓ కన్వెన్షన్ హాల్‌లో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నేతలు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ఫతావుల్లా, టీడీపీ రాష్ట్ర నేత ఎంఎస్ బేగ్, ఆషా, స్థానిక నేతలు, వాణిజ్య విభాగం నేతలు, చాంబర్ ఆఫ్ కామర్స్ గడ్డం రవి, గొల్లపూడి మార్కెట్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఆర్య వైశ్య నేతలు వీవీకే నరసింహారావు, నూకల నాగేశ్వర రావు, జి.బాబి, సంతోష్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నేతల శుభాకాంక్షలు

ధర్నాచౌక్: ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)కు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ తరుపున రాష్ట్ర ప్రధానకార్యదర్శి పేరెల్లీ ఏలీషా మాదిగ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శనివారం చిన్ని కార్యాలయంలో శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు. చిన్ని మాట్లాడుతూ 30 ఏళ్లుగా మందా కృష్ణమాదిగ చేసిన పోరాటాన్ని ప్రశంసించారు. జిల్లాలో ఎమ్మార్పీఎస్ నాయకత్వానికి అండగా ఉంటానన్నారు. సొంగ సంజయ్ వర్మ, ముని, జిల్లా సురేష్, పేరెల్లి ప్రభుకుమార్, బన్నీ, కిషోర్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమం

పాయకాపురం: ఎంపీ శివనాథ్ (చిన్ని) జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు ఆధ్వర్యంలో స్థానిక వాంబేకాలనీలోని మాతృదేవోభవ వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసిన టీఎన్‌టీయూసీ నేతలు 50 మంది వృద్ధులకు భోజన ఏర్పాట్లు చేసి పండ్లు పంపిణీ చేశారు. నేతలు ఆకుల సూర్యప్రకాష్, బొలిశెట్టి శేషుబాబు, టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లల చరణ్‌సాయి యాదవ్, సూర్యకుమార్, ఇందుకూరి సుధీర్, మెరుగుమాల సాంబశివరావు, మొద్దు మధుబాబు, దుర్గారావు, వలివేటి శ్రీను, గోపి, దాసు, బాలయ యాదవ్, యువ కిషోర్, రాజేష్, చందు, విక్కీ పాల్గొన్నారు.

అంధ, బధిర విద్యార్థుల మధ్య..

గుణదల: ఎంపీ శివనాథ్ (చిన్ని) జన్మదిన వేడుకలు అంధ, బధిర విద్యార్థుల మధ్య శనివారం ఘనంగా జరిగింది. ముందుగా గుణదల్లోని మేరీ మాత గుడి వద్ద మిషనరీస్ ఆఫ్ చారిటీ ప్రేమదాన్ మదర్ థెరిస్సా ఆశ్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ సతీమణి కేశినేని సుజాత నిత్యావసర సరుకులు అందజేశారు. గుణదల కార్మిల్‌నగర్లోని అంధ, బధిర పాఠశాల్లోని విద్యార్థులకు అవసరమైన కంప్యూటర్ ప్రింటర్, 25 సీలింగ్ ఫ్యాన్లు, బాలికలకు నోట్‌పుస్తకాలు పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. మడోన్నా ఇన్‌స్టిట్యూట్స్ తరపున సిస్టర్ గ్లోరి, విజయ మేరీ అంధుల పాఠశాల తరపున హెచ్‌ఎం. సిస్టర్ రాజీ, ప్రేమదాన్ మదర్ థెరిస్సా ఆశ్రమం తరపున సిస్టర్ లసిట పాల్గొన్నారు.

కార్డుదారులకు సకాలంలో రేషనివ్వండి

● జాయింట్ కలెక్టర్ నిధి మీనా

కృష్ణలంక, ఆగస్టు 3: జిల్లాలోని374 ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారులకు నిర్దేశించిన గడువులోగా రేషన్ అం దజేయాలని జాయింట్ కలెక్టర్ నిధి మీ నా ఆదేశించారు. జిల్లా పౌరసరఫరా శా ఖాధికారులతో కలిసి శనివారం సింగ్‌నగర్ వద్ద మొబైల్ డిస్పెన్సరీ వెహికల్ (ఎండీయూ) ద్వారా కార్డుదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న విధానాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభు త్వం పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ కార్డుదారులకు నాణ్యమైన నిత్యావసర వస్తువులతో పా టు ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్ఠంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రతినెల 17లోగా ఎండీయూ ఆపరేటర్లు తమ పరిధిలోని రేషన్ పంపిణీ పూర్తిచేయాలన్నా రు. పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్లు పంపిణీని పర్యవేక్షించాలన్నారు. అనంతరం రైతుబజార్‌లో బియ్యం, కందిపప్పు అమ్మకాల ప్రత్యేక కౌంటర్‌ను జేసీ పరిశీలించారు. జేసీతో పాటు డీఎస్‌వో ఎం.మోహన్‌బాబు, రైతు బజార్ ఎస్టేట్ అధికారి కోటేశ్వరరావు ఉన్నారు.

సీఎం దృష్టికి రేషన్ డీలర్ల సమస్యలు

మొగల్రాజపురం: ముఖ్యమంత్రి చంద్రబా బు దృష్టికి రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కార నిమిత్తం తాడేపల్లిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గ్రీవెన్స్‌లో వినతి పత్రం రూపంలో అందచేసినట్టు జిల్లా రేషన్ డీలర్స్ సంఘం ప్రధాన కార్యదర్శి పి.శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. డీలర్స్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ జొన్నల గడ్డ శ్రీనివాసరావు, కోశాధికారి పోశంశెట్టి పూర్ణ పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

● న్యాయం చేయాలంటూ ఆరుగొలనులో రహదారి దిగ్బంధనం

హనుమాన్‌జంక్షన్ రూరల్, ఆగస్టు 1: బైక్‌పై వెళుతున్న వ్యక్తిని కారు వెనుక నుంచి ఢీకొనడంతో మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆరుగొలనుకు చెందిన దేవాబత్తుల ఏసురత్నం (45) శుక్రవారం రాత్రి పని ముగించుకుని ఇంటికి వెళుతుండగా ఆరుగొలను వద్ద వెనుక నుంచి వస్తున్న కారు ఢీ కొంది. ఘటనతో బైక్‌పై నుంచి ఏసురత్నం పడిపోగా కారు ఆగకుండా వెళ్లిపోయింది. తీవ్రగాయాలతో ఉన్న వ్యక్తికి రాత్రిపూట కావడంతో సహాయం చేయకపోవడంతో మృతి చెందాడన్నారు. మృతుడు వంటపని చేస్తుంటాడని, భార్య, ఇద్దరు పిల్లలున్నట్టు బంధువులు తెలిపారు. పోలీసుల మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపించి కేసు నమోదు చేశామని ఎస్సై జనార్దన్ తెలిపారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని శనివారం సాయంత్రం మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి నిరసన చేపట్టారు. దీంతో దాదాపు 3కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌జామ్ అయింది. సీఐ నరసింహమూర్తి, టీడీపీ మండలాధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు మృతుడి బంధువులతో మాట్లాడి న్యాయం చేస్తామన్నా ససేమిరా అనడంతో రాత్రి 9గంటలకు వరకూ ట్రాఫిక్‌కు అలాగే నిలిచిపోయింది.

ప్రకాశం-కృష్ణా మూడ్రోజుల క్రికెట్ మ్యాచ్ డ్రా

విజయవాడ స్పోర్ట్సు: మూలపాడు వేదికగా ఏసీఏ సెంట్రల్ జోన్ సీనియర్ పురుషుల క్రికెట్ టోర్నీలో ప్రకాశం-కృష్ణా జట్ల మధ్య మ్యాచ్ శనివారం డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో కృష్ణాజట్టు 715/9 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేయగా, 37 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో ప్రకాశం చివరిరోజు బరిలో దిగింది. ఆట ముగిసే సమయానికి 84.4 ఓవర్లకు 427 పరుగులకు ఆలౌటై డ్రాగా ముగిసింది. కృష్ణా టీమ్‌కు 3 పాయింట్లు, ప్రకాశం 1 పాయింట్ లభించింది.

దుర్గమ్మకు సారె సమర్పణ

వన్‌టౌన్, ఆగస్టు 3: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు దేవస్థానం శానిటేషన్ విభాగం సిబ్బంది శనివారం సారె సమర్పించారు. తొలుత బ్రాహ్మణవీధిలోని జమ్మిదొడ్డిలో ఈవో కేఎస్ రామారావు దంపతులకు సిబ్బంది, అధికారులు సాదర స్వాగతం పలికి దుశ్శాలువా కప్పి సత్కరించారు. అనంతరం ఈవో దంపతులు, ఏఈవో పి.చంద్రశేఖర్ కొబ్బరికాయలు కొట్టి సారె ఊరేగింపును ప్రారంభించారు. సారె తీసుకుని ఊరేగింపుగా కొండపైకి చేరుకుని 6వ అంతస్తులో ఉత్సవమూర్తి వద్ద పూజలు చేసి సారె సమర్పించారు. ఉప కార్యనిర్వహణాధికారి లీలా కుమార్, స్థానాచార్యుడు విష్ణుభొట్ల శివప్రసాద్ శర్మ, ఈఈ లింగం రమాదేవిలు పాల్గొన్నారు. నిత్యాన్నదానానికి గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన ముళ్లపూడి వెంకట సత్య భగవాన్ శనివారం రూ.1,01,116 విరాళాన్ని చెక్కు రూపంలో ఈవో రామారావుకు అందించారు.

దుర్గమ్మను దర్శించుకున్న శివస్వామి

తాళ్లాయపాలెం శివస్వామి శనివారం కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఈవో రామారావు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. దుర్గమమను దర్శించుకున్న శివస్వామికి శేషవస్త్రం, ప్రసాదం, ఆశీస్సులు, చిత్రపటం అందజేశారు.



ధర్మపథం వేదికపై నృత్యప్రదర్శన

స్థానిక ధర్మపథం వేదికపై శనివారం నగరానికి చెందిన వెంకటేశ్వర ఆర్ట్స్ అకాడమీ బృందంచే కూచిపూడి నృత్యాభినయం నిర్వహించారు. చింతా వెంకట శివరామకృష్ణ కుమార్ ఆధ్వర్యంలోని ఈ బృందం పలు కీర్తనలకు చక్కటి హావ భావ ప్రదర్శనతో ఆహుతులను అలరించి భక్తుల నుంచి ప్రశంసలు అందుకున్నారు.

విద్యార్థులకు సామాజిక బాధ్యత ఉండాలి: కలెక్టర్

విజయవాడ కల్చరల్: విద్యార్థులు విద్యతో పాటు సామాజిక బాధ్యతను కలిగి జీండాలని కలెక్టర్ డాక్టర్ సృజన అన్నారు. శనివారం నగరంలోని సుజనా వెన్యూలో జరిగిన రెజోనెన్స్ విద్యార్థుల రెజో పరిచయ్‌లో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మరో అతిథి వీపీ సిద్ధార్థ ప్రిన్సిపల్ సీతారామయ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక రోల్‌మోడల్‌ను ఎంచుకుంటే తద్వారా ఉన్నత శిఖరాలు అందుకోవచ్చన్నారు. తొలుత రిజోనెన్స్ డైరెక్టర్ బండ్ల మాదవరావు అతిథులను సభకు పరిచయం చేయగా, సీఈవో గౌతంసాయి, చైర్మన్ కొమ్మినేని వెంకటేశ్వరరావు, అకాడమిక్ డీన్ వి.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ రాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అభిజిత్ సిన్హా

పంజాబ్ నేషనల్ బ్యాంకులో అవయదానంపై అవగాహన

భవానీపురం, ఆగస్టు 3: ఈడ్పుగల్లు జడ్పీ హైస్కూల్‌లో పంజాబ్ నేషనల్ బ్యాంకు ఆధ్వర్యంలో భారత అవయవదానంపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు సర్కిల్ హెడ్ అభిజిత్ సిన్హా మాట్లాడుతూ అవయవదాన ప్రాముఖ్యత, ఏ సందర్భాల్లో మనం అవయదానం చేయాలి, ఎలా చేయాలి, అన్న ప్రభుత్వ విధానాలను వివరించారు. బ్యాంకు సామాజిక సేవ (సీఎస్‌ఆర్) కింద హైస్కూల్‌కు కుర్చీలు, బీరువాలను అభిజిత్ సిన్హా, శ్రీనివాసరావు అందజేశారు. ఏజీఎం ఎం శ్రీనివాసరావు, బ్యాంకు సిబ్బంది, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ క్రీడా పోటీలకు రాష్ట్రస్థాయి క్రీడాకారుల ఎంపిక

బస్టేషన్ ఆగస్టు 3: ఏపీఎస్‌ఆర్టీయూ ఆధ్వర్యంలో ఈ ఏడాది సెప్టెంబర్‌లో నిర్వహించనున్న అఖిల భారత రవాణా సంస్థల క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు గుంటూరు జిల్లా నాగార్జున వర్సిటీ వేదికగా శనివారం రాష్ట్రస్థాయి క్రీడాకారుల ఎంపికను నిర్వహించారు. 4 జోన్ల నుంచి మొత్తం 140 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో 13 కేటగిరిలకు 69 మందిని వివిధ క్రీడల్లో పాల్గొనేందుకు ఎంపిక చేశారు. ఏపీ ప్రజా రవాణా సంస్థ అడ్మిన్ ఈడీ కేఎస్ బ్రహ్మానందరెడ్డి జెండా ఊపి ఎంపికలను ప్రారంభించారు. ఏపీఎస్‌ఆర్టీసీ ఎండీగా పనిచేసిన ద్వారకా తిరుమలరావు పోటీలు నిర్వహణకు కృషి చేశారని, చీఫ్ ఇంజనీర్ (ఐటీ) వాసా సుధాకర్ ఆధ్వర్యంలో క్రీడలను నిర్వహించనున్నారన్నారు. నాగార్జున వర్సిటీ వైస్ చాన్సలర్ లక్ష్మణరావు, ప్రిన్సిపల్ జాన్సన్, క్రీడా విభాగం డైరెక్టర్ శివకుమార్, కోచ్ కృష్ణమోహన్‌కు అధికారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

భూ అధీకృత చట్ట అమలు కోరుతూ సీఎంకు వినతి

ఏపీ కౌలురైతుల సంఘం వెల్లడి

భవానీపురం: వైసీపీ ప్రభుత్వం తెచ్చిన కౌలురైతుల చట్టాన్ని రద్దు చేసి, 2011 భూ అధీకృతచట్టాన్ని అమలు చే యాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు శనివారం వినతిప త్రం అందజేసినట్లు ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయాన్ని 80 శాతం కౌలు రైతులు, చిన్నసన్నకారు రైతులే సాగు చేస్తున్నారని, గ్రామ సభల ద్వారా రైతులను గుర్తించి భూ యజమానుల సంతకంతో సంబంధం లేకుండా గ్రామ రెవెన్యూ అధికారులే కౌలురైతులను గుర్తించి కార్డులివ్వాలని, పంట నమోదు (ఈక్రాప్) కౌలు రైతుల పేరుతోనే నమోదు చేయాలని, కౌలు రైతులకు సొంత పూచీకత్తుపై రూ.లక్ష వరకు పంటరుణాలను ఇవ్వాలని డిమాండ్లతో కూడిన వినతి అందించినట్టు తెలిపారు.

ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు రెండో విడత ఎంపిక జాబితా విడుదల

▸ 9న కౌన్సెలింగ్.. 21న తరగతులు ప్రారంభం

వేంపల్లె, ఆగస్టు 3: రాష్ట్రంలో ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు రెండో విడత ఎంపిక జాబితాను ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా విడుదల చేశారు. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఆర్జీయూకేటీ-2024-25 విద్యాసంవత్సరం అడ్మిషన్ కన్వీనర్ అమరేంద్రకుమార్ సంద్ర ఆధ్వర్యంలో శనివారం ఈ జాబితా విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 753 సీట్లు మిగలగా విద్యార్థులను మెరిట్ ఆధారంగా ఎంపిక చేశామని వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు అందుబాటులో ఉంచామన్నారు. ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్ ఐటీల్లో సీటు వచ్చిన విద్యార్థులకు ఈ నెల 9వ తేదీన ఇడుపులపాయ క్యాంపస్‌లో.. అదేరోజు నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో సీటు లభించిన విద్యార్థులకు నూజివీడు క్యాంపస్‌లో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఆయా క్యాంపస్‌లకు విద్యార్థులు హాజరై అడ్మిషన్ పొందాలని సూచించారు. ఇప్పటికే అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఈ నెల 19, 20 తేదీల్లో సంబంధిత ట్రిపుల్ ఐటీల్లో రిపోర్టు చేయాలని 21వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.

ప్రత్యేక కేటగిరీ జాబితా త్వరలో విడుదల

నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ప్రత్యేక కేటగిరీకి సంబంధించి ఎన్‌సీసీ, ఫిజికల్ హ్యాండికాప్డ్, స్పోర్ట్స్ కేటగిరీలో సీట్ల జాబితా త్వరలో విడుదల చేస్తామని అమరేంద్ర తెలిపారు. 260సీట్లు ఉన్నాయని, వీటికి సంబంధించి సర్టిఫికెట్లు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే స్కౌట్, క్యాప్ విద్యార్థుల జాబితాను విడుదల చేశామన్నారు.

కటాఫ్ మార్కులు

మెరిట్ ఆధారంగా రెండో విడత ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదలైంది. కటాఫ్ మార్కులు ఓసీ-589, బీసీ-ఏ 589, బీసీ-బీ 589, బీసీ-సీ 565, బీసీ-డీ 589, బీసీ-ఈ 584, ఎస్సీ-584, ఎస్టీ 573, ఈడబ్ల్యూఎస్‌కు 589గా నిలిచాయి.

ద్వారంపూడి రూ.600 కోట్ల దోపిడీపై విచారణ జరిపించాలి

▸ కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు

▸ ఆధారాలతో లేఖ కలెక్టర్‌కు అందజేత

కాకినాడ సిటీ, ఆగస్టు 3: 2019 నుంచి 2024 వరకు ఐదేళ్ల కాలంలో కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సాగించిన రూ.600 కోట్ల కార్పొరేషన్ నిధుల దోపిడీపై శాఖల వారీగా సమగ్ర విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని ప్రస్తుత ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కోరారు. ఇందుకు సంబంధించి ఆధారాలతో లేఖను జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌కు శనివారం అందజేశారు. అనంతరం కాకినాడ కలెక్టరేట్ ఆవరణలో కొండబాబు మీడియాకు వివరాలు వెల్లడించారు. తాను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ద్వారంపూడి దోపిడీపై సమగ్ర వివరాలతో ఆరోపణలు చేశానని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆధారాలతో కలెక్టర్‌కు లేఖ అందజేశానని తెలిపారు.

చంద్రశేఖర్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలి

▸ ఐఆర్ కన్నా ఫిట్మెంట్ తక్కువ ఇప్పించిన చరిత్ర నీది: భానుమూర్తి

గుంటూరు సిటీ, ఆగస్టు 3: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కొన్ని రోజులైనా కాకముందే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్న ఏపీఎన్‌జీవో మాజీ అధ్యక్షుడు, ప్రభుత్వ మాజీ సలహాదారు చంద్రశేఖర్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని తెలుగునాడు మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భానుమూర్తి హెచ్చరించారు. శనివారం గుంటూరులో ఆయన మాట్లాడుతూ చంద్రశేఖర్‌రెడ్డి తన కేసుల కోసం ఉద్యోగుల ప్రయోజనాలు తాకట్టు పెట్టారని విమర్శించారు. ఆయన ఎన్జీవో నేతగా ఉన్నప్పుడే జగన్ ప్రభుత్వం ఐఆర్ కన్నా పీఆర్సీ ఫిట్మెంట్ తగ్గించి ఉద్యోగుల పొట్ట కొట్టిందన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు 43% ఫిట్మెంట్ ఇచ్చిన విషయాన్ని చంద్రశేఖర్‌రెడ్డి మర్చిపోయినా రాష్ట్రంలోని ఉద్యోగులు మర్చిపోలేదన్నారు. జగన్ పరిపాలనలో ఏనాడూ నెల మొదటి రోజున ఉద్యోగులు జీతాలు తీసుకోలేదన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు నెలల నుంచి ప్రతినెల మొదటి తేదీనే ఉద్యోగులు జీతాలు తీసుకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగుల ప్రయోజనాల కోసం కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఉద్యోగులు దాచుకున్న సొమ్మును కూడా గత ప్రభుత్వం వారికి ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టిందని గుర్తు చేశారు.

తాడేపల్లి ప్యాలెస్.. కల్కి కాంప్లెక్స్

- అక్కడి నుంచే అరాచకాలు
- వైసీపీ హయాంలో లక్ష కోట్ల మద్యం కుంభకోణం
- ఎస్సీ వర్గీకరణ చారిత్రాత్మకం: మాజీ మంత్రి డొక్కా



తుళ్లూరు, ఆగస్టు 3: 'తాడేపల్లి కల్కి కాంప్లెక్స్' నుంచే అరాచకాలు జరుగుతున్నాయని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. జగన్ తాడేపల్లి ప్యాలెస్‌ను ఆయన కల్కి కాంప్లెక్స్‌గా అభివర్ణించి ఈ వ్యాఖ్యలు చేశారు. శనివారం ఆయన రాజధాని వెంకటపాలెంలో గల వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, కల్కి కాంప్లెక్స్ కమాండర్ ప్రభుత్వ మాజీ ముఖ్యసలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి కనుసన్నల్లోనే రాష్ట్రంలో అరాచకాలు జరుగుతున్నాయన్నారు. రౌడీ డాన్‌లకు కావాల్సిన ఆర్థిక వనరులను అక్కడి నుంచే అందజేస్తున్నాడని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దెబ్బతీయాలని ఇటీవల తాడేపల్లి కాంప్లెక్స్‌లో రౌడీ డాన్‌లతో సమావేశం అయ్యారని చెప్పారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు లేకుండా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. రాజధాని రైతుల వార్షిక కౌలు ఐదు సంవత్సరాలు పెంచడం హర్షణీయమన్నారు. న్యాయ చరిత్రలో ఎస్సీ వర్గీకరణ చరిత్రాత్మక విషయమని డొక్కా అన్నారు. మందకృష్ణ ఉద్యమం ఇప్పటికి ఫలించిందని పేర్కొన్నారు. 2000 సంవత్సరంలో చంద్రబాబు ఎస్సీ కేటగిరీస్ యాక్ట్ తీసుకొచ్చారని, దానివల్లే సుప్రీం కోర్టులో వర్గీకరణ సాధ్యమైందని, దీనికి చంద్రబాబుకు తన ప్రత్యేక కృతజ్ఞతలు చెపుతున్నానని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాం లో లక్ష కోట్ల మద్యం కుంభకోణం జరిగిందని, దాన్ని రికవరీ చేసి, జే బ్రాడ్స్ తాగి నష్టపోయిన వారి కుటుంబాలకు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనే ధ్యేయం

- ఖాదీ బోర్డు ద్వారా 25 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తాం
- యువతకు సబ్సిడీపై రుణాలిచ్చి, శిక్షణ ఇస్తాం: మంత్రి సవిత



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న మంత్రి సవిత

మంగళగిరి సిటీ, ఆగస్టు 3: ఖాదీ గ్రామీణ పరిశ్రమల మండలి ద్వారా గ్రామీణ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం ఎర్రబాలెంలోని ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు కార్యాలయం, చేనేత జౌళి శాఖ కార్యాలయం, ఆప్కో గోదాములను శనివారం ఆమె పరిశీలించారు. కార్యాలయాల పనితీరును, ఖాదీ, చేనేత ఉత్పత్తులు, గోదాముల్లోని నిల్వలను పరిశీలించారు. అమ్ముడుపోని చేనేత వస్త్రాలను రాయితీపై విక్రయించాలని సూచించారు. అనంతరం ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో ఉద్యోగ ఉపాధి అవకాశాల్లేక.. గంజాయి, మద్యం విచ్చలవిడిగా లభ్యం కావడంతో యువత చెడు మార్గంలో పయనించిందని చెప్పారు. యువతను సన్మార్గంలో నడిపేందుకు, వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తామన్నారు. రాబోయే ఏడాది కాలంలో ఖాదీ బోర్డు ద్వారా 25 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. 8వ తరగతి విద్యార్హతతో రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు సబ్సిడీపై రుణాలిచ్చి ఉపాధి మార్గాలను చూపుతామన్నారు. యువతకు శిక్షణ ఇచ్చేందుకు ప్రతి జిల్లా కేంద్రంలో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

కాంగ్రెస్‌లోకి బిగ్‌బాస్ ఫేమ్ నూతన్ నాయుడు

అమరావతి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సమక్షంలో బిగ్‌బాస్ ఫేమ్ నూతన్ నాయుడు కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని షర్మిల నివాసంలో శనివారం నూతన్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

స్కూల్ ఎగ్గొట్టేందుకు... బాంబు బెదిరింపు మెయిల్

- ఢిల్లీలో 14 ఏళ్ల విద్యార్థి నిర్వాకం

న్యూఢిల్లీ, ఆగస్టు 3: పాఠశాలకు వెళ్లడం ఇష్టంలేని ఓ విద్యార్థి చేసిన అల్లరి పని... ఢిల్లీలోని సమ్మర్ ఫీల్డ్స్ స్కూల్ యాజమాన్యానికి ముచ్చెమటలు పట్టేలా చేసింది. పాఠశాలలో బాంబు ఉందంటూ గురువారం అర్ధరాత్రి సమయంలో మెయిల్ వచ్చింది. శుక్రవారం ఉదయం మెయిల్ చూసుకున్న సిబ్బంది... అప్పటికే పాఠశాల ప్రారంభంకావడంతో, హుటాహుటిన విద్యార్థులను బయటకు తరలించారు. తర్వాత రంగంలోకి దిగిన పోలీసులు... మెయిల్ పంపింది అదే పాఠశాలకి చెందిన 14 ఏళ్ల విద్యార్థిని కనిపెట్టారు. స్కూల్ ఎగ్గొట్టడం కోసమే ఈ పనిచేశానని అతను అంగీకరించాడు. అయితే, కేవలం తమ పాఠశాల అంటే అనుమానం వస్తుందని భావించిన ఆకతాయి... తాను పంపిన మెయిల్‌లో, మరో రెండు పాఠశాలల్లో కూడా బాంబును అమర్చినట్లు పేర్కొన్నాడు. కాగా, మే 2న ఢిల్లీలోని ఏకంగా 131 పాఠశాలలకు ఇలాగే బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాం.

ఐదేళ్ల బాలికపై అత్యాచారం

కలికిరి, ఆగస్టు 3: అభం శుభం తెలియని ఐదేళ్ల బాలికపై పద్నాలుగేళ్ల బాలుడు అత్యాచారానికి పాల్పడిన సంఘటన కలికిరి మండలంలో కలకలం రేపింది. అన్నమయ్య జిల్లా కలికిరి మండలానికి చెందిన ఐదేళ్ల బాలిక ఒకటో తరగతి చదువుతోంది. అదే గ్రామానికి చెందిన పద్నాలుగేళ్ల బాలుడు పదో తరగతి చదువుతున్నాడు. శనివారం పాఠశాల వదిలిన తర్వాత 'స్వీట్లు ఇస్తాను రమ్మంటూ' ఆ బాలుడు బాలికను తన ఇంటికి తీసుకెళ్లాడు. ఇంట్లోకి వెళ్లగానే తలుపు గడియ వేసి అత్యాచారానికి పాల్పడ్డాడు. అక్కడి నుంచి బాలిక ఏడుస్తూ ఇంటికెళ్లింది. రక్తమోడుతున్న బాలికను చూసిన తల్లిదండ్రులు విషయం తెలుసుకుని... కలికిరి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు బాలికను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, బాలుడిని, అతడి తల్లిదండ్రులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసు ఇన్‌స్పెక్టర్ ఆర్.మోహన్ తెలిపారు.

సమాజ్‌వాదీ నేత బేకరీపై బుల్డోజర్

- 12 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసినట్టు ఆరోపణలు
- అయోధ్యలో ఘటన

అయోధ్య, ఆగస్టు 3: స్థానిక సమాజ్‌వాదీ పార్టీ నేత మోయిన్ ఖాన్ బేకరీని శనివారం జిల్లా అధికారులు బుల్డోజర్‌తో నేలమట్టం చేశారు. ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అధికారులు ఆ బేకరీని సీల్ చేసి, అక్కడి పదార్థాలను పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపించారు. 12 ఏళ్ల బాలికను ఆ బేకరీలో తన సహాయకునితో కలిసి గ్యాంగ్ రేప్ చేసినట్టు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. మోయిన్ ఖాన్..ఫైజాబాద్ ఎంపీ అవధేశ్ ప్రసాద్ (ఎస్పీ)కి చాలా సన్నిహితుడన్న గుర్తింపు ఉంది. సబ్ డివిజనల్ మేజిస్ట్రేటు సోహావాల్ రెవెన్యూ అధికారులతో కలిసి వెళ్లి మెయిన్ ఖాన్ ఆస్తుల కొలతలు తీశారు. అనంతరం బుల్డోజర్‌ను ప్రయోగించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ శుక్రవారం బాధితురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అసెంబ్లీలోనూ ఈ విషయాన్ని ప్రస్తావించారు. నిందితులపై సమాజ్‌వాదీ పార్టీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ బేకరీ పురకలంధర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఉండడంతో ఈ సంఘటనకు బాధ్యులను చేస్తూ ఆ స్టేషన్ ఇన్‌చార్జి రతన్ శర్మ, భదర్సా అవుట్ పోస్టు ఇన్‌చార్జి అఖిలేష్ గుప్తాను అధికారులు సస్పెండ్ చేశారు.

అంగళ్లులో వైసీపీ అరాచకానికి నేటితో ఏడాది



రాళ్ల దాడి నుంచి చంద్రబాబును కాపాడుతున్న ఎన్ఎస్జీ కమాండోలు (ఫైల్)

పోలీసుల సహకారంతో చంద్రబాబుపై రాళ్ల దాడి

- ఆరు కేసుల్లో ఐదు టీడీపీ వర్గీయులపైనే...
- బాబుతో సహా ముఖ్య నేతలపై సెక్షన్ 307
- సుమారు 750 మందిపై పలు సెక్షన్లతో కేసులు
- అనేక మంది 45 రోజులపాటు జైళ్లలోనే...
- విచారణకు మంగళం... చార్జ్‌షీట్ ఊసే లేదు
- ఘటనకు కారణమైన వైసీపీ నేతలు, ఖాకీలపై కేసులు పెట్టి శిక్షించాలని కోరుతున్న 'దేశం' శ్రేణులు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి)

అన్నమయ్య జిల్లాలో ప్రాజెక్టుల సందర్శనకు వచ్చిన అప్పటి ప్రతిపక్ష నేత, మాజీ సీఎం చంద్రబాబుపై వైసీపీ శ్రేణులు రాళ్ల దాడి చేశాయి. అడ్డుకోవాల్సిన పోలీసులు తిరిగి ఆయనపైనే అక్రమంగా హత్యాయత్నం కేసు పెట్టారు. ఈ దురదృష్టకర, దుర్మార్గపు ఘటన జరిగి నేటికి సరిగ్గా ఏడాది అవుతోంది. అప్పట్లో ఈ సంఘటన దేశవ్యాప్తంగా సంచలనమైంది. ఈ సంఘటనలో పోలీసులు ఆరు కేసులు నమోదు చేశారు. అందులో ఐదు కేసులు... హత్యాయత్నం వంటి తీవ్ర సెక్షన్లతో టీడీపీ వర్గీయులపై నమోదు చేశారు. సంఘటన జరిగిన రోజు ఈ రాష్ట్రంలోనే లేని వాళ్లపైనా కేసులు నమోదు చేసి 45 రోజు లు జైలుకు పంపారు. ఘర్షణకు కారణమైన వైసీపీ నాయకులపై కంటి తుడుపుగా బెయిలబుల్ కేసులు నమోదు చేశారు. తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె నియోజకవర్గాలకు చెందిన సుమారు 750 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలను కేసుల పేరుతో వేధించారు. సంఘటన జరిగి నేటికి ఏడాది కావస్తోంది.

నాడు జరిగింది ఇదీ...

వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో నాశనమవుతున్న ప్రాజెక్టుల పరిశీలనకు ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు పర్యటన చేపట్టారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న హంద్రీనీవా కాలువను పరిశీలించారు. ములకలచెరువు మండలంలో నాయనిచెరువు వద్ద రైతులతో మాట్లాడారు. చంద్రబాబు జిల్లాలోకి అడుగు పెట్టక ముందే అంగళ్లలో వందలాది మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు కడప మార్గంలోని ఓ కల్యాణ మండపంలో గుమికూడారు. పోలీసుల సహకారంతో జాతీయ రహదారిపై నల్ల బెలూన్లు, వైసీపీ జెండాలతో ఉన్న వైసీపీ నాయకులు చంద్రబాబు కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. రాళ్లు, ఇనుపరాడ్లు, కర్రలతో టీడీపీ శ్రేణులపై దాడికి పాల్పడ్డారు. టీడీపీ జెండా కట్టుకుని వెళుతున్న పలువురు ద్విచక్ర వాహనదారులపై దాడికి పాల్పడ్డారు. చంద్రబాబు ఉన్న వాహనంపైకి రాళ్లు పడుతుండడంతో ఆయన భద్రతాసిబ్బంది (ఎన్ఎస్జీ కమెండోలు) తమ చేతిలో ఉన్న షీల్డ్‌లను అడ్డుపెట్టి దెబ్బలు తగలకుండా కాపాడారు. దీంతో సహనం కోల్పోయిన చంద్రబాబు దాడికి పాల్పడుతున్న వైసీపీ నాయకులను తరిమికొట్టమని తమ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దీంతో తిరగబడ్డ టీడీపీ నాయకులు వైసీపీ వర్గీయులను తరిమికొట్టారు. ఈ సంఘటనలో ఇరువర్గాలకు దెబ్బలు తగిలాయి. ఇదంతా అప్పటి మదనపల్లె డీఎస్పీ కేశప్ప సమక్షంలోనే జరగడం విశేషం. ఓ వైసీపీ నేత ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా చంద్రబాబు సహా.. పలువురు టీడీపీ ముఖ్య నాయకులపై హత్యాయత్నంతో పాటు అనేక ఆరోపణలతో కేసులు కట్టారు. మరో నాలుగు కేసుల్లో తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె నియోజకవర్గాలకు చెందిన తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా ఉన్న నాయకులు, కార్యకర్తలను ఇరికించారు. అప్పట్లో మదనపల్లె రూరల్ సీఐగా పనిచేసిన శివాంజనేయులు వైసీపీ నాయకుల సూచనల మేరకు అమాయకులపై సైతం కేసులు పెట్టారనే ఆరోపణలు ఉన్నాయి.



అంగళ్లలో రాళ్లదాడి చేస్తున్న వైసీపీ కార్యకర్తలు (ఫైల్)

రెచ్చిపోయిన వైసీపీ నేతలపై కేసులు పెట్టాలి

అధికారం, పోలీసుల అండ చూసుకుని అప్పట్లో రెచ్చిపోయిన వైసీపీ నాయకులపై కేసులు నమోదు చేయాలని టీడీపీ నాయకులు కోరుతున్నారు. అంగళ్లలో ఆరోజు విధ్వంసానికి పాల్పడిన వైసీపీ నాయకులు పలువురు గత ఐదేళ్లలో అనేక అక్రమాలకు పాల్పడ్డారని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అదేవిధంగా వైసీపీ కార్యకర్తల కంటే దారుణంగా పనిచేసిన పలువురు పోలీసు అధికారులను సైతం చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇప్పటికీ చార్జ్‌షీట్లు వేయలేదు

సాధారణంగా ఏదైనా సంఘటన జరిగితే 90 రోజుల్లోగా చార్జ్‌షీట్ వేయాలి. అయితే అంగళ్లు సంఘటన జరిగిన నేటికి ఏడాది దాటుతున్నా చార్జ్‌షీటు వేయలేదు. కనీసం విచారణ కూడా పూర్తి చేయలేదు. వైసీపీ నాయకులు చెప్పిన వాళ్లందరినీ కేసుల్లో ఇరికించి జైలుకు పంపించారు. అప్పుడు ఇక్కడ ఉన్న పోలీసు అధికారులూ బదిలీపై వెళ్లిపోయారు. అంగళ్లు కేసులు అటకెక్కాయి.

రేషన్ మాఫియాలో అన్నిపార్టీల వారూ!

- నన్నూ ప్రలోభపెట్టాలని చూశారు
- వెండి కిరీటంతో సన్మానం చేయబోయారు
- ఇంకొకరు బంగారపు ఉంగరం తీసుకొచ్చారు
- బాపట్ల ఎమ్మెల్యే ఆసక్తికర వ్యాఖ్యలు

గుంటూరు సిటీ, ఆగస్టు 3: 'నేను గెలిచానని కొందరు నాకు సన్మానం చేస్తామన్నారు. సరే అని ఒప్పుకున్నా. ఆ సన్మానంలో నాకు వెండి కిరీటం పెట్టబోయారు. దాని విలువ ఎంత అని అడిగా. రూ.37 వేలు అన్నారు. నేనే మరో రూ.13 వేలు ఇచ్చి మొత్తం రూ.50 వేలు మున్సిపాలిటీకి చందాగా ఇమ్మన్నా. తర్వాత తెలిసింది. వెండి కిరీటం పెట్టిన వాళ్లు దొంగ బియ్యం అమ్మే(రేషన్ బియ్యం) వాళ్లని. రెండ్రోజులకు ఇంకొకరు బంగారపు ఉంగరం తెచ్చారు. వాళ్లదీ అదే బాపతి. ఎటుపోతోంది ఈ వ్యవస్థ' అంటూ బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రాజు వ్యాఖ్యానించారు. శనివారం గుంటూరులో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన ఆసక్తికరమైన విషయాలు మాట్లాడారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాలో అన్ని పార్టీల వాళ్లు ఉన్నారన్నారు. ఆ బియ్యాన్ని వ్యాపారులు కాకినాడ పోర్టు, చెన్నై ప్రాంతానికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. గెలిచిన తర్వాత ఎన్నికల్లో ఖర్చు చేసిందంతా సంపాదించాలన్న ఆలోచనతో కిందిస్థాయి ప్రజాప్రతినిధులు కూడా ఉండటం వల్ల అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయిందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు కలిసి బియ్యం అక్రమ రవాణాకు తోడ్పడుతున్నారని పేర్కొన్నారు. అవసరం అయిన వాళ్లకు మాత్రమే బియ్యం ఇచ్చేలా ఆలోచన చేయాలని, మిగిలిన వారికి నగదు బదిలీ చేస్తే బాగుంటుందని నరేంద్రవర్మ సూచించారు. ఉపాధి హామీ పథకంలో కూడా కొన్ని కోట్ల నష్టం వాటిల్లుతోందని చెప్పారు. పేర్లు రాసుకుని పనికి వచ్చినా/రాకపోయినా డబ్బులిస్తున్నారన్నారు. బాపట్ల ఎమ్మెల్యే చేసిన సూచనపై అక్కడే ఉన్న కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పందించారు. ఉపాధి హామీ పథకంలో అవినీతి జరగకుండా చూసేందుకు కసరత్తు చేస్తున్నామని చెప్పారు. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందిస్తూ బియ్యం అక్రమ రవాణా నివారించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక రూ.155 కోట్ల విలువైన 53 వేల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామని చెప్పారు. శుక్రవారం చీరాలలో కూడా నాలుగు రేషన్ షాపులపై దాడులు చేసి బియ్యం నిల్వలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

'బాట్'తో బోల్తా కొట్టిస్తున్నారు



అడ్డదారుల్లో ఇసుక తరలింపు బుకింగ్.. బాట్ సాఫ్ట్‌వేర్ ఆసరాగా కొందరు లారీ యజమానుల అక్రమాలు

సైబర్ క్రైమ్‌కు టీజీఎండీసీ ఫిర్యాదు .. ఇసుక తవ్వకాలు, తరలింపుపై త్వరలో డ్రోన్ నిఘా

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీజీఎండీసీ) ద్వారా ఇసుక తరలించే లారీల యజమానులు అడ్డదారుల్లో బుకింగ్‌లు చేసుకోవడం అధికారులకు తలనొప్పిగా మారింది. కొందరికే పదేపదే ఆర్డర్లు లభిస్తుండగా, ఇతరులు ఎన్ని పర్యాయాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలనుకున్నా అవకాశం దక్కటం లేదు. ఈ సమస్యపై అధికారులు ఐటీ నిపుణులను సంప్రదించగా, బాట్ అనే సాఫ్ట్‌వేర్ ద్వారా ఈ తతంగం నడుస్తున్నట్లు వెల్లడైంది. కంప్యూటర్ సెంటర్లు, మీసేవా కేంద్రాల్లో ఉపయోగిస్తున్న ఈ సాఫ్ట్‌వేర్ గురించి తెలుసుకున్న ఇసుక లారీల ఓనర్లు.. టీజీఎండీసీ వెబ్‌సైట్‌లో బుకింగ్ కోసం పడిగాపులు పడకుండా, బాట్ సాయంతో అవకాశాలు దక్కించుకుంటున్నట్లు తెలిసింది. దీనిపై చైర్మన్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. ఒకసారి లారీ ఓనర్ తన దరఖాస్తును కంప్యూటర్ సెంటర్‌లో అప్‌లోడ్ చేసుకుంటే తరువాత పదేపదే హిట్‌చేస్తూ బాట్ సాయంతో బుకింగ్ పొందేందుకు అవకాశం ఉందన్నారు. కొన్ని కంప్యూటర్ సెంటర్ల నిర్వాహకులు ఒక్కో బుకింగ్‌కు రూ.5000 చార్జ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద అక్రమ తవ్వకాలను నిలువరించేందుకు, స్టాక్ యార్డుల నుంచి ఇసుక తరలింపుపై నిఘా ఉంచేందుకు త్వరలో డ్రోన్లు వినియోగించనున్నామని చెప్పారు. ఒకటి, రెండు నెలల్లో దీనిని అమల్లోకి తీసుకొచ్చే అవకాశం ఉందని అనిల్‌కుమార్ తెలియజేశారు.

ఎస్సీ వర్గీకరణను ఒప్పుకోం

- వ్యతిరేకంగా పోరాటం చేస్తాం
- మాలమాదిగలను విడదీసే కుట్ర
- ఓటు బ్యాంక్ రాజకీయం: హర్షకుమార్
- వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఏర్పాటు
- మాలమహానాడు, సంఘాలు రద్దు చేసుకునిపోరాట సమితిలోకి రావాలని పిలుపు
- రాజమహేంద్రవరంలో అత్యవసర సభ
- స్టేట్ కన్వీనర్‌గా హర్షకుమార్



రాజమహేంద్రవరంలో జరిగిన వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అత్యవసర సభకు హాజరైన ఆంధ్ర, తెలంగాణ మాల ప్రతినిధులు, మాట్లాడుతున్న హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 3: ఎస్సీ వర్గీకరణను ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోబోమని, వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని నిర్ణయించినట్టు అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ వెల్లడించారు. వర్గీకరణ చేస్తే ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు పతనం తప్పదని హెచ్చరించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శనివారం అత్యవసర మాలల సమావేశం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ హర్షకుమార్ నేతృత్వంలో వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఏర్పాటైంది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దేశంలో మాల మాదిగలను విడదీసేందుకు ఓటు బ్యాంక్ రాజకీయాలకు పెద్దకుట్ర చేశారని ధ్వజమెత్తారు. సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పుతో ఒక్కసారిగా జాతికి జరుగుతున్న అన్యాయంపై చాలా బాధ కలిగిందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం రిజర్వేషన్లు పొందుతున్న వారిలో.. సమాజంలో అగ్రవర్ణాలతో సమాన స్థాయికి ఎదిగిన వారిని తొలగించడం కాని లేదా దారుణస్థితిలో ఉండి రిజర్వేషన్లు పొందని వారిని తిరిగి చేర్చడం కాని చేసే అధికారం రాష్ట్రపతి, పార్లమెంట్‌కు ఉంటుందన్నారు. విభజించాలంటే పార్లమెంట్‌లో సవరణ చేసి మెజార్టీ తీర్మానం చేయాలని, దాని ప్రకారం సుప్రీంకోర్టు తీర్పు ఉంటుందన్నారు. కానీ ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఏకపక్షంగా తీర్పుఇవ్వడం దారుణమన్నారు. ధర్మాసనంలోని న్యాయమూర్తి జస్టిస్ త్రివేది ఈ తీర్పును వ్యతిరేకించారని చెప్పారు. మాలమాదిగలను విడదీసి భవిష్యత్‌లో రిజర్వేషన్లు ఎత్తివేయాలనే కుట్ర దాగి ఉందన్నారు. మాలమహానాడు, సంఘాలను రద్దు చేసుకుని అందరు వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితిలోకి రావాలని విజ్ఞప్తి చేశారు. అందరం ఐక్యమత్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మల్లెల వెంకట్రావు సుప్రీంకోర్టులో వాజ్యం దాఖలు చేసే పనిలో ఉన్నారని, తాను కూడా న్యాయపోరాటం చేస్తానన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తామని ఇప్పటికే ప్రకటించారని, ఆంధ్రప్రదేశ్‌లో వర్గీకరణ జరిగితే తీవ్ర స్థాయిలో ఉద్యమాలు చూస్తారని హెచ్చరించారు. వర్గీకరణ వ్యతిరేక ఉద్యమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మాలలంతా భాగస్వాములు అవుతారన్నారు. లీగల్ కమిటీ, యువజన కమిటీలను ఏర్పాటు చేయాలని ఆయా నాయకులకు హర్షకుమార్ సూచించారు. తెలంగాణ మాల సంఘాల నేతలు టి.రవి (మిర్యాలగూడ), బాలస్వామి (నాగర్‌కర్నూల్), అనిల్‌కుమార్ (పాలమూరు), డాక్టర్ మునిబాబు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అంబటి కొండలరావు, బి.చంద్రయ్య (ప్రకాశం), వెంకటేశ్వరరావు (అనకాపల్లి), మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి బెన్నయ్య, అరుణకుమారి (గుంటూరు), జ్యోతి మేరి, ఈశ్వరి (ఎన్‌టీఆర్ జిల్లా), జంగా బాబూరావు, జీవీ శ్రీరాజ్, రఘుబాబు మాట్లాడారు. మాల ఉద్యోగుల సంఘం స్టేట్ కన్వీనర్‌గా భరత్ భూషణ్‌ను ప్రకటించారు. సమావేశానికి ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి మాలమహానాడు, మాలసంఘాలు, మాల ఉద్యోగ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఐదు తీర్మానాలు చేశారు. స్టేట్ కన్వీనర్‌గా హర్షకుమార్ నియమితులయ్యారు. ఈ నెల 15న నల్లబ్యాడ్జీలు ధరించి స్వాతంత్రోద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.



ఎంపీ కేశినేని చిన్ని పుట్టిన రోజు వేడుకల్లో మాట్లాడుతున్న బుద్దా వెంకన్న

పదవి లేక మాట చెల్లటం లేదు

- ఏమీ చేయలేకపోతున్నా... కార్యకర్తలూ క్షమించాలి
- ఎంపీ కేశినేని చిన్ని పుట్టిన రోజు వేడుకల్లో బుద్దా వెంకన్న

విజయవాడ(వన్‌టౌన్) ఆగస్టు 3: 'పదవి లేకపోవటంతో నా మాట చెల్లటం లేదు. ప్రజలకు, నన్ను నమ్ముకున్నవారికి పనులు చేసి పెట్టలేకపోతున్నా' అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న అన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పుట్టినరోజు వేడుకల కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శివనాథ్ కూడా పాల్గొన్న ఈ కార్యక్రమంలో తొలుత కేక్ కట్ చేసి వెంకన్న, నాగుల్ మీరా ఆయనకు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ, 'తాజాగా జరిగిన సీఐల బదిలీల్లో ఎమ్మెల్యేలు చెప్పిన వారినే నియమించారు. ప్రస్తుత పరిస్థితుల్లో నేను ఇతరులపై ఆధారపడాల్సి వస్తోంది. నన్ను నమ్ముకున్న వారికి ఏమీ చేయలేని పరిస్థితి వచ్చింది. కార్యకర్తలు నన్ను క్షమించాలి' అని కోరారు. అయిదేళ్ల వైసీపీ దుర్మార్గపు పాలనలో అనేక పోరాటాలు చేసినట్టు చెప్పారు. తనపై 37 కేసులు పెట్టారని, పార్టీ కోసమే భరించానని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చినా తనకు న్యాయం జరగలేదని అన్నారు. ఈ సందర్భంగా చిన్ని స్పందిస్తూ... 'పొత్తుల్లో భాగంగా పశ్చిమ సీటు బీజేపీకి ఇవ్వవలసి వచ్చింది. ఈ నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఇబ్బంది పడుతున్నారన్న విషయం తెలుసు. సాధ్యమైనంత త్వరగా ఈ విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకువెళతా. త్వరలోనే బుద్దా వెంకన్న, నాగుల్ మీరాకు మంచి పదవులు వస్తా' అని అన్నారు.

కమీషన్ ఆశచూపి.. క్రెడిట్ కార్డులతో పెట్రోల్ బంక్‌లకు టోకరా

- ఏపీకి చెందిన ఐదుగురి అరెస్టు

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 3: డెబిట్, క్రెడిట్ కార్డుల లావాదేవీలు జరిపే స్వైపింగ్ మెషీన్(పీఓఎస్ యంత్రాలు)ల్లోని ఆప్షన్లను వాడుకుని పెట్రోల్ బంకు యజమానులకు టోకరా వేస్తున్న కేటుగాళ్లను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఏపీలోని పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం గుత్తికొండకు చెందిన వేముల శ్రీనివాసరావు, నేలటూరి రవికుమార్, మలపతి శౌరీ, నర్సారావుపేట మండలం రావిపాడుకు చెందిన ఆనాల శివ, కారంపుడికి చెందిన కడితం సిద్ధార్థరెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నిందితులు ఐదుగురు ఓ ముఠాగా ఏర్పడి ద్విచక్రవాహనాలపై తిరుగుతూ ఏపీ సరిహద్దుల్లోని పెట్రోల్ బంకుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. పెట్రోల్ బంకులోకి వెళ్లి తమ బంధువు ఆస్పత్రిలో ఉన్నారని, అత్యవసరంగా నగదు కావాలని, తమ క్రెడిట్ కార్డు నుంచి నగదు డ్రా చేసి ఇస్తే కొంత కమీషన్‌గా ఇస్తామని సాయం చేయమని వేడుకునేవారు. బంక్ నిర్వాహకులు అంగీకరిస్తే తమ క్రెడిట్ కార్డు నుంచి రూ.20వేల నుంచి రూ.30వేల వరకు డ్రా చేసేవారు. ఈ క్రమంలో ముఠా సభ్యులు బంక్ ఆపరేటర్‌ను మాటల్లో పెట్టి పీఓఎస్ యంత్రాన్ని తమ చేతుల్లోకి తీసుకుని మెషీన్‌లోని 'వాయిడ్' అనే ఆప్షన్ వాడి తాము చేసిన లావాదేవీని రద్దు చేసేవారు. దీంతో డ్రా చేసిన సొమ్ము తిరిగి వారి క్రెడిట్ కార్డులో జమయ్యేది. అలాగే, బంకు నిర్వాహకులు నుంచి నగదు కూడా తీసుకుని పరారయ్యేవారు. వేముల శ్రీనివాసరావు, ఆనాల శివ తొలుత నర్సారావుపేట, రావిపాడులోని బంకుల్లో ఈ తరహా మోసాలు చేశారు. ఇదే టెక్నిక్‌తో వీరంతా కలిసి నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లోని పలు పెట్రోల్ బంకుల్లోనూ మోసాలకు పాల్పడ్డారు. ఇందుకు సంబంధించి వివిధ పోలీసుస్టేషన్లలో వీళ్లపై కేసులు కూడా నమోదయ్యాయి. అయితే, నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై శెట్టిపాలెం ఎక్స్‌రోడ్డులో శుక్రవారం ద్విచక్రవాహనంపై వెళుతున్న వీరు అనుమానాస్పదంగా కనిపించడంతో అడ్డుకున్న వేములపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరాలు బయటపెట్టారు. నిందితుల నుంచి రూ.1.80లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు, బైక్, క్రెడిట్‌కార్డును స్వాధీనం చేసుకున్నారు.

స్టాక్ మార్కెట్ పేరుతో.. 2.43 కోట్లకు టోకరా

- టెకీకి సైబర్ నేరగాళ్ల వల.. రూ.28 లక్షలను వెనక్కి రప్పించిన పోలీసులు

పటాన్‌చెరు, ఆగస్టు 3: స్టాక్ మార్కెట్లో పెట్టుబడుల పేరుతో సైబర్ నేరగాళ్లు ఓ టెకీకి రూ.2.43 కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టిన ఉదంతమిది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం.. ఏపీఆర్ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ జూన్ 19న స్టాక్ మార్కెట్, ఇన్వెస్ట్‌మెంట్‌కు సంబంధించి ఫేస్‌బుక్‌లో కనిపించిన ప్రకటనకు ఆకర్షితుడయ్యాడు. అందులో చూపిన లింకును క్లిక్ చేయగా.. సైబర్ నేరగాళ్లు లైన్‌లోకి వచ్చి.. 'మోతీలాల్ ఓస్వాల్ స్ట్రాటజీ' అనే పేరుతో ఉన్న గ్రూప్‌లో యాడ్ చేశారు. వారు సూచించిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న సదరు టెకీ.. తొలుత కొద్ది మొత్తంలో పెట్టుబడి పెట్టారు. లాభాలు వస్తున్నట్లు సైబర్ నేరగాళ్లు చూపడంతో.. 22 సార్లు తన బ్యాంకు ఖాతా నుంచి రూ.2.43 కోట్లను బదిలీ చేశాడు. రూ.6 కోట్ల మేర లాభం వచ్చినట్లు యాప్‌లో చూపుతుండడంతో.. విత్‌డ్రాకు ప్రయత్నించాడు. అది సాధ్యం కాకపోవడంతో సైబర్ నేరగాళ్లకు విషయం చెప్పి.. సమస్యను పరిష్కరించాలని కోరాడు. వారు కుంటిసాకులు చెబుతుండడంతో.. మోసం జరిగిందని గ్రహించి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భారీ మోసం కావడంతో కేసును సైబర్ క్రైమ్ సెల్‌కు బదిలీ చేశామని, సైబర్ కేటుగాళ్ల ఖాతా నుంచి రూ.28 లక్షలను వెనక్కి రప్పించామని ఇన్‌స్పెక్టర్ వివరించారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● ఆదివారం 4 ఆగస్టు 2024
diksuchi@andhrajyothy.co

ఆంధ్ర యూనివర్సిటీలో
డిస్టెన్స్, ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లు

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(ఏయూ-సీడీఓఈ) ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(ఎస్‌డీఈ)- ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్, ఆన్‌లైన్ మోడ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. అడ్మిషన్ తీసుకున్న అభ్యర్థులకు సంబంధిత స్టడీ మెటీరియల్ అందిస్తారు. ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.




అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు

- బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. బీఎస్సీ ప్రోగ్రామ్‌ను ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. మిగిలినవాటిని ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో చదువుకోవచ్చు.
- **బీఎస్సీ గ్రూప్ సబ్జెక్టులు:** మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్, బోటనీ, జువాలజీ
- **అర్హత:** బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూప్‌తో ఇంటర్/రెండేళ్ల ఐటీఐ/పాలిటెక్నిక్ డిప్లొమా ఉత్తీర్ణులు; వెటర్నరీ/అగ్రికల్చర్ డిప్లొమా పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏపీఓఎస్/ఎన్ఐఓఎస్ అభ్యర్థులు కూడా అర్హులే. బీఎస్సీ(ఎంపీసీ/ఎంపీసీఎస్/ఎంస్టాట్‌సీఎస్) కోర్సులకు పాలిటెక్నిక్ డిప్లొమా/ఇంటర్(ఎంపీసీ) ఉత్తీర్ణులు; మేథమెటిక్స్‌లో బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసిన ఒకేషనల్ అభ్యర్థులు అర్హులు. బీఎస్సీ(సీబీజడ్) కోర్సుకు ఇంటర్(బైపీసీ)/డిప్లొమా(వెటర్నరీ/అగ్రికల్చర్) ఉత్తీర్ణులు; సైన్స్‌లో బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసిన ఒకేషనల్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు

- ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లను ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.
- **ఎంఏ స్పెషలైజేషన్‌లు:** తెలుగు, ఇంగ్లీష్, ఎకనామిక్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హిస్టరీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, మేథమెటిక్స్
- **ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు:** సైకాలజీ, మేథమెటిక్స్, బోటనీ, ఫిజిక్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, జువాలజీ
- **ఎంబీఏ స్పెషలైజేషన్‌లు:** హెచ్‌ఆర్‌ఎం, ఫైనాన్స్, మార్కెటింగ్
- **అర్హత:** ఎంసీఏలో ప్రవేశానికి బీటెక్(సీఎస్ఈ)/బీసీఏ ఉత్తీర్ణులు; ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి బీఎస్సీ/బీకాం/బీఏ పూర్తిచేసిన వారు; బీఏ/బీకాం ఉత్తీర్ణతతోపాటు ఏయూ నుంచి పీజీడీసీఏ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మిగిలిన ప్రోగ్రామ్‌లకు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. (ఎంఏ/ఎమ్మెస్సీ)(మేథమెటిక్స్), ఎమ్మెస్సీ(బోటనీ/ఫిజిక్స్/ఆర్గానిక్ కెమిస్ట్రీ/జువాలజీ), ఎంఏ(హిందీ) ప్రోగ్రామ్‌లకు మాత్రం డిగ్రీ స్థాయిలో సంబంధిత స్పెషలైజేషన్ సబ్జెక్ట్ చదివి ఉండాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ప్రింట్ మెటీరియల్ కోసం చెల్లించాల్సిన ఫీజు:** సెమిస్టర్‌కు రూ.600
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.andhrauniversity-sde.com

జేఎన్‌టీయూకేలో స్పాన్సర్డ్ ఎంటెక్



కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే)- స్పాన్సర్డ్ కేటగిరీ కింద ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. కాకినాడ, నర్సరావుపేట క్యాంపస్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. అకడమిక్ మెరిట్, గేట్ 2024/జీప్యాట్ 2024/పీజీఈసెట్ 2024 ర్యాంక్, అనుభవం, కౌన్సెలింగ్‌ల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. స్పెషలైజేషన్‌కు అయిదు సీట్లు చొప్పున మొత్తం 125 సీట్లు ఉన్నాయి. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు స్కాలర్‌షిప్‌లు, స్టయిపెండ్ లభించవు.

క్యాంపస్‌లు

- యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కాకినాడ
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, జేఎన్‌టీయూకే క్యాంపస్
- యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, నర్సరావుపేట

ఎంటెక్ విభాగాలు-స్పెషలైజేషన్‌లు

- **సివిల్ ఇంజనీరింగ్:** స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, సాయిల్ మెకానిక్స్ అండ్ ఫౌండేషన్ ఇంజనీరింగ్, హైడ్రాలిక్స్ అండ్ వాటర్ రిసోర్స్ ఇంజనీరింగ్
- **ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్:** హై ఓల్టేజ్ ఇంజనీరింగ్, అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రికల్ పవర్ సిస్టమ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ డ్రైవ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్
- **మెకానికల్ ఇంజనీరింగ్:** క్యాడ్/క్యామ్, మెషిన్ డిజైన్, థర్మల్ ఇంజనీరింగ్
- **ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్:** కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ అండ్ సిగ్నల్ ప్రాసెసింగ్, కంప్యూటర్ అండ్ కమ్యూనికేషన్, వీఎల్ఎస్ఐ అండ్ ఎంబెడెడ్ సిస్టమ్స్
- **కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ
- **రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్:** రెన్యూవబుల్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్
- బయోటెక్నాలజీ, నానోటెక్నాలజీ, రిమోట్ సెన్సింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఏవియానిక్స్, ఎన్విరాన్‌మెంటల్ ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ.

అర్హత: ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి సంబంధిత ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్/ఏఎంఐఈ పూర్తిచేసి ఉండాలి. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన ప్రకారం ఎంసీఏ లేదా ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్/స్టాటిస్టిక్స్/మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్/అప్లయిడ్ స్టాటిస్టిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/జియో ఫిజిక్స్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్/కంప్యూటర్ అప్లికేషన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్/కెమిస్ట్రీ/బయో కెమిస్ట్రీ/మైక్రోబయాలజీ/బయోటెక్నాలజీ/లైఫ్ సైన్సెస్/ఎర్త్ సైన్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్/డెయిరీ టెక్నాలజీ) ఉత్తీర్ణులు; ఎంబీబీఎస్/బీడీఎస్/బీ ఫార్మసీ/బీవీఎస్సీ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. డిగ్రీ/పీజీ స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. గేట్ 2024/జీప్యాట్ 2024/పీజీఈసెట్ 2024 అర్హత తప్పనిసరి. అభ్యర్థులకు కనీసం ఏడాది ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి. స్పాన్సర్‌షిప్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **సెమిస్టర్ ఫీజు:** రూ.25,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 23
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** డైరెక్టర్, అడ్మిషన్స్, జేఎన్‌టీయూకే, కాకినాడ-533003
- **వెబ్‌సైట్:** www.jntuk.edu.in

డిప్లొమా ఇన్ రైల్వే ఇంజనీరింగ్

న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ పర్మనెంట్ వే ఇంజనీర్స్(ఇండియా)- డిప్లొమా ఇన్ రైల్వే ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. ఇది కరస్పాండెన్స్ కోర్సు. ఇందులో ఇండియన్ రైల్వేస్‌కు సంబంధించిన స్ట్రక్చర్, ఫంక్షనింగ్ అంశాలు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌నకు కోల్‌కతాలోని ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్(ఇండియా) గుర్తింపు ఉంది. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్(ఇండియా)లో సీనియర్ టెక్నీషియన్ మెంబర్ అర్హతతోపాటు హయ్యర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కోర్సులు చేసే అవకాశం లభిస్తుంది. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని పూర్తిగా నింపి కింది చిరునామాకు పంపాలి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి సైన్స్/కామర్స్/ఇంజనీరింగ్ విభాగాల్లో బీఎస్సీ/బీకామ్/బీఈ ఉత్తీర్ణులు; ఏదేని ఇంజనీరింగ్ విభాగంలో మూడేళ్ల డిప్లొమా ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్/సైన్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి బీఏ డిగ్రీ పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

- **ప్రోగ్రామ్ ఫీజు:** మొదటి సెమిస్టర్‌కు రూ.3500+జీఎస్టీ రూ.630; రెండో సెమిస్టర్‌కు రూ.4,000+జీఎస్టీ రూ.720
- **దరఖాస్తు ఫీజు:** రూ.4330
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **చిరునామా:** ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ పర్మనెంట్ వే ఇంజనీర్స్(ఇండియా), రూమ్ నెం.109, ఎన్‌సీఆర్‌పీయూ బిల్డింగ్, శంకర్ మార్కెట్ పక్కన, న్యూఢిల్లీ- 110001.
- **వెబ్‌సైట్:** ipweindia.org.in



ఎస్ఎస్‌సీ- కంబైన్డ్ హిందీ ట్రాన్స్‌లేటర్స్ ఎగ్జామినేషన్

312 ఖాళీలు



కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో హిందీ ట్రాన్స్‌లేటర్, జూనియర్ ట్రాన్స్‌లేటర్ ఆఫీసర్, జూనియర్ ట్రాన్స్‌లేటర్ పోస్టుల భర్తీకి నిర్వహించే 'కంబైన్డ్ హిందీ ట్రాన్స్‌లేటర్స్ ఎగ్జామినేషన్ 2024' నోటిఫికేషన్‌ను స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా 312 ఖాళీలు భర్తీ చేస్తారు.

- కంబైన్డ్ హిందీ ట్రాన్స్‌లేటర్స్ ఎగ్జామినేషన్- 2024

1. జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్స్(జేహెచ్‌టి)
2. జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్(జేటీవో)
3. జూనియర్ ట్రాన్స్‌లేటర్(జేటీ)
4. సీనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్(ఎస్‌హెచ్‌టీ)
5. సీనియర్ ట్రాన్స్‌లేటర్(ఎస్‌టీ)

అర్హతలు: పోస్టును అనుసరించి మాస్టర్ డిగ్రీ(హిందీ/ఇంగ్లీష్) ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ స్థాయిలో హిందీ/ఇంగ్లీష్ సబ్జెక్టు పాఠ్యాంశంగా ఉండాలి. దీంతోపాటు ట్రాన్స్‌లేషన్(హిందీ/ఇంగ్లీష్) డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సు చేసి ఉండాలి. లేదా కేంద్ర ప్రభుత్వ సంస్థలో ట్రాన్స్‌లేషన్ అనుభవం ఉండాలి. సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీతో పాటు ట్రాన్స్‌లేషన్ అనుభవం ఉండాలి. బ్యాచిలర్ డిగ్రీ/పీజీ(హిందీ/ఇంగ్లీష్) అర్హతతో పాటు తగిన అనుభవం ఉండాలి. డిగ్రీ స్థాయిలో హిందీ/ఇంగ్లీష్ సబ్జెక్టు పాఠ్యాంశంగా ఉండాలి.

వయోపరిమితి: 2024 ఆగస్టు 1 నాటికి 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
నిబంధనల ప్రకారం వయోపరిమితిలో సడలింపులు ఉంటాయి.

జీతభత్యాలు: నెలకు సీనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్/సీనియర్ ట్రాన్స్‌లేటర్ పోస్టులకు రూ.44,900 - రూ.1,42,400. ఇతర పోస్టులకు రూ.35,400 - రూ.1,12,400.

పరీక్ష విధానం: ఆన్‌లైన్ పరీక్ష. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ టైప్‌లో ఉంటాయి. జనరల్ హిందీ నుంచి 100 ప్రశ్నలు(100 మార్కులు), జనరల్ ఇంగ్లీష్ నుంచి 100 ప్రశ్నలు(100 మార్కులు) ఇస్తారు. పరీక్ష వ్యవధి రెండు గంటలు.

పేపర్-2(డిస్క్రిప్టివ్): ఈ పరీక్షను 200 మార్కులకు నిర్వహిస్తారు. ట్రాన్స్‌లేషన్, ఎస్సే ఉంటుంది. పరీక్ష వ్యవధి రెండు గంటలు.

దరఖాస్తు రుసుము: జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీలకు రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు మినహాయింపు ఉంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 25

కంప్యూటర్ ఆధారిత పరీక్ష(పేపర్-1): అక్టోబరు/నవంబరులో

వెబ్‌సైట్: https://ssc.nic.in/

జాబ్ కార్నర్

హిందుస్థాన్ కాపర్‌లో ట్రేడ్ అప్రెంటిస్‌లు

195 ఖాళీలు

మధ్యప్రదేశ్‌లోని హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్‌కు చెందిన మలాంజ్‌ఖండ్ కాపర్ ప్రాజెక్ట్... ట్రేడ్ అప్రెంటిస్ శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: ట్రేడ్ అప్రెంటిస్

ట్రేడ్: మేట్(మైన్స్), బ్లాస్టర్(మైన్స్), డీజిల్ మెకానిక్, ఫిట్టర్, టర్నర్, వెల్డర్(గ్యాస్ అండ్ ఎలక్ట్రిక్), ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, డ్రాఫ్ట్స్‌మన్(సివిల్), డ్రాఫ్ట్స్‌మన్(మెకానికల్), కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, సర్వేయర్, ఏసీ అండ్ రిఫ్రిజిరేషన్ మెషిన్, మేసన్, కార్పెంటర్, ప్లంబర్, హార్టికల్చర్ అసిస్టెంట్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్స్, సోలార్ టెక్నీషియన్(ఎలక్ట్రీషియన్).

అర్హత: 10వ తరగతి, సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణత

వయోపరిమితి: 2024 ఆగస్టు 1 నాటికి 18 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: ఐటీఐ, పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఆగస్టు 20

వెబ్‌సైట్: https://www.hindustancopper.com/

HINDUSTAN COPPER LIMITED (A Government of India Enterprise)

ఎయిమ్స్‌లలో నర్సింగ్ ఆఫీసర్లు

న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌తో దేశవ్యాప్తంగా ఉన్న ఎయిమ్స్ సంస్థల్లో నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి సంబంధించిన నర్సింగ్ ఆఫీసర్ రిక్రూట్‌మెంట్ కామన్ ఎలిజిబిలిటీ టెస్ట్(నార్‌సెట్)-7 నోటిఫికేషన్ విడుదలైంది.

ఎయిమ్స్ సంస్థలు: ఎయిమ్స్ భటిండా, ఎయిమ్స్ భువనేశ్వర్, ఎయిమ్స్ బిలాస్‌పూర్, ఎయిమ్స్ దేవగఢ్, ఎయిమ్స్ గోరఖ్‌పూర్, ఎయిమ్స్ గువహటి, ఎయిమ్స్ జోధ్‌పూర్, ఎయిమ్స్ కల్యాణి, ఎయిమ్స్ మంగళగిరి, ఎయిమ్స్ నాగ్‌పూర్, ఎయిమ్స్ రాయ్‌బరేలీ, ఎయిమ్స్ న్యూఢిల్లీ, ఎయిమ్స్ పట్నా, ఎయిమ్స్ రిషికేశ్, ఎయిమ్స్ విజయ్‌పూర్.

అర్హత: డిప్లొమా(జీఎన్ఎం)తో పాటు రెండేళ్ల పని అనుభవం లేదా బీఎస్సీ(ఆనర్స్) నర్సింగ్/బీఎస్సీ నర్సింగ్/బీఎస్సీ(పోస్ట్ సర్టిఫికెట్)/పోస్ట్ - బేసిక్ బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణులై ఉండాలి. స్టేట్/ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్‌లో నర్సులుగా రిజిస్టరై ఉండాలి.

వయోపరిమితి: 18-30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు పదేళ్లు, ఎక్స్-సర్వీస్‌మన్‌లకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.

జీతభత్యాలు: రూ.9,300 - రూ.34,800తో పాటు రూ.4600 గ్రేడ్ పే అందుతుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్/ఓబీసీ అభ్యర్థులకు రూ.3000; ఎస్సీ/ఎస్టీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.2400; పీడబ్ల్యూడీ అభ్యర్థులకు మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: నార్‌సెట్-7 ప్రిలిమినరీ, ప్రధాన పరీక్షలు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 21

సీబీటీ ప్రిలిమినరీ పరీక్ష: సెప్టెంబరు 15

సీబీటీ మెయిన్ పరీక్ష: అక్టోబరు 4

వెబ్‌సైట్: https://www.aiimsexams.ac.in/



లిటిల్స్



మీకు తెలుసా?

- ధృవాల్లో ఉండే పెంగ్విన్స్ గుంపులు గుంపులుగా ఉంటాయి. వీటి రెక్కలు పక్షులకంటే బలమైనవి. దీంతో పాటు ఇవి వేడిగా ఉంటాయి. ముఖ్యంగా సముద్రం అడుగులో పెంగ్విన్స్ ఈతకొడతాయి. అంతేకానీ గాలిలో ఎగరలేవు.
- పెంగ్విన్స్ పక్షి జాతికి చెందినవి. వీటి కాళ్ల మధ్య దూరం ఉండటం వల్ల ఇవి మనిషిలా నడవగలవు.
- వీటి నోటిలో దంతాలు ఉండవు.
- ...అంటార్కిటికాలోనే మాత్రమే జీవిస్తాయి.
- డైనోసార్లు అంతమైంది మూడు మిలియన్ల సంవత్సరాల నుంచి అయితే.. పెంగ్విన్స్ చివరి శిలాజాలం 62 మిలియన్ల క్రితం అని పరిశోధకులు తేల్చారు.
- పెంగ్విన్లు అన్నీ నలుపు, తెలుపు రంగులోనే ఉంటాయి. ఇవి ఆహారం కోసం నీటిలోకి 530 మీటర్లు సైతం డైవ్ చేస్తాయి.
- వీటి సమూహాన్ని 'రాఫ్ట్' అంటారు.



- ఇరవై రెండు మిలియన్ల క్రితం నుంచి పెంగ్విన్స్ ఉన్నాయని.. అది కూడా ఆస్ట్రేలియాలోనే అవి ఉండేవని పరిశోధకులు చెబుతున్నారు. న్యూజిలాండ్‌తో దక్షిణ పసిఫిక్ ఐలాండ్స్‌లో ఇవి కనిపిస్తాయి. వీటిలో 18 రకాల జాతులు ఉన్నాయి.
- ఎంపరర్ పెంగ్విన్స్ అందంగా ఉంటాయి. యంగ్ పెంగ్విన్స్ ముందు భాగం తెల్లగా ఉండి.. నల్లటి మెడ ఉంటుంది. ఈ ఎంపరర్ పెంగ్విన్స్ కేవలం అంటార్కిటికాలోనే మాత్రమే జీవిస్తాయి.
- ఉప్పగా ఉండే సముద్రం నీళ్లను తాగుతాయి. వీటిలో సోడియాన్ని ఫిల్టర్ చేసే నిర్మాణం ఉంటుంది. ఇది ముక్కుద్వారా వెళ్లిపోతుంది.
- ఇవి చేపలను మాత్రమే తింటాయి. తీర ప్రాంతాల్లోకి వచ్చి గూళ్లు ఏర్పరచుకుని ఒకటి లేదా రెండు గుడ్లు మాత్రమే పెడతాయి. ఎంపరర్ పెంగ్విన్స్ ఆహారం లేకుండా 115 రోజులు బతుకుతాయి.

సరైన నీడ ఏది?





6 తేడాలు గుర్తించండి!



చేపలు ఎన్ని?

డైలీ సుడోకు - 375

				5				9
	3		2				5	1
	2			9		7		
5	1			4	8			2
8			9	3			6	5
		4		8			7	
3	7				4		1	
1				7				

సుడోకు - 374 సమాధానం

1	7	2	5	4	6	8	9	3
5	8	3	2	7	9	1	6	4
4	6	9	3	8	1	5	2	7
8	1	4	9	3	5	2	7	6
3	2	6	7	1	4	9	8	5
7	9	5	6	2	8	3	4	1
9	3	1	8	6	7	4	5	2
6	4	8	1	5	2	7	3	9
2	5	7	4	9	3	6	1	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.